
'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ
జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 53

సోమవారం 15-5-2023



'గ్రాండ్‌మాస్టర్' ప్రణీత్
భారత చెస్ 82వ గ్రాండ్‌మాస్టర్‌గా తెలంగాణ కుర్రాడు. -12లో



సొంతిల్లు.. వృద్ధాప్యంలో ఆసరా!
ఇంటిపై రివర్స్ మార్ట్‌గేజ్ రుణం. నెల వారీగా 20 ఏళ్ల పాటు ఆదాయం -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షించిన నేవీ
నేవీకి చెందిన ఐఎన్ఎస్ మర్ముగోవాపై నుంచి బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు.
వివరాలు 6లో ▸



ఓవర్ టు రాజస్తాన్!
తన మొదటి లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తిచేసిన మల్లికార్జున ఖర్గే .. రాజస్తాన్ పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడంపై దృష్టి సారించారు.
వివరాలు 6లో ▸



ఆ 5 శాతమే రాత మార్చింది
కర్ణాటకలో జేడీ(ఎస్) కోల్పోయిన 7% ఓట్లలో 5% ఓట్లను బీజేపీ దక్కించుకోగా, బీజేపీకి పడిన 5% గండిని కాంగ్రెస్ చేజిక్కించుకుంది.
వివరాలు 6లో ▸




బంగ్లా తీరాన్ని తాకిన మోకా
గత రెండు దశాబ్దాల్లో అత్యంత శక్తివంతమైన మోకా తుపాను ఆదివారం బంగ్లాదేశ్, మయన్మార్ మధ్య తీరాన్ని తాకింది.
వివరాలు 6లో ▸

'సెగ'దరగ.. ఇదేం భగభగ!

- రాష్ట్రంలో ఎండలు మరింత పెరగనున్నాయన్న వాతావరణ శాఖ
- సాధారణం కంటే 2–4 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదయ్యే అవకాశం
- ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రయాణాల వాయిదాకు అధికారుల సూచన
- అటు ఏపీలోనూ మండుతున్న ఎండలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మరింతగా మండనున్నాయి. ఈ నెల మొదటి వారమంతా ఉపరితల ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గినప్పటికీ గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సగటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే నమోదవుతుండగా రానున్న మూడు రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత అధికంగా నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో 42–44 డిగ్రీల సెల్సియస్ సగటు ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని అంచనా వేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ ఉష్ణోగ్రతలు 40–42 డిగ్రీల సెల్సియస్ మధ్యన నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో 45.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదవగా మిగతా 5వ పేజీలో ▶



సీఎం ఎంపిక ఖర్గే చేతికి..



- కర్ణాటక సీఎల్పీ ఏకవాక్య తీర్మానం
- సోనియా కోర్టులో బంతి
- నేడు ఢిల్లీకి సిద్ధరామయ్య, డీకే శివకుమార్?
- ఇద్దరి మధ్య పోటీ తీవ్రం

కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక అంత తేలికగా ముగిసేలా కనిపించడం లేదు. సీఎం అభ్యర్థిని నిర్ణయించే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకే నూతన ఎమ్మెల్యేలు కట్టబెట్టారు. అధికారాన్ని ఖర్గేకు అప్పగిస్తూ మాజీ సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన ఏక వాక్య తీర్మానాన్ని ఎమ్మెల్యేలు ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అధిష్టానం తరఫున ఖర్గే నియమించిన ముగ్గురు పరిశీలకులు సీఎం అభ్యర్థిపై ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకుని ఆదివారంకల్లా ఈ తతంగం పూర్తి చేసి సోమవారానికల్లా నివేదిక అందజేస్తారని తెలుస్తోంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కోటిన్నరకు చేరువలో కంటి వెలుగు పరీక్షలు



కంటి వెలుగు కార్యక్రమం కోటిన్నర కంటి పరీక్షలకు చేరువైంది. ఈ ఏడాది జనవరి 18న ప్రారంభమైన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కింద 1,42,30,576 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు.
- వివరాలు 5లో▶

రోడ్డు ప్రమాదంలో ఏడుగురి దుర్మరణం



కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు గాయపడ్డారు.
- వివరాలు 10లో▶

కొత్తకొత్తగా ఉన్నది.. పెళ్లి అక్కడే అన్నది
- వివరాలు 14లో▶

నిరుపేదల ఉపాధిపై రాబందులు వాలిపోయే..

దళితబంధు విందాయే!

చారగొండ మండలం తిమ్మాయిపల్లికి చెందిన రాములు దళితబంధుతో పెద్ద కిరాణాషాపు పెట్టుకో వాలనుకున్నాడు. కానీ తనకు మంజూరైన మొత్తంలో అధికభాగం కమీషన్లకే పోవడంతో మిగతా డబ్బుతో చిన్న దుకాణానికే పరిమితమయ్యాడు.





తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఇటికాల లచ్చయ్యకు రూ.8.40 లక్షలతో 8 గేదెలు ఇచ్చినట్టు చూపి.. నాలుగు మాత్రమే ఇచ్చారు. మిగతా గేదెల కోసం ఆయన సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల కుమ్మక్కు.. కమీషన్ల కక్కుర్తితో అక్రమాలు
- యూనిట్లు ఇవ్వకుండానే ఇచ్చినట్టు లెక్కలు
- సామగ్రి, జీఎస్టీ అంటూ దోపిడీ.. పలు గ్రామాల్లో సగానికి సగం కొట్టేసిన తీరు
- ఇదేమిటని అడిగితే దబాయింపులు
- పైలట్ ప్రాజెక్టు చేపట్టిన మండలాల్లో వరుసగా ఫిర్యాదులు

..రాష్ట్రంలో దళిత బంధు పథకంలో జరుగుతున్న అక్రమాలకు చిన్న ఉదాహరణలివి. 2021 ఆగస్టులో మొదలైన ఈ పథకంలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కక్కుర్తితో భారీగా జరిగిన అవినీతి వెలుగుచూస్తోంది. కొన్నిచోట్ల సామగ్రి ఇప్పిస్తామంటూ, జీఎస్టీ అంటూ కొన్నిచోట్ల దోచేస్తే.. మరికొన్నిచోట్ల నేరుగానే అక్రమాలకు పాల్పడటం, కొందరు లబ్ధిదారుల విషయంలో అయితే పథకం సొమ్ములో ఏకంగా సగం దాకా కాజేయడం విస్మయం కలిగిస్తోంది.

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

దళితబంధు.. రాష్ట్రంలో దళితుల సంక్షేమం, సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వినూత్న పథకం. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయంతో శాశ్వత ఉపాధి మార్గాన్ని చూపడం దీని లక్ష్యం. దళితుల స్థితిగతులను మార్చేందుకు వాసాలమర్రిలో పురుడుపోసుకున్న ఈ పథకం.. హుజూరాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నికతో విస్తరించింది. రాష్ట్రవ్యాప్తంగా అమలు కోసం పైలట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి (తుంగతుర్తి నియోజకవర్గం), చారకొండ (అచ్చంపేట), చింతకాని (మధిర), నిజాంసాగర్ (జుక్కల్) మండలాల్లో దళితులందరికీ.. ఆ తర్వాత రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 మందికి చొప్పున తొలి విడతగా దళిత బంధును అమలు చేశారు. అయితే వాసాలమర్రి, హుజూరాబాద్ వరకు
మిగతా 2వ పేజీలో ▶

సీబీఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్



- ఈ నెల 25న ముగియనున్న ప్రస్తుత డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైస్వాల్ పదవీ కాలం
- జైస్వాల్ తర్వాత దేశంలో అత్యంత సీనియర్ అధికారి ప్రవీణ్‌సూద్

సీబీఐ తదుపరి డైరెక్టర్‌గా కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. ఈ నెల 25న ప్రవీణ్ సూద్ బాధ్యతలు స్వీకరిస్తారు. 59 ఏళ్ల ప్రవీణ్ సూద్ రెండేళ్ల పాటు సీబీఐ డైరెక్టర్ పదవిలో కొనసాగుతారు. 1986 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్ కర్ణాటక కేడర్‌కు చెందినవారు. జైస్వాల్ తర్వాత దేశంలో అత్యంత సీనియర్ అధికారి. ప్రధాని మోదీ, సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్, లోక్‌సభలో విపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి సభ్యులుగా ఉన్న హైపవర్ కమిటీ శనివారంనాటి సమావేశంలో ప్రవీణ్ సూద్ పేరుకు ఆమోద ముద్ర వేసింది.

- వివరాలు 6లో

కొత్త బండి.. రెండు హెల్మెట్లు!



కొనుగోలు తప్పనిసరి చేయాలని పోలీసు శాఖ భావన

- ప్రభుత్వానికి ప్రతిపాదించే యోచన
- ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల మరణాలను నివారించేందుకే..

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాద మృతుల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే ఉంటున్నట్లు గణాంకాలు వెల్లడిస్తుండటం... కొన్ని సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ ధరించినా వెనుక కూర్చొనే వ్యక్తులకు (పిలియన్ రైడర్) హెల్మెట్ లేక ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండటంతో ఈ తరహా ప్రమాదాలను నివారించాలని పోలీసులు భావిస్తున్నారు. వాహనదారుడితో పాటు వెనుక కూర్చొనే వారు సైతం హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించేందుకు సరికొత్త ప్రతిపాదనతో ముందుకు వెళ్లనున్నారు. ద్విచక్ర వాహనం కొనుగోలు సమయంలోనే రెండు నాణ్యమైన

మిగతా 3వ పేజీలో ▶

కేటీఆర్‌తో 'హస్క్ ఇంటర్నేషనల్' భేటీ

- రాష్ట్రంలో రూ. 200 కోట్లతో బయో పెల్లెట్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదన
- సంస్థ కార్యకలాపాలకు పూర్తిగా సహకరిస్తామని కేటీఆర్ హామీ
- లండన్‌లోని అంబేడ్కర్ మ్యూజియం సందర్శన

3లో



మ్యూజియంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి కేటీఆర్

హిందూ ఏక్తా యాత్రలో పాల్గొన్న జనం. (కింద) మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



ఈ రజాకార్ల రాజ్యాన్ని పాతరేస్తాం

- రాష్ట్రంలో రామరాజ్యాన్ని స్థాపిస్తాం
- కరీంనగర్ హిందూ ఏక్తా యాత్రలో బండి సంజయ్
- ఐదు నెలల్లో రాష్ట్రంలో కాషాయ జెండా రెపరెపలు
- కర్ణాటక ఫలితాలతో హిందుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు
- హిందూ సమాజాన్ని సంఘటితం చేసేందుకే ఏక్తా యాత్ర అని వెల్లడి

3లో



ఆ పోస్టులకు ఏజ్ భారమైంది!



- వైద్య విద్య విభాగంలో 'వయో పరిమితి'సంక్షోభం
- 65 ఏళ్లకు పెంపు బిల్లును గవర్నర్ తిరస్కరించడంతో గందరగోళం
- అదనపు డీఎంఈ, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పోస్టులపై ప్రభావం

వైద్య విద్య విభాగంలో విచిత్రమైన వాతావరణం నెలకొంది. డీఎంఈ, అడిషనల్ డీఎంఈ, మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పోస్టులకు సంబంధించిన వయో పరిమితిని 61 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచే బిల్లును గవర్నర్ తిరస్కరించడమే ఇందుకు కారణం. దీనివల్ల డీఎంఈ సహా ఆయా పోస్టుల వయో పరిమితి 61 ఏళ్లకే పరిమితం కానుండగా.. మరోవైపు మెడికల్ కాలేజీల ప్రొఫెసర్ల వయో పరిమితి 65 ఏళ్లుగా కొనసాగనుంది. ఇలా ఒకే విభాగంలో రెండు రకాల వయో పరిమితి కొనసాగనుండడంతో గందరగోళం ఏర్పడుతోంది.

- వివరాలు 2లో

ఇంతంజాకత్




జోష్ ఓకే కానీ.. ష్! ఇక్కడేమో పది మంది సిద్ధరామయ్యలు, డీకేలున్నారు.!!

ఇచ్చి పుచ్చుకున్నారు

అమరావతి కేంద్రంగా చంద్రబాబు క్విడ్ ప్రో కో గుట్టురట్టు

- సుప్రీంకోర్టు అనుమతితో సిట్ దర్యాప్తునకు తొలగిన అడ్డంకులు
- చంద్రబాబు భూ దోపిడీపై కొరడా ఝుళిపించిన ప్రభుత్వం.. ఏ–1 చంద్రబాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌కు అనుమతి
- ఏ–2 నారాయణ పొందిన 75,888 చ.గజాల స్థలాలు కూడా..
- అమరావతిని కొల్లగొట్టిన పచ్చ ముఠా.. లింగమనేని, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ భూములకు వర్తించని ల్యాండ్ పూలింగ్
- ప్రతిగా కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు ఇచ్చిన లింగమనేని

10లో



- హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు కూడా బదలాయింపు
- నారాయణ బినామీల పేరిట 65.50 ఎకరాల కొనుగోలు
- ప్రతిగా సీఆర్‌డీఏ నుంచి 75,888 చ.గజాల స్థలాలు
- ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలు
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు

ఈ నెలాఖరులోగా ఎంసెట్ ఫలితాలు

- ముగిసిన ఎంసెట్–2023..
- నేడు ఇంజనీరింగ్ ప్రాథమిక 'కీ'విడుదల

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి జేఎన్‌టీయూహెచ్ నేతృత్వంలో ఐదు రోజులపాటు జరిగిన ఎంసెట్–2023 ఆదివారంతో ముగిసింది. ఈ నెల 10, 11 తేదీల్లో అగ్రి, మెడికల్ ఎంసెట్, 12, 13, 14 తేదీల్లో ఇంజనీరింగ్ ఎంసెట్ నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పరీక్షకు 3,01,789 మంది హాజరయ్యారు. ఈసారి నర్సింగ్ కోర్సుల్లో నియామకానికి కూడా ఎంసెట్ ర్యాంకును ఆధారంగా తీసుకోబోతున్నారు. ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీని ఈసారి నుంచి తీసేశారు. దీంతో కేవలం ఎంసెట్‌లో వచ్చే మార్కులే అభ్యర్థి ర్యాంకులను నిర్ణయించనున్నాయి. మొత్తం 94 శాతం మంది ఎంసెట్
మిగతా 2వ పేజీలో ▶

వార్ధా ప్రాజెక్ట్.. భారీ బడ్జెట్



- రూ.750కోట్ల నుంచి రూ.4,550 కోట్లకు పెరిగిన అంచనాలు!
- ప్రాణహితకు బదులుగా వార్ధా బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు
- బ్యారేజీకి ఇరువైపులా వరద రక్షణ గోడలు నిర్మించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో ప్రతిపాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 'వార్ధా'ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగింది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.750 కోట్లు ఉండనుందని గతేడాది రాష్ట్ర నీటిపారుదల శాఖ అంచనా వేయగా, తాజాగా రూ.4,550.73 కోట్లకు ఎగబాకింది. కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)కి తాజాగా రాష్ట్ర నీటిపారుదలశాఖ సమర్పించిన సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో ఈ విషయాన్ని వెల్లడించింది. వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్(వ్యాప్కోస్) ఈ డీపీఆర్‌ను తయారు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా

మిగతా 3వ పేజీలో ▶

ఆ పోస్టులకు ఏజ్ భారమైంది!

వైద్య విద్య విభాగంలో విచిత్రమైన వాతావరణం నెలకొంది. డీఎంఈ, అడిషనల్ డీఎంఈ, మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పోస్టులకు సంబంధించిన వయో పరిమితిని 61 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచే బిల్లును గవర్నర్ తిరస్కరించడమే ఇందుకు కారణం. దీనివల్ల డీఎంఈ సహా ఆయా పోస్టుల వయో పరిమితి 61 ఏళ్లకే పరిమితం కానుండగా.. మరోవైపు మెడికల్ కాలేజీల ప్రొఫెసర్ల వయో పరిమితి 65 ఏళ్లుగా కొనసాగనుంది. ఇలా ఒకే విభాగంలో రెండు రకాల వయో పరిమితి కొనసాగనుండటంతో గందరగోళం ఏర్పడుతోంది. వాస్తవానికి మెడికల్ కాలేజీల్లోని ప్రొఫెసర్ల సీనియారిటీ ఆధారంగానే.. వారిలో కొందరిని డీఎంఈ, అడిషనల్ డీఎంఈ, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లుగా పోస్టింగ్ ఇస్తారు. అయితే ఈ పోస్టింగులు పొందిన తర్వాత వయో పరిమితి తగ్గిపోనుండటం సంక్షోభానికి దారితీస్తోంది.

– సాక్షి, హైదరాబాద్



వైద్య విద్య విభాగంలో 'వయో పరిమితి' సంక్షోభం

- 65 ఏళ్లకు పెంపు బిల్లును గవర్నర్ తిరస్కరించడంతో గందరగోళం
- అదనపు డీఎంఈ, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పోస్టులపై ప్రభావం
- ఇప్పటికిప్పుడు డీఎంఈ రమేశ్‌రెడ్డి సహా 8 మందిపై ఎఫెక్ట్!
- ప్రొఫెసర్లకు 65 ఏళ్లు, ఈ పోస్టులకు 61 ఏళ్ల వయో పరిమితితో ఇబ్బంది
- ఏం చేయాలన్న దానిపై వైద్య ఆరోగ్య శాఖ తర్జనభర్జన

డీఎంఈల వయో పరిమితి పెంచకపోవడంతో..

ప్రస్తుతం వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ)గా డాక్టర్ రమేష్‌రెడ్డి ఉన్నారు. డీఎంఈ కార్యాలయంలో ముగ్గురు అదనపు డీఎంఈలుగా పని చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, అనుబంధ ఆసుపత్రుల్లో సూపరింటెండెంట్లు పనిచేస్తున్నారు. అయితే నరసింహన్ గవర్నర్‌గా ఉన్న సమయంలో ప్రభుత్వం ప్రొఫెసర్ల వయో పరిమితిని 65 ఏళ్లకు పెంచింది. కానీ అప్పట్లో డీఎంఈ తదితర పోస్టుల వయో పరిమితి పెంపు మాత్రం జరగలేదు.

గవర్నర్ తాజా నిర్ణయంతో ఆయా పోస్టుల్లో పని చేసే 61 ఏళ్లు పైబడినవారు అనర్హులవుతారు. ప్రస్తుతం డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి సహా ఎనిమిది మంది ఇప్పటికిప్పుడు రిటైర్ కావలసి వస్తుంది. అంతేకాదు వచ్చే ఏడాదిలోగా మరో ఏడెనిమిది మంది కూడా పదవీ విరమణ పొందాల్సి ఉంటుంది. గవర్నర్ నిర్ణయం ఇకముందు కూడా అమలైతే ప్రస్తుతం పనిచేసే ప్రొఫెసర్లలో ఎంతమంది.. అడిషనల్ డీఎంఈలు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లుగా పని చేసేందుకు ముందుకు వస్తా

ఆ పోస్టులకు ముందుకొచ్చేదెవరు?

రు?, ప్రొఫెసర్‌గా 65 ఏళ్ల వరకు కొనసాగే అవకాశాన్ని వదులుకుని 61 ఏళ్ల వయో పరిమితి ఉన్న పోస్టులకు ఎందుకు వెళతారు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ అక్కడ 61 ఏళ్ల వరకు ఉండి, తిరిగి ప్రొఫెసర్‌గా కాలేజీల్లో 65 ఏళ్ల వరకు కొనసాగే అవకాశం ఉన్నా బాగుండేదని, కానీ ఆ చాన్స్ లేదని అంటున్నారు. పైగా జిల్లాల్లోని మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాల్‌గా వెళ్లడం కంటే హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా 65 ఏళ్ల వరకు పనిచేసుకోవడమే మంచిదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

తక్షణ కర్తవ్యం ఏమిటి?

వయో పరిమితి పెంపు బిల్లును గవర్నర్ తిరస్కరించడంతో, భవిష్యత్ కార్యాచరణపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. గవర్నర్ నిర్ణయాన్ని అమలు చేయడమా? లేక బిల్లును మరోసారి అసెంబ్లీలో పాస్ చేసి తిరిగి పంపడమా? అనేది తేలాల్సి ఉంది. దీనిపై ఏదో ఒకటి తేలే వరకు...ఆయా పోస్టుల్లో 61 ఏళ్లు దాటిన వారు దిగిపోవాలా? లేదా కొనసాగాలా? అన్నది కూడా తేల్చాల్సి ఉంది. ఒకవేళ వారిని తొలగిస్తే ఆయా పోస్టుల్లో ఉన్నవారు కోర్టుకు వెళ్లే అవకాశాలున్నాయి. ఎందుకంటే ప్రొఫెసర్ పోస్టుకు 65 ఏళ్లుండగా, ప్రొఫెసర్ పోస్టులు వదులుకుని వచ్చే అడిషనల్ డీఎంఈలు, ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్ల వయో పరిమితిని 61 ఏళ్లకే పరిమితం చేయడం ఏమేరకు కరెక్ట్ అనే వాదనతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ ఏడాది కొత్త మెడికల్ కాలేజీలతో కలుపుకొని రాష్ట్రంలో మొత్తం 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. వాటిల్లో ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు కలిపి మొత్తం 52 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం 18 మంది ప్రిన్సిపాళ్లుగా, సూపరింటెండెంట్లుగా ఉన్నారు. కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చినా చేరలేదు. దీంతో అక్కడ సీనియర్లను ఇన్‌చార్జిలుగా కొనసాగిస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ నిరసనలు

సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టనుంది. ధాన్యం కొనుగోళ్లు సరిగా జరపకపోవడం, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం, తరుగు పేరిట దోపిడీకి పాల్పడుతుండడం, మక్కల కొనుగోళ్లు ప్రారంభించకపోవడం, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ టీపీసీసీ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు చేపట్టనున్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలతో పాటు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలని కిసాన్ సెల్ అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

బోయినపల్లి వినోద్ కుమార్



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం కోసం వైద్యులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) భవన సముదాయంలో ఆదివారం ఏర్పాటు చేసిన తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) కార్యాలయాన్ని వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. వైద్య, ఆరోగ్యం, విద్య.. ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని, ఆ దిశలోనే ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.రాకేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎమ్వీ ప్రసాద్, వైస్‌చైర్మన్ డాక్టర్ సీహెచ్ జగన్మోహన్ పాల్గొన్నారు.

బీజేపీ మత రాజకీయాలకు కర్ణాటక ఫలితాలు చెంపపెట్టు

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: బీజేపీ మత రాజకీయాలకు బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలకు కర్ణాటక ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ప్రజలను అమాయకులను చేసి, స్వార్థ రాజకీయాలకు పాల్పడితే ఇలాంటి తీర్పే వెలువడుతుందన్నారు. కులం, మతం, డబ్బు, అధికారమదంతో ప్రజాస్వామ్యాన్ని కొనలేరని మరోసారి స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో నియంతను గద్దె దించేందుకు తెలంగాణ సమాజం సైతం ఎదురుచూస్తోందని షర్మిల ట్వీట్ చేశారు.

ఆదరణ చూసి ఓర్వలేకే...

షర్మిల రాజకీయ భవిష్యత్తుపై కక్షకట్టి దాడి చేస్తున్నారు: గట్టు రామచంద్రరావు



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడబలుక్కుని ఆమెపై కుత్సిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు మండిపడ్డారు. తప్పుడు సమాచారం, కథనాలతో పార్టీ, షర్మిల రాజకీయ భవిష్యత్తుపై కక్షకట్టి చేస్తున్న దాడిగా స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. గత కొన్ని రోజులుగా కొన్ని పత్రికలు, టీవీ చానెళ్లు, కొన్ని యూట్యూబ్ చానెళ్లతో పాటుగా సోషల్ మీడియా పేజీల్లో పార్టీ, షర్మిల గురించి దారుణమైన, నిరాధారమైన కథనాలు ప్రచురితం, ప్రసారం అవుతున్నాయన్నారు. ఆదివారం ఈ మేరకు పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. షర్మిల కాంగ్రెస్ పార్టీ వెంటపడుతున్నట్టుగా, ఐదు సీట్లు ఇస్తే చాలు అన్నట్టుగా కథనాలు రాయడాన్ని ఆక్షేపించారు. ప్రజల కోసం అలుపెరగక పోరాటం చేస్తున్న ఏకైక వ్యక్తి వైఎస్ షర్మిల పై ఇటువంటి రాతలు రాయడం మానుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌లోకి సచిన్ దేశ్‌ముఖ్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి, దివంగత విలాసరావు దేశ్‌ముఖ్ బంధువు సచిన్ దేశ్‌ముఖ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరితో పాటు మరో 60 మంది ముఖ్య అనుచరులు, మహారాష్ట్రకు చెందిన పలు పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ గులాబీ కండువాతో పార్టీలోకి ఆహ్వానించారు. మహారాష్ట్రలో పట్టున్న రాజకీయ కుటుంబానికి చెందిన దేశ్‌ముఖ్ చేరిక రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నది. లాతూర్ జిల్లాకు చెందిన సచిన్ దేశ్‌ముఖ్ లాతూర్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. చేరికల కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, మహారాష్ట్ర బీఆర్ఎస్ నేత మాణిక్ కదం తదితరులు పాల్గొన్నారు.

..దళితబంధు విందాయే!

▶ మొదటి పేజీ తరువాయి

బాగానే సాగిన పథకం.. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి మండలాల్లో అడ్డదారులు తొక్కింది.

విచ్చలవిడిగా అక్రమాలు..

దళిత బంధు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన తిరుమలగిరి మండలంలో 2,223 కుటుంబాల కోసం రూ.230 కోట్లు వ్యయం చేశారు. కానీ ఇక్కడ నాయకులే అన్నీ తామై వ్యవహరించి భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఫిర్యాదులున్నాయి. ఉదాహరణకు ఒక్క తొండ (తిరుమలగిరి) గ్రామాన్నే తీసుకుంటే.. ఇక్కడ డెయిరీని ఉపాధిగా ఎంచుకున్న వారికి ఇప్పటికీ గేదెలు ఇవ్వలేదు. మొత్తం రూ.10 లక్షల సొమ్ములో.. రూ.1.50 లక్షలను గేదెల షెడ్డుకు వినియోగించినట్టు చూపారు. నిజానికి షెడ్డు వేసింది అధికార పార్టీ నాయకుడి అనుచరుడే. కేవలం రూ.50 వేలలో దాన్ని పూర్తిచేసి లక్షన్నర బిల్లు చెక్కులపై సంతకాలు చేయించుకున్నారు. మిగతా సొమ్ములో కనీసం ఏడు నుంచి తొమ్మిది గేదెలు ఇవ్వాల్సి ఉండగా.. లబ్ధిదారులను పశ్చిమగోదావరి జిల్లా తణుకు తీసుకువెళ్లి ఓ కాంట్రాక్టర్‌కు చెందిన షెడ్డులో గేదెలతో ఫొటోలు తీయించారు. వాటిని అప్‌లోడ్ చేసి చెక్కులపై సంతకాలు చేయించుకున్నారు. కానీ రైతులకు ఇచ్చినది ఒకట్రెండు గేదెలు మాత్రమే. మిగతా గేదెల కోసం నాయకులు, అధికారులను అడిగితే.. ఇంకెక్కడి గేదెలు అంటూ ఎదురుప్రశ్నలే వచ్చాయి. ఒకరిద్దరు కాదు చాలా మంది లబ్ధిదారులది ఇదే పరిస్థితి. తణుకు నుంచి 13 డీసీఎం వాహనాల నిండా గేదెలను రవాణా చేయాల్సి ఉండగా.. మూడు వాహనాల మేర మాత్రమే తెచ్చారు. కానీ నంబరు ప్లేట్లు మార్చి పదమూడు వాహనాలుగా చూపెట్టి దళితబంధు నిధులను పక్కదారి పట్టించారు.

ఇలా చేస్తే.. పక్కా నిర్వహణ!

దళితబంధు మెరుగైన నిర్వహణ కోసం దళితుల అభివృద్ధి, సంక్షేమంపై పనిచేస్తున్న ఓ ఎన్జీఓ పలు సిఫారసులు చేసింది.

- లబ్ధిదారుల ఎంపిక రాజకీయ నిర్ణయం కాకుండా గ్రామం, మండలం యూనిట్‌గా జీవనోపాధి (లైవ్లీవుడ్) ప్రాజెక్టు రూపొందించినట్టుగా చేపట్టాలి.
- లబ్ధిదారుల ఇష్టం ప్రకారం కాకుండా అక్కడి అవసరాలు, మున్ముందు కొనసాగే అవకాశమున్న యూనిట్లను ఎంచుకునే దిశగా కృషి చేయాలి.
- సాంకేతిక నైపుణ్యమున్న వారికి అవే యూనిట్లు, లేని వారికి అక్కడ అవసరమైన యూనిట్లు కేటాయించి శిక్షణ ఇవ్వాలి.
- యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాక వారికి చేతి నిండా పనికల్పించే కార్యాచరణను రూపొందించాలి. దీని అమలు కోసం ప్రత్యేక యంత్రాంగం ఐదేళ్లపాటు కృషి చేయాలి.

జీఎస్టీ పేరుతోనూ ముంచేశారు

పలుచోట్ల నాసిరకం బ్రాండ్ల వాహనాలు, పనిముట్లు కొనుగోలు చేశా రు. కొందరు నాయకులు, అధికారులు కుమ్మక్కై జీఎస్టీ పేరుతోనూ అక్రమాలకు తెరలేపారు. లబ్ధిదారులు పెట్టుకునే యూనిట్లకు సరుకులు, వస్తువులు సరఫరా చేస్తామని చెప్పారు. కిరాణ, క్లాత్ స్టోర్, ఫుట్‌వేర్, స్టీల్ సామగ్రి, హార్డ్‌వేర్ పరికరాలను పంపిస్తామని చెప్పి ఇవ్వకుండా రూ.6 లక్షల నుంచి రూ. 7.50 లక్షల వరకే సొమ్ము ఇచ్చినట్లు లబ్ధిదారులు చెప్తున్నారు. మిగతా సొమ్ములో కొంత జీఎస్టీ కింద కట్ అయిందని, మరికొంత నాయకులు, అధికారులకు ముడుపులుగా ఇవ్వాల్సి ఉందని చెప్పారని వాపోయారు.

కాంట్రాక్టర్ ఫోన్ ఎత్తడం లేదు

నా భార్య పల్లెర్ల జానమ్మ పేరు మీద డెయిరీ యూనిట్ మంజూరైంది. కాంట్రాక్టర్ మొదట నాలుగు గేదెలు ఇచ్చాడు. మిగతా గేదెలు ఇవ్వకుండా.. మమ్మల్ని తణుకు తీసుకెళ్లి ఫొటోలు తీసుకొని పంపించాడు. మిగతా నాలుగు గేదెలకు డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదు. కాంట్రాక్టర్ వర్మకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. మా గేదెలు మాకు ఇవ్వాలి.

– పల్లెర్ల గోపాల్, తొండ గ్రామం, సూర్యాపేట జిల్లా

నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండకు చెందిన పర్వతాలు దళితబంధు పథకం కింద స్విఫ్ట్ డిజైర్ కారును ఎంపిక చేసుకుని చెక్కును కల్వకుర్తిలోని ఓ కారు ఏజెన్సీకి ఇచ్చాడు. నాలుగు నెలలైనా కారు ఇవ్వలేదు. స్థానిక నేతలకు అడిగినంత కమీషన్ ఇవ్వలేదనే జాప్యం చేశారని పర్వతాలు ఆవేదన చెందుతున్నాడు.

బహిరంగంగానే అవినీతి



సరైన విధివిధానాలు లేకే ఎమ్మెల్యేలు, వారి అనుచరులు ఆడింది ఆట, పాడింది పాటలా మారింది. లబ్ధిదారుల ఎంపికలో అవినీతి చోటుచేసుకుంది. పైలట్ మండలాలు సహా అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలో భారీగా ముడుపులు చేతులు మారాయి. అవినీతి అక్రమాలు, బహిరంగంగానే జరిగాయి.

– ఆకునూరి మురళి, రిటైర్డ్ ఐఏఎస్

రాష్ట్రంలో దళితబంధు అమలు ఇలా..

ప్రాంతం	గ్రౌండింగ్ అయిన యూనిట్లు
హుజూరాబాద్	15,710
చింతకాని (ఖమ్మం)	3,461
తిరుమలగిరి (సూర్యాపేట)	2,223
చారగొండ (నాగర్‌కర్నూల్)	1,407
నిజాంసాగర్ (కామారెడ్డి)	1,298
వాసాలమర్రి (యాదాద్రి)	75
మిగిలిన జిల్లాల్లో..	11,838

తెలంగాణకు తిరిగిరావడంపై ఆంతర్యమేమిటో..

- మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌పై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఫైర్
- తెలంగాణను పట్టుకుని గబ్బిలంలా వేలాడుతున్నారని ధ్వజం



అరక దున్నుతున్న భట్టి విక్రమార్క

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం సోమేశ్‌కుమార్‌ను తెలంగాణ సర్వీసు నుంచి ఏపీకి బదిలీచేస్తే.. అక్కడ చేతకాదని స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని తిరిగి తెలంగాణలో ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు తీసుకోవడంలో ఆంతర్యమేమిటని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఏపీలో లేని ఆనందం తెలంగాణలో ఏముందని నిలదీశారు. పీపుల్స్‌మార్చ్ యాత్రలో భాగంగా ఆదివారం ఆయన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల నుంచి లూర్దునగర్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సోమేశ్‌కుమార్ సలహా మేరకే ముఖ్యమంత్రి కేసీఆర్.. ధరణి పోర్టల్ తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములున్నాయా? అని ఆరాతీసి వాటిని బహుళ జాతి సంస్థలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. మంత్రి కేటీఆర్ అమెరికా, దుబాయ్ వెళ్లిరావడం.. అక్కడ బహుళ జాతి సంస్థలతో ఒప్పందం చేసుకొని తిరిగి రావడం.. సోమేశ్ కుమార్ వేల ఎకరాల భూములను వాటికి అప్పగించడం పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సోమేశ్ తెలంగాణను పట్టుకుని గబ్బిలంలా వేలాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఇలాగే కొనసాగితే హైదరాబాద్ నగరాన్ని సైతం తాకట్టు పెట్టడానికి వెనుకాడరని భట్టి దుయ్యబట్టారు. రాష్ట్ర అవతరణ అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఏకైక పాలమూరు ప్రాజెక్టు పదేళ్లు కావస్తున్నా పూర్తికాలేదని అన్నారు.

కేసీఆర్‌ను ఇంటికి పంపించడమే లక్ష్యం

- వనపర్తి ఆత్మగౌరవ సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నియంత పాలనను ఎదుర్కొనేందుకు యుద్ధం మొదలు: మాజీ మంత్రి జూపల్లి



వనపర్తి ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వనపర్తి: ఎందరో త్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను, రాష్ట్ర ఏర్పాటుకు మద్దతిచ్చిన బీజేపీని కాదని కేసీఆర్‌కు అధికారమిస్తే.. అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఆత్మగౌరవాన్ని కోరుకొనే నాయకులను ఏకంచేసి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌కు నిరుద్యోగులపట్ల చిత్తశుద్ధి ఉంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోపే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.70 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని పొంగులేటి డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వల్ల ఇబ్బందిపడుతున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తక్షణమే రూ. లక్ష చొప్పున పరిహారం అందించాలని, పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కర్ణాటక ఫలితాలతో పోలిస్తే త్వరలో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదింతలు ఎక్కువగా ప్రజావ్యతిరేక తీర్పు తథ్యమని జోస్యం చెప్పారు. బంగారు తెలంగాణ నినాదంతో రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసిన సీఎం కేసీఆర్... రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చారని ఆరోపించారు. ఉద్యమకారులపై పోలీసు కేసులు పెడుతూ కేసీఆర్ సాగిస్తున్న దుర్మార్గపు, నియంత పాలనను ఎదుర్కొనేందుకు వనపర్తి వేదికగా యుద్ధం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కనకయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, నాయకులు సత్యారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, పొంగులేటి, జూపల్లి అనుచరులు పాల్గొన్నారు.

పప్పు.. పాలు.. గుడ్లు.. టెండర్ల ఖరారు ఎలా?

రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల కింద సరుకుల పంపిణీకి కాంట్రాక్టర్ల ఎంపిక అధికార యంత్రాంగానికి ప్రహసనంగా మారింది. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఖరారు చేసేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం టెండరులో పాల్గొంటున్న బిడ్డర్లు అత్యధిక ధరలు కోట్ చేయడమే. బిడ్డర్లు కుమ్మక్కై వాస్తవ ధరల కంటే అత్యధిక ధరలను కోట్ చేస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న తీరును అధికారులు గుర్తించడంతో కాంట్రాక్టరు ఎంపిక వాయిదా పడుతూ వస్తోంది. దాదాపు రెండు నెలలుగా ఒక్క టెండరు సైతం ఖరారు కాలేదు.

– సాక్షి, హైదరాబాద్



మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో సరుకుల టెండర్లకు చిక్కుముళ్లు

- గతంలో కంటే ధరలు పెంచుతూ టెండర్లు దఖలు చేస్తున్న బిడ్డర్లు
- అధిక ధరలు చెల్లించేది లేదంటున్న అధికారులు
- పరిష్కారం కోసం సీఎం కార్యాలయ అధికారులతో సంప్రదింపులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులకు ఆరోగ్యలక్ష్మి తదితర పోషకాహార కార్యక్రమాల్లో భాగంగా పాలు, కోడి గుడ్లు, కందిపప్పును

వన్... టూ... త్రీ...

వివిధ రూపాల్లో అందిస్తున్నారు. సంపూర్ణ పోషకాహారం కింద పాలను, గుడ్లను నేరుగా అందిస్తుండగా... ఫుల్ మీల్స్‌లో భాగంగా కందిపప్పుతో కూడిన కూరలతో భోజనాన్ని ఇస్తున్నారు. ఈ పథకాలకు అవసరమైన పాలు, గుడ్లు, కందిపప్పును సరఫరా చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తుంది.మూడు లేదా ఆరు నెలల పాటు ఈ కాంట్రాక్టును అప్పగించి సరుకులను స్వీకరిస్తుంది.

తక్కువ ధరల కోసం

ఈ క్రమంలో మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలో సరుకుల కొనుగోలు లక్ష్యంగా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు చేపట్టింది. కానీ ఇందులో పాల్గొంటున్న వారంతా మార్కెట్ ధర కంటే అత్యధిక ధరలను కోట్ చేస్తూ రావడంతో సర్కారు ఖజానాకు భారీగా గండి పడుతుందన్న భావనతో ఆ శాఖ టెండర్లను రద్దు చేస్తూ వస్తోంది.

→ అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా కోసం ఈ ఏడాది మార్చిలో మొదటిసారి, ఏప్రిల్ మొదటి వారంలో రెండోసారి టెండరు పిలిచారు. కానీ అందులో పాల్గొన్న సంస్థలు నిబంధనలకు సరితూగలేదు. దీంతో రెండు టెండర్ల ద్వారా అర్హులు ఎంపిక కాకపోవడంతో మరో టెండరు పిలవాల్సి వచ్చింది. ఈ క్రమంలో పాల పంపిణీకి ఇబ్బందులు కలగకుండా ఇప్పటివరకు పంపిణీ చేసిన సంస్థకు పాత ధరలోనే పంపిణీ చేసేలా అవకాశమిస్తూ ఆర్నెళ్లకు పొడిగిస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సెప్టెంబర్ వరకు పంపిణీకి అవకాశం దక్కినట్లయింది.

→ కందిపప్పు పంపిణీకి మార్చి నెలాఖరులోనే టెండరు పిలిచింది. గత టెండరు సమయంలో కిలోకు రూ.114 చొప్పున పంపిణీ చేయగా... ఈ సారి టెండర్లు ఓ కనిష్ట ధర(ఎల్–1)ను రూ.145 కోట్ చేసింది. ఇక గరిష్ట ధర కింద ఏకంగా రూ.175 చొప్పున కోట్ చేశారు. గత ధర కంటే భారీగా ధరలు పెంచిన కారణంగా ఆ టెండరును రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రద్దు చేసింది. కొత్తగా మరో టెండరును పిలిచినప్పటికీ ధరలు ఆదే స్థాయిలో ఉండడంతో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

→ కోడిగుడ్ల పంపిణీకి సంబంధించిన టెండరులో జిల్లాల వారీగా పంపిణీ దారుల ఎంపికకు టెండరు పిలిచింది. దీనిపై పలు పౌల్ట్రీ సంస్థల యజమానులు న్యాయపోరాటానికి ఉపక్రమించారు. కోర్టు కేసులు నమోదు చేయగా... కొన్నాళ్లుగా ఎంపిక ప్రక్రియ ముందుకు కదల్లేదు. తాజాగా వీటన్నింటినీ పరిష్కరించి కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు సీఎం కార్యాలయాధికారులతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నాడు విజన్ 2020 అంటే.. నన్ను 420 అన్నారు

- విద్యుత్ సంస్కరణలకు నేనే మార్గదర్శిని
- 'గీతం'వర్సిటీ వేడుకలోనూ మాజీ సీఎం చంద్రబాబు అదే పాత పాట



గీతం యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అప్పట్లో తాను విజన్ 2020 రూపకల్పన చేస్తే తనను అందరూ 420 అంటూ ఎద్దేవా చేశారని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. తన విజన్ 2020 వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జరిగిన స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తొలి గ్రాడ్యుయేషన్ వేడుకకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో వచ్చిన పలు ఆర్థిక సంస్కరణలకు తానే కారణమని చెప్పుకొచ్చారు. విద్యుత్ సంస్కరణలకు తానే మార్గదర్శినని, తాను తెచ్చిన సంస్కరణల వల్లే ఇప్పుడు దేశంలో విద్యుత్ రంగం అభివృద్ధి చెందిందని చెప్పారు. టెలికాంలోనూ సంస్కరణలు తేవాలని నాటి ప్రధాని వాజ్‌పేయ్‌కు చెప్పానని చెప్పుకున్నారు. ఇక తాను రూపకల్పన చేసిన పాలసీల కారణంగానే హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, జినోమ్ వ్యాలీ, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు వచ్చా యని చెప్పారు. జినోమ్ వ్యాలీలోనే ఇప్పుడు కరోనాకు వ్యాక్సిన్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గీతం వర్సిటీ చాన్స్‌లర్ వీరేందర్‌సింగ్ చౌహాన్, ప్రెసిడెంట్ ఎం.శ్రీభరత్, వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవటం, ప్రొఫెసర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరులోగా ఎంసెట్ ఫలితాలు

▶ మొదటి పేజీ తరువాయి

రాశారని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఎంసెట్ కన్వీనర్ డాక్టర్ బి. డీన్‌కుమార్ పేర్కొన్నారు. అగ్రి, మెడికల్ ఎంసెట్ ప్రాథమిక 'కీ'ని జేఎన్‌టీయూహెచ్ ఆదివారం విడుదల చేసింది. ఇంజనీరింగ్ ఎంసెట్‌కు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని సోమవారం రాత్రి 8 గంటల్లోగా విడుదల చేస్తామని తెలిపింది. 'కీ'లలో ఏవైనా తప్పులు లేదా వాటిపై అభ్యంతరాలు ఉంటే ఎంసెట్ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు సవాల్ చేయొచ్చు. వాటిని పరిశీలించాక తుది 'కీ'విడుదల చేస్తారు. మరోవైపు ఎంసెట్ ఫలితాలను ఈసారి త్వరితగతిన ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తుది 'కీ'పై అభ్యంతరాలు పరిశీలించిన వెంటనే ఎంసెట్ ర్యాంకుల వెల్లడికి సన్నాహాలు చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం మీద ఈ నెలాఖరుకు ఫలితాలు వెల్లడించే వీలుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తవ్వగానే ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. జూలై మొదటి వారంలో ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ తరగతులు మొదలవుతాయని ఉన్నత విద్యామండలి చెబుతోంది.

క్లుప్తంగా...

విధుల్లో చేరనున్న జేపీఎస్‌లు

వారంలోగా డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: సమ్మె విరమించిన జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్/ఓపీఎస్) సోమవారం కల్లా పూర్తిస్థాయిల్లో విధుల్లో చేరనున్నారు. ఆదివారం వివిధ జిల్లాల్లో జేపీఎస్ కమిటీలు సమావేశమై సమ్మెను విరమించి టెంట్లు ఖాళీ చేశారు. ఆదివారం కూడా పలు చోట్ల జేపీఎస్‌లు విధుల్లో చేరుతున్నట్లుగా ఎంపీడీవోలకు జాయినింగ్ లెటర్స్ అందజేసినట్టు సమాచారం. శనివారం రాత్రి పొద్దుపోయాక సమ్మె విరమణపై నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ తర్వాత అన్ని జిల్లా కమిటీలకు దీనికి సంబంధించిన సమాచారం వివరాలు తెలియజేశారు. సర్వీసు రెగ్యులరైజేషన్, నాలుగేళ్ల ఉద్యోగకాలాన్ని ప్రొబేషనరీ పీరియడ్‌గా పరిగణన, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేయడం తదితర డిమాండ్లపై వారంలోగా చర్చించి, ఆయా అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామనే హామీ అధికారుల నుంచి అందినట్లు తెలుస్తోంది.

ఆ స్టేషన్లలో రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోండి

రైల్వేమంత్రికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని మహబూబ్‌నగర్, షాద్‌నగర్ స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన లేఖ రాశారు. యశ్వంత్‌పూర్ – హజరత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (12649/12650) కాచిగూడ నుంచి కర్నూలు చేరుకునేవరకు 200 కిలోమీటర్ల వరకూ ఎక్కడా స్టాప్ లేని విషయాన్ని గుర్తుచేశారు. మధ్యలో ఉన్న మహబూబ్‌నగర్ స్టేషన్లో ఈ రైలుకు స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా ఢిల్లీ, బెంగుళూరు వంటి సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ఈ ప్రాంత ప్రజలు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం ఉండదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. చెంగల్ పట్టు – కాచీగూడ ఎక్స్‌ప్రెస్ (17651/17652)కు షాద్‌నగర్ రైల్వే స్టేషన్లో స్టాప్ ఏర్పాటు చేస్తే.. తిమ్మాపూర్, కొత్తూరు, బూర్గుల ప్రాంతాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

బీసీల మద్దతుతోనే కాంగ్రెస్ గెలుపు

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్‌): బీసీ జనగణనకు మద్దతు, జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇవ్వడం వల్లే కర్ణాటకలో బీసీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. కాచిగూడలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఇప్పటికైనా బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకొని, బీసీలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలలో జనాభా ప్రకారం రిజర్వేషన్లకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరారు.

నేడు ఈడీ విచారణకు చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్‌: థాయ్‌లాండ్ క్యాసినో కేసులో అక్కడి పోలీసులకు పట్టుబడిన చీకోటి ప్రవీణ్‌కుమార్ సోమవారం ఈడీ అధికారుల విచారణకు హాజరుకానున్నారు. థాయ్‌లాండ్‌లో క్యాసినో ఆడేందుకు భారత్ నుంచి వెళ్లిన వారిని ఆ దేశ పోలీసులు ఇటీవల అరెస్టు చేయడం తెలిసిందే. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో హవాలాకు ఆస్కారం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో చీకోటి ప్రవీణ్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నట్టు తెలిసింది.


సముద్రశక్తి-2023 ప్రారంభం

భారత్–ఇండోనేషియా ద్వైపాక్షిక విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: భారత్, ఇండోనేషియా దేశాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాలు ప్రారంభమయ్యాయి. సముద్ర శక్తి–2023 పేరుతో నాలుగో ఎడిషన్ విన్యాసాలు ఇండోనేషియలోని బాటమ్ తీరంలో మొదలయ్యాయి. ఈ విన్యాసాల్లో ఐఎన్ఎస్ కవరత్తి, డోర్నియర్ మారీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, చేతక్ హెలికాప్టర్ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుండగా.. కేఆర్ఐ సుల్తాన్ ఇస్కందర్, సీఎన్ 235 మారీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎఎస్565 పాంథర్ హెలికాప్టర్ ఇండోనేషియా తరఫున విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. రెండు దేశాల మధ్య పరస్పర సహకారం పెంపొందించే లక్ష్యంతో సముద్రశక్తి నిర్వహిస్తున్నారు. హార్బర్ దశలో క్రాస్‌డెక్ విజిట్స్, ప్రొఫెషనల్ ఇంటరాక్షన్, క్రీడా పోటీలు జరగనుండగా, సీ ఫేజ్‌లో వెపన్ ఫైరింగ్, హెలికాప్టర్ ఆపరేషన్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఎయిర్ డిఫెన్స్ విన్యాసాలు, బోర్డింగ్ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఈ నెల 19 వరకూ సముద్ర శక్తి–2023 విన్యాసాలు జరగనున్నాయని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్‌గుప్తా తెలిపారు.

టుడేస్ గ్రాఫిక్

అవునూ.. మీ జీతమెంత? ఎందుకంటే.. ప్రపంచంలో వివిధ దేశాల ప్రజల సగటు జీతం ఎంత అన్న దానిపై వరల్డ్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఒక నివేదిక రూపొందించింది.. దీని ప్రకారం ప్రపంచంలోని 23 దేశాల్లో సగటు జీతం లక్ష రూపాయల కన్నా ఎక్కువగా ఉందట. 104 దేశాల్లో సర్వే చేయగా.. టాప్‌లో స్విట్జర్లాండ్ (రూ.4,98,567) ఉండగా.. అట్టడుగున పాకిస్తాన్ (రూ. 11,858) ఉంది. మరి మన పరిస్థితి ఏమిటనా.. భారత్‌తో సగటు జీతం రూ.46,861. ఆయా దేశాల్లో ఉద్యోగుల కనిష్ట వేతనం, గరిష్ట వేతనాన్ని పరిగణనలోకి తీసుకొని.. ఈ సగటు వేతనాన్ని నిర్ధారించారు.



టి-హబ్‌కు ‘నేషనల్ టెక్నాలజీ అవార్డు’

టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ కేటగిరీలో ప్రదానం



ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న టీ-హబ్ సీఈఓ శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ స్టార్టప్ ఇంక్యుబేటర్ ‘టి-హబ్’కు ‘నేషనల్ టెక్నాలజీ అవార్డు 2023’అవార్డు లభించింది. జాతీయ సాంకేతిక వారోత్సవంలో భాగంగా ఆదివారం ఢిల్లీలోని ప్రగతిమైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో టి హబ్ ఫౌండేషన్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు అవార్డును అందుకున్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొత్తం 11 కేటగిరీల్లో అవార్డులు అందజేశారు. స్టార్టప్ ఇంక్యుబేషన్‌లో టి- హబ్ చేస్తున్న కృషికి ప్రస్తుత అవార్డు అద్దం పడుతోందని శ్రీనివాస్‌రావు తెలిపారు. స్టార్టప్ ఇంక్యుబేటర్‌గా దేశంలోని ఇతర ఇంక్యుబేటర్లకు టి-హబ్ మూలస్తంభంగా నిలుస్తోందన్నారు. కాగా, టి-హబ్‌కు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు దక్కడం పట్ల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

బంగారు తెలంగాణలో కుల ధ్రువీకరణ పత్రాల్లేవ్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఎర్రవల్లి చౌరస్తా: కొట్లాడి సాధించుకున్న బంగారు తెలంగాణలో సంచార జాతులకు కనీసం కుల ధ్రువీకరణ పత్రాలు కూడా లేవని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రవల్లి కూడలిలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న సంచార జాతులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఫలితంగా వారు రాజ్యాంగ బద్ధమైన ఫలాలను అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సంచార జాతులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ రజాకార్ల రాజ్యాన్ని పాతరేస్తాం

రాష్ట్రంలో రామరాజ్యాన్ని స్థాపిస్తాం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో రజాకార్ల పాలన సాగుతోందని, మరో ఐదు నెలల్లో ఈ పాలనను పాతరేసి రామరాజ్యాన్ని స్థాపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కర్ణాటక ఫలితాలతో హిందుత్వంపై కొన్ని శక్తులు విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. హిందూ ఏక్తాయాత్ర సందర్భంగా ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని వైశ్యభవన్ వద్ద మొదలైన ర్యాలీలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మతో కలసి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. తాను ఎవరికీ వ్యతిరేకంగా హిందూ ఏక్తాయాత్ర చేయడం లేదని, హిందూ సమాజాన్ని సంఘటిత పర్చేందుకు, ఐక్యంగా ఉంచేందుకే చేపట్టానని తెలిపారు. కుహనా లౌకికవాదుల నుంచి హిందూ సమాజాన్ని జాగృతం చేయాల్సి ఉందన్నారు. ఈ యాత్రతో రాష్ట్రమంతా హిందూ సమాజాన్ని జాగృతపరుస్తానని చెప్పారు. పావు గంటపాటు పోలీసులు తప్పుకుంటే తామేంటో చూపిస్తామన్న వారిని పరుగులు పెట్టించే రోజులు ఎంతో దూరంలో లేవని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో బీజేపీ ఓటమి చెందగానే.. హిందుత్వానికి మనుగడ లేదని కొన్ని పార్టీలు ప్రచారం మొదలుపెట్టాయని.. అలాంటి వారంతా ఒక్కసారి కరీంనగర్ గడ్డ వైపు చూస్తే సమాధానం దొరుకుతుందన్నారు. దేశంలో హిందుత్వం లేకపోతే ఎప్పుడో పాకిస్తాన్ అయ్యేదన్నారు. నిజాం రజాకార్ల సమాధుల వద్ద మోకరిల్లిన వారికి గుణపాఠం చెప్పాలన్నారు.



హిందూ ఏక్తాయాత్రలో మాట్లాడుతున్న అసోం సీఎం హిమంత బిశ్వశర్మ. చిత్రంలో బండి సంజయ్

ఎగిరేది కాషాయ జెండానే..

జగిత్యాల ఎస్సై భార్యకు, బురఖా వేసుకున్న మహిళకు మధ్య జరిగిన వాగ్వాదంలో ఎంఐఎం నేతలు అకారణంగా జోక్యం చేసుకుని సదరు ఎస్సైని సస్పెండ్ చేయించారని సంజయ్ ఆరోపించారు. తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎగిరేది కాషాయం జెండానే అని చెప్పారు. కేరళ స్టోరీ సినిమాలో హిందూ మహిళలపై జరుగుతున్న లవ్ జిహాద్ దాడులను కళ్లకు కట్టారని పేర్కొన్నారు.

త్వరలోనే ఉమ్మడి పౌరస్మృతి: హిమంత బిశ్వశర్మ

రాష్ట్రంలో రజాకార్ల ప్రభుత్వం పోయి, త్వరలోనే రామరాజ్యం వస్తుందని తనకు నమ్మకంగా ఉందని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ వ్యాఖ్యానించారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం దేశంలో సనాతన ధర్మం బతికే ఉంటుందన్నారు. పదేళ్ల క్రితం దేశంలో అయోధ్యలో రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ఎవరూ ఊహించలేదని.. కానీ అవన్నీ సాకారం అయ్యాయని చెప్పారు. కొందరు నాలుగు పెళ్లిళ్లు చేసుకుందామని కలలు కంటున్నారని.. కానీ త్వరలోనే ఉమ్మడి పౌరస్మృతితో వాటికి ప్రధాని మోదీ అడ్డుకట్ట వేస్తారన్నారు. అసోంలో డీజిల్ ధర రూ.97 ఉంటే తెలంగాణలో మాత్రం రూ.106గా ఉందన్నారు. తెలంగాణ సర్కారు ఉద్యోగాలను కూడా సరిగా భర్తీ చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణ నేతల పేర్లు ఢిల్లీ లిక్కర్ స్కాంలో వినిపిస్తున్నాయన్నారు. బండి సంజయ్ హనుమంతుడిలా యుద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. తాను సీఎం అయ్యాక అసోంలో పలు మదర్సాలను రద్దు చేశానని, మరికొన్నింటిని రద్దు చేసేందుకు సిద్ధమని చెప్పారు. ఐదు నెలలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తే.. తెలంగాణలో అధికారం మనదేనని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కొత్త బండి.. రెండు హెల్మెట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

హెల్మెట్‌లను కొనడాన్ని తప్పనిసరి చేస్తే మరింత ఫలితం ఉంటుందని యోచిస్తున్నారు. నూతన ద్విచక్ర వాహన ధరతోపాటు రెండు నాణ్యమైన హెల్మెట్ల ధరను సైతం జోడించి షోరూంలు విక్రయించేలా చూడాలనే ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపాలనుకుంటున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. దీన్ని అమలు చేసేలా రవాణా శాఖకు ఆదేశాలు ఇవ్వాలని పోలీసు శాఖ తరఫున కోరనున్నట్లు చెప్పారు. ఇలా రెండు హెల్మెట్ల వాడకం క్రమంగా పెరిగితే రోడ్డు ప్రమాదాలు జరిగినా ద్విచక్రవాహనదారుల ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని ఆ అధికారి పేర్కొన్నారు.



లండన్‌లో హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

కేటీఆర్‌తో ‘హస్క్ ఇంటర్నేషనల్’ భేటీ

రాష్ట్రంలో రూ. 200 కోట్లతో బయో పెల్లెట్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో హస్క్ పెల్లెట్లు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు అంశంపై చర్చించేందుకు ‘హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్’ప్రతినిధులు ఆదివారం మంత్రి కె. తారక రామారావుతో లండన్‌లో భేటీ అయ్యారు. సుమారు 200 కోట్ల పెట్టుబడితో ఏటా వెయ్యి మెట్రిక్ టన్నుల బయో పెల్లెట్ల తయారీ యూనిట్ ఏర్పాటును ప్రతిపాదించింది. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో హస్క్ (ధాన్యం ఊక/పొట్టు), పునర్వినియోగానికి వీలుండే ప్లాస్టిక్‌ను సహకార పద్ధతిలో సేకరించేందుకు హస్క్ ఇంటర్నేషనల్ ఆసక్తి చూపింది. రాష్ట్రంలో హస్క్ ఇంటర్నేషనల్ కార్యకలాపాలకు పూర్తిగా సహకరిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ భేటీలో హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్‌కు చెందిన ‘ఇంక్రెడిబుల్ హస్క్ యూకే’సీఈఓ కీత్ రిడ్జ్‌వే, ఇంక్రెడిబుల్ హస్క్ ఇండియా సీఈఓ సీకా చంద్రశేఖర్, ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ ఆత్మకూరి అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు. మరోవైపు లండన్ పర్యటనలో భాగంగా మంత్రి కేటీఆర్ అక్కడ ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రతిష్ఠించిన భారీ అంబేడ్కర్ విగ్రహ నమూనాను మ్యూజియం అధికారులకు ఆయన బహూకరించారు. బారిస్టర్ చదువు కోసం ఇంగ్లాండ్ వెళ్లినప్పుడు ఆయన నివసించిన ఇంటినే మ్యూజియంగా మార్చారు.

వార్ధా ప్రాజెక్ట్.. భారీ బడ్జెట్

▶ మొదటి పేజీ తరువాయి

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేట వద్ద వార్ధా బ్యారేజీ నిర్మించనున్నారు. నాలుగేళ్లలోపు ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వార్ధా బ్యారేజీకి ఇరువైపులా తెలంగాణ, మహారాష్ట్ర భూభాగంలో ముంపు నివారణకు వరద రక్షణ గోడలను నిర్మించాలని నిర్ణయం తీసుకోవడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగింది.

మొదట అనుకున్న తుమ్మిడిహెట్టి వద్ద కాదని..


ఉమ్మడి ఏపీలో ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి తెలంగాణ ఏడు జిల్లాల్లోని 16.4లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చెవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును చేపట్టింది. రూ.1919 కోట్లతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించాలని, 6.5 కి.మీల పొడవున ఉండనున్న ఈ బ్యారేజీకి 107 గేట్లను ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బ్యారేజీ నిర్మాణంలో మహారాష్ట్రలో 1852 ఎకరాలు, తెలంగాణలో 526 ఎకరాలు, నదీ గర్భంలో 3771 ఎకరాలు కలిపి మొత్తం 6149 ఎకరాల ముంపు ఉంటుందని తేల్చారు. ఆ తర్వాత బ్యారేజీ ఎత్తును 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గించేందుకు మహారాష్ట్రతో ఒప్పందం కూడా చేసుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ ప్రక్రియను చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం ప్రాణహిత–చెవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని పక్కనపెట్టింది. దీనికి బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. కాళేశ్వరంతో పాటే తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మించి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల్లోని 2లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. వన్యమృగాల అభయారణ్యం ఉండడంతో తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీకి అనుమతులు రావని ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును విరమించుకుంది.

మహారాష్ట్రతో మళ్లీ ఒప్పందం

మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరగడంతో వార్ధా నదిపై బ్యారేజీ నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. వార్ధా నదిపై 36 గేట్లతో బ్యారేజీ నిర్మిస్తే సరిపోతుందని, దీనికి రూ.650 కోట్ల ఖర్చు కానుందని గతేడాది జనవరిలో నీటిపారుదల శాఖ అంచనా వేసింది. ప్రాణహిత–చెవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో తవ్వి వదిలేసిన కాల్వలతో అనుసంధానం చేయడానికి అదనంగా తవ్వాల్సిన కాల్వకు మరో రూ.100 కోట్లు కానుందని, మొత్తం రూ.750 కోట్లతో ఈ ప్రాజెక్టు పూర్తి చేయవచ్చని లెక్కలు వేసింది. కానీ తాజాగా అంచనా వ్యయం రూ.4550 కోట్లకు పెరిగిపోయింది. వరద రక్షణ గోడల నిర్మాణానికి రూ.1000 కోట్లను అంచనాల్లో ప్రతిపాదించారు. వార్ధా బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రతో మళ్లీ కొత్త ఒప్పందం చేసుకోవాల్సి ఉంది.

1.34 లక్షల ఎకరాల ఆయకట్టు..

ఈ ప్రాజెక్టు కింద 1,34,880 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని, మరో 5868 ఎకరాల స్థిరీకరణ జరగనుందని, ఏటా రూ.1224.18 కోట్ల ఆదాయాన్ని సృష్టించనుందని డీపీఆర్‌లో వ్యాప్కోస్ అంచనా వేసింది. 11.5 టీఎంసీల నీళ్లను ఈ ప్రాజెక్టు వాడుకోనుండగా, బ్యారేజీ నిల్వ సామర్థ్యం 2.96 టీఎంసీలు ఉండనుంది. 142.5 మీటర్ల ఎత్తులో బ్యారేజీకి 22 గేట్లను ప్రతిపాదించారు. తెలంగాణలో 3076 ఎకరాలు, మహారాష్ట్రలో 741.31 ఎకరాలు సేకరించాల్సి ఉండనుంది.



ప్రజా వ్యవహారాలను పట్టించుకోనందువల్ల మంచివాళ్లు చెల్లించాల్సిన మూల్యం ఏమిటంటే, చెడ్డవాళ్ల పాలనలో ఉండాల్సి రావడం!

– ప్లేటో

సాక్షి

సోమవారం, 15 మే 2023

జయాపజయాలు

మానవ జీవితం ద్వంద్వాలమయం. కష్టసుఖాలు, కలిమిలేములు, జయాపజయాలు జీవన గమనంలో సహజ పరిణామాలు. జయాపజయాల గురించి మన సమాజంలో పట్టింపు మోతాదు కంటే ఎక్కువే! విజేతలకు వీరపూజలు చేయడం, పరాజితులను విస్మృతిలోకి తోసిపారేయడం సర్వ సాధారణం. అయితే, జయాపజయాలు దైవాధీనాలని ఆధ్యాత్మికవాదుల విశ్వాసం. ఎవరెన్ని సూక్తులు చెప్పినా, ఎవరూ గెలుపు కోసం ప్రయత్నాలను మానుకోరు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు గెలుపు దక్కాలనుకునే పట్టుదలతో పగ్గాలు విడిచిన గుర్రాల్లా దూసుకుపోయేవారు కొందరు ఉంటారు. గెలుపు కోసం ఎలాంటి అడ్డదారులు తొక్కడానికైనా, ఎంతటి నీచానికి దిగజారడానికైనా తెగబడేవారు ఇంకొందరు ఉంటారు.

శక్తికి మించిన విజిగీషతో రగిలిపోయేవారు చరిత్రను రక్తసిక్తం చేస్తారు. అడ్డదారుల్లో పడి అడ్డదిడ్డంగా పరుగులు తీసి, అడ్డు వచ్చినవాళ్లను నిర్దాక్షిణ్యంగా తొక్కిపడేసి అందలాలెక్కుతారు. విజయోన్మత్తతను తలకెక్కించుకుని విర్రవీగుతారు. కాలం ఎప్పుడూ ఒక్కలాగానే ఉండదు. మార్పు దాని సహజ స్వభావం. కాలం మారి, పరిస్థితులు వికటించినప్పుడు విజేతలమనుకుని అంతవరకు విర్రవీగిన వారు పెనుతుపాను తాకిడికి కుప్పకూలిన తాటిచెట్లలా నేలకూలిపోతారు. మన పురాణాల్లో దుర్యోధనుడు, మన సమీప చరిత్రలో హిట్లర్ వంటి వారు అలాంటి శాల్తీలే!

'అజ్ఞానపు టంధయుగంలో/ తెలియని ఏ తీవ్రశక్తులో/ నడిపిస్తే నడిచి మనుష్యులు/ అంతా తమ ప్రయోజకత్వం/ తామే భువి కధినాథులమని/ స్థాపించిన సామ్రాజ్యాలూ/ నిర్మించిన కృత్రిమ చట్టాల్/ ఇతరేతర శక్తులు లేస్తే/ పడిపోయెను పేకమేడలై' అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అజ్ఞానపుటంధ యుగంలోనే కాదు, వర్తమాన అత్యాధునిక యుగంలోనూ పరిస్థితుల్లో పెద్ద మార్పు కనిపించడం లేదు. మొరటు బలం, మూర్ఖత్వం, మోసం, కుట్రలతో సాధించిన అడ్డగోలు విజయాలను తలకెక్కించుకుని, అదంతా తమ ప్రయోజకత్వంగా తలచి విర్రవీగే విజయోన్మత్తులలో దేశాధినేతల మొదలుకొని చిల్లరమల్లర మనుషుల వరకు నేటికీ ఉన్నారు. ఇలాంటి వాళ్లలోనే దుర్యోధనుడికి గుడి కట్టి పూజించేవాళ్లు, హిట్లర్‌ను ఆరాధించే వాళ్లు, లేని సుగుణాలను కీర్తిస్తూ నిరంకుశులకు బాకాలూదే వాళ్లు కనిపిస్తారు. గోబెల్స్‌కు బాబుల్లాంటి దుష్ప్రచార నిపుణులు నిర్విరామంగా ఊదరగొడుతూ, జీవితానికి గెలుపే పరమార్థమనే భావనకు ఆజ్యం పోస్తున్నారు. వీళ్ల ప్రభావం కారణంగానే ఓటమిని జీర్ణించుకోలేని తరం తయారవుతోంది.

మనుషుల స్థితిగతులను గెలుపు ఓటములతోనే అంచనా వేయడం మన సమాజానికి అలవాటైపోయింది. గెలవాలనే ఒత్తిడి ఒకవైపు, ఓటమి భయం మరోవైపు బతుకుల్లో ప్రశాంతతను ఆవిరి చేస్తున్నాయి. పరీక్షలను ఎదుర్కొనే విద్యార్థుల నుంచి ఎన్నికలను ఎదుర్కొనే రాజకీయ నాయకుల వరకు ప్రతి ఒక్కరికీ ఈ ఒత్తిడి తప్పడం లేదు. గెలుపు ఒత్తిడి కొందరిని మానసికంగా కుంగదీస్తుంది. ఇంకొందరిని అడ్డదారులు తొక్కిస్తుంది. సమాజంలో ప్రబలుతున్న ఈ ధోరణిని సొమ్ముచేసుకోవడానికి కొందరు మేధావి రచయితలు విజయ సోపానమార్గాలను పుస్తకాలుగా అచ్చేసి జనాల మీదకు వదులుతారు. నానావిధ ప్రసార, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ వికాస ప్రవచనాలతో ఊదరగొడతారు.

'విజయానికి కావలసినది పదిశాతం ప్రేరణ, తొంభైశాతం కఠోర శ్రమ' అన్నాడు థామస్ ఆల్వా ఎడిసన్. విద్యుత్తు బల్బును కనుక్కొనే ప్రయత్నంలో ఆయన వెయ్యి వైఫల్యాలను చవిచూశాడు. 'విద్యుత్ బల్బును కనుక్కోవడంలో వెయ్యిసార్లు విఫలమై, ఇప్పుడు సాధించారు కదా! ఇప్పుడు మీకేమనిపిస్తోంది?' అని ఒక పాత్రికేయుడు ఆయనను ప్రశ్నించాడు. 'వెయ్యిసార్లు నేను విఫలమవలేదు. వెయ్యి అంచెల తర్వాత విద్యుత్ దీపాన్ని కనుక్కోగలిగాను' అని బదులిచ్చాడాయన. వైఫల్యాలే విజయానికి సోపానాలని గ్రహించడానికి ఎడిసన్ అనుభవమే మంచి ఉదాహరణ. గెలుపు కోసం ప్రయత్నించే వాళ్లు ఓటమికి కూడా మానసిక సంసిద్ధతతో ఉండాలి. ఓటమి ఎదురైనప్పుడు రెట్టించిన పట్టుదలతో పునఃప్రయత్నం చేయడానికి తగిన శక్తియుక్తులను సమకూర్చుకోవడానికి తగిన ఓరిమితో ఉండాలి. ఈ రెండూ లోపించడం వల్లనే పరీక్షల్లో వైఫల్యం ఎదురైనప్పుడు అర్ధాంతరంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారెందరో!

స్వేచ్ఛగా జీవితాన్ని జీవించడమే ఒక సాఫల్యం. ఈ ఎరుక లేకనే చాలామంది జీవితాలను వ్యర్థం చేసుకుంటారు. చిల్లర గెలుపుల కోసం, పదవుల కోసం, పదవులను పదిలపరచుకోవడం కోసం అధికార బలసంపన్నుల ముందు సాగిలబడతారు. 'వాని జన్మంబు సఫల మెవ్వాడు పీల్చు/ ప్రాణవాయువు స్వాతంత్ర్య భరభరితమొ/ పరుల మోచేతి గంజికై ప్రాకులాడు/ వాని కంటెను మృతుడను వాడెవండు?' అన్నాడో చాటు కవి. 'విజయమే అంతిమం కాదు. వైఫల్యమేమీ ప్రాణాంతకం కాదు' అని తేల్చేశాడు బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్. కాబట్టి వైఫల్యం ఎదురైనంత మాత్రాన ముంచుకొచ్చే ముప్పేమీ ఉండదు. విజయం సాధించినంత మాత్రాన అమాంతంగా ఒరిగిపడే ఆకాశమూ ఉండదు. 'వైఫల్యాల నుంచి ఏమీ నేర్చుకోకపోవడమే మన అసలు పొరపాటు' అంటాడు అమెరికన్ పారిశ్రామికవేత్త హెన్రీ ఫోర్డ్. వైఫల్యాలే మనకు గుణపాఠాలు నేర్పే గురువులు. గురువులను గౌరవించడం మన సంప్రదాయం. వైఫల్యాలను గౌరవించడం, విజయాలను వినయంగా శిరసావహించడమే మన కర్తవ్యం!

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.ఏకాదశి రా.1.32 వరకు తదుపరి ద్వాదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.9.57 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.7.05 నుండి 8.36 వరకు, దుర్ముహూర్తం: ప.12.22 నుండి 1.11 వరకు తిరిగి ప.2.55 నుండి 3.44 వరకు, సర్వ ఏకాదశి.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం: 6.36
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

మహానగరపు మార్మిక గాథ

కామెంట్



కరణ్ థాపర్

ఢిల్లీకి ఆ పేరు ఎలా వచ్చిందో, దాని మూలాల వెనుక ఉన్న కథ ఏమిటో, ఈ మహానగరం ఎన్ని 'నగరాల'తో కూడుకుని ఉన్నదో, ఇంకా ఇలాంటి ఎన్నో సంగతులు చాలా ఆసక్తికరం. ఈ ఢిల్లీ ప్రాంతాన్ని మన పూర్వీకులు దైవ నిలయంగా భావించారు. సరిగ్గా అక్కడే స్వర్గాధిపతి ఇంద్రుడి నివాసమైన ఇంద్రప్రస్థ ఆవిర్భవించింది. ఈ ఇంద్రప్రస్థ అనంతరం, అది న్యూఢిల్లీ అయ్యేంతవరకూ ఇక్కడ అనేక నగరాలు వెలిశాయి. ఎన్ని నగరాలు అనే సంఖ్య అనిశ్చితం. కొంతమంది ఏడు నగరాలు అని చెబుతూ ఢిల్లీని ఎనిమిదవదిగా పేర్కొంటుంటారు. ఇంకొందరయితే పదిహేను నగరాలు అంటారు. అలాగే విచిత్రంగా ధ్వనించే ఢిల్లీ పేరుకు సంబంధించి కూడా అనేక వివరణలు ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం.

చాలా సంవత్సరాలుగా ఢిల్లీ గాథను తెలుసుకోవాలని నేను అనుకున్నాను. కానీ నిజంగా దాన్ని తెలుసుకోడానికి పెద్దగా ప్రయత్నించలేదు. మనం చరిత్ర మధ్యలో జీవిస్తున్నప్పుడు దానికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఇవ్వం. ఘోరమైన విషయం ఏమిటంటే, నేను ఢిల్లీని కాన్‌బెర్రా, ఒట్టావా లేదా వాషింగ్టన్‌తో పోల్చడం ఉచితమేనని అనుకున్నందుకు చింతిస్తున్నాను. నిస్సందేహంగా నేను అలా పోల్చిన ప్రతిసారీ, తప్పు చేస్తున్నానని నాకు తెలుసు కానీ అలా పోల్చడాన్ని అది ఆపలేదు. నా అజ్ఞానంలో ఉంటూ, నేను విలువైన అంశాన్ని ప్రతిపాదిస్తున్నట్లు యోచించాను. బహుశా నేను ఒక సందర్భంలో ఘోరంగా దొరికిపోయేంతవరకూ ఇది అలాగే కొనసాగిందని చెప్పాలి.

లండన్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో వస్తున్నప్పుడు నా పక్కనే కూర్చున్న ఒక అందమైన యువతి ''ఢిల్లీ గురించి చెప్పండి'' అని నన్ను అడిగింది. అది 1980ల చివరలో అనుకుంటాను. సెలవుపై ఇంటికి తిరిగొస్తున్నప్పుడు అది తటస్థించింది. ఆమె చాలా ఆకర్షణీయంగా ఉంది. నేను సంభాషణ ఏదైనా మొదలెట్టాలని అనుకున్నాను. ''ఢిల్లీ అద్భుతమైన చరిత్ర కలిగిన ఒక పురాతన నగరం అని నేను నమ్ముతున్నాను'' అని ఆమె అన్నది.

''అవును, అవును'' అంటూ నేను ఉత్సాహంగా సమాధానమిచ్చాను. కానీ దాని గురించి ఏమీ తెలియకపోవడంతో నేను సంభాషణను కొనసాగించలేకపోయాను. అందుకే విషయాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నించాను. ''ఢిల్లీ చాలావరకు కాన్‌బెర్రా, ఒట్టావా, వాషింగ్టన్ లాంటిదే'' అన్నాను.

''ఓ దేవుడా! కచ్చితంగా కాదు'' ఆమె దెబ్బతిన్నట్టుగా అన్నది.

''ఓ ఎస్'' అని నేను రెట్టించాను. కానీ ఈ విషయంపై ఏం చెప్పాలో నాకు తోచలేదు.

''వెల్, మీ మాట తప్పు కావాలని కోరుకుంటున్నా.''

అక్కడే ఆ సంభాషణ ముగిసిపోయింది. తర్వాత ఎనిమిది గంటల పాటు ఆ విమాన ప్రయాణ కాలంలో మాట్లాడటానికి నేను వేసిన ప్రారంభ ఎత్తులన్నీ సున్నితమైన తిరస్కరణను ఎదుర్కొన్నాయి. నా ఉద్దేశపూర్వక ప్రయత్నాలకు ఢిల్లీ గురించి నాకు జ్ఞానం లేకపోవడం అనేది గట్టి అడ్డంకిగా నిలిచింది.

నేను ఎంత ఘోరమైన అభిప్రాయాలతో ఉన్నానో ఇటీవలే గుర్తించాను. 'ద మిలీనియం బుక్ ఆన్ న్యూఢిల్లీ' పుస్తకం రాసిన పవన్ వర్మ ఆ మధ్య ఆ ప్రతిని నాకు పంపారు. చూసీచూడగానే అది ఒక విలాసవంతమైన కాఫీ టేబుల్ అలంకృత పుస్తకంగా అనిపించింది. అలాగని అలాంటి వాటి పట్ల నాకు వ్యతిరేకత ఏమీలేదు. పేజీలు అలా తిరగేస్తూ, ఫొటోగ్రాఫులను మెచ్చుకుంటూ, నెమ్మదిగా వ్యాసాల్లోకి మునిగిపోతుండగా ఢిల్లీ గురించి అత్యంత పఠనీయ చరిత్రాంశాలను



ఈ పుస్తకం కలిగి ఉన్నదని గుర్తించాను. నగరానికి ఆ పేరు ఎలా వచ్చిందో, దాని మూలాల వెనుక ఉన్న కథ ఏమిటో, ఈ మహానగరం ఎన్ని 'నగరాల'తో కూడుకుని ఉన్నదో, ఇంకా ఇలాంటి ఎన్నో సంగతులు ఇప్పుడు నాకు తెలుసు. దీనంతటికీ నేను ఖుశ్వంత్ సింగ్‌కు రుణపడి ఉంటాను. నా కళ్లు మొట్టమొదట పడింది ఆయన వ్యాసం మీదే. చెప్పాలంటే దాన్ని ఆబగా చదివాను – కృతజ్ఞతతో, ఆనందంతో. కొంత గర్వ ప్రదర్శన చేసుకోవడానికి అనుమతివ్వండి.

ఢిల్లీ మూలం విసుగు తెప్పించే సత్యం కంటే ఎంతో చక్కగా ఉండే ఒక పౌరాణిక గాథపై ఆధారపడి ఉంది. ఒకానొకప్పుడు గంగా నది పొంగి పరవళ్లు తొక్కుతున్నప్పుడు (ఈరోజు అది అలా ప్రవహించలేనంతగా కలుషితమైపోయింది) అది శాస్త్రాలను కక్కింది. (యాదృచ్ఛికంగా ఈ 'కక్కడం' అనే మాట ఖుశ్వంత్ సింగ్‌దే. కానీ ఆయన దాన్నొక శ్లేషగా మాత్రమే వాడివుంటారా అని నా సందేహం.). ఆ ప్రాంతానికి గుర్తుగా అక్కడ నిగమ్‌బోధ్ అని పిలిచే ఆలయం నిర్మించారు. అవును ఒకరోజు మీరు, నేను ఇదే ఘాట్ దగ్గర బహుశా స్వర్గాభిముఖంగా బట్వాడా అవుతాం. ''ఇది ఢిల్లీని దైవ నిలయంగా ఎంచుకోవడానికి మన పూర్వీకులకు తగిన హేతువు అయివుండవచ్చు'' అని ఖుశ్వంత్ సింగ్ కొనసాగిస్తారు. ''అలా ఢిల్లీ మొదటి నగరం, స్వర్గాధిపతి అయిన ఇంద్రుడి నివాసం ఇంద్రప్రస్థ ఆవిర్భవించింది.'' నేడు పురానా ఖిలా బహుశా అదే చోట ఉంది.

ఇంద్రప్రస్థ అనంతరం, అది మన ప్రియమైన న్యూఢిల్లీ అయ్యేంతవరకూ అనేక నగరాలు వెలిశాయి. ఎన్ని నగరాలు అనే సంఖ్య అనిశ్చితం. కొంతమంది ఏడు నగరాలు అని చెబుతూ ఢిల్లీని ఎనిమిదవదిగా పేర్కొంటుంటారు. ఇంకొందరయితే పదిహేను నగరాలు అంటారు. ఖుశ్వంత్ వ్యాసంలో నేను ఇట్టే పద్నాలుగు నగరాలను లెక్కించాను. అవి ఇంద్రప్రస్థ, యోగినిక్‌పుర, లాల్ కోట్, సిరి, కిలోఖేరీ, చిరాగ్, జహాపనా, తుగ్లకాబాద్, ఫిరోజాబాద్, ఖిలా ఫిరోజ్ షా, ముబారకాబాద్, దీన్ పనాహ్, షాజహానాబాద్, తర్వాత ఇంకేంటి న్యూఢిల్లీ. కానీ పదిహేనవ నగరం ఏది? నాకు ఇప్పటికీ తెలియనందుకు చిరాగ్గా ఉంది.

ఏదేమైనా, నాకు ఖుశ్వంత్ వ్యాసంలో మరీ ఎక్కువ నచ్చింది ఢిల్లీ ఉచ్చారణకు సంబంధించిన ఖండిక. ''చదువుకున్నవాళ్లు డెహ్లీ అనీ, సాధారణ జనం దిలీ అని పిలిచే... విచిత్రంగా ధ్వనించే పేరు''. దీనికి సంబంధించి అనేక వివరణలు ఉన్నాయి. పర్షియన్ పదమైన దెహ్లీజ్ నుంచి ఇది పుట్టుకొచ్చి ఉండవచ్చు. దెహ్లీజ్ అంటే ప్రవేశ ద్వారం అని అర్థం. ఎందుకంటే గంగామైదాన ప్రాంతానికి ఇది ఒక ప్రవేశద్వారంగా ఉంటోంది. మరొక వివరణ ప్రకారం, డైడలస్ అనే పదం నుంచి ఢిల్లీ పేరు పుట్టి ఉండవచ్చు. ఈజిప్టులోని అలెగ్జాండ్రియాకు చెందిన భౌగోళిక శాస్త్రవేత్త టాలెమీ ఈ నామకరణం చేశారు. ఏదేమైనా, ఈ నగరాన్ని ఒకప్పుడు పరిపాలించిన రాజన్ ధీలూ పేరుతో దీని జాడలు దొరుకుతున్నాయని 16వ శతాబ్ది పర్షియన్ చరిత్రకారుడు ఫెరిష్తా పేర్కొన్నాడు. కొంతమంది పండితులు ఈ పేరును కుతుబ్ మినార్ సమీపంలో ఉండే సుప్రసిద్ధ ఇనుప స్తంభంతో ముడిపెడుతున్నారు. అయితే ఈ సంబంధాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నానని చెప్పలేను. ఖుశ్వంత్ సింగ్ చెప్పినట్లుగా, ''ఈ స్తంభాన్ని మహా విష్ణువు ప్రతీకగా రూపొందించారు. దీన్ని తన తలపై భూమిని మోస్తున్న త్రాచుపాము (వాసుకి) పడగలోకి లోతుగా పాతడానికి ఉద్దేశించారు.'' ఈ స్తంభం జోలికి పోయేవారికి శాపం తగులుతుందని చెబుతుంటారు. అయితే ఒక మూర్ఖపు తోమర్ రాజ్‌పుత్ రాజు దీన్ని నిజంగానే త్రాచుపాము పడగ మీదే జొప్పించినట్టుగా ప్రతిష్ఠించారో లేదో రుజువు కావాలనుకుని, దాన్ని తవ్వించాడు. స్తంభం బయటకు తీయగానే, దాని కిందిభాగం రక్తంతో తడిసివుండటం కనిపించింది. తర్వాత తోమర్ రాజు తన సింహాసనాన్ని కోల్పోయాడు. అతడి వంశం కూడా అతడితోనే అంతరించిపోయింది. ఇది అద్భుతమైన గాథ. కానీ నా వరకూ దీనికీ, ఢిల్లీ పేరుకూ ఉన్న సంబంధాన్ని గ్రహించలేకపోయాను. ఢిల్లీ ఒక నెత్తుటి నగరం అని ఇది సూచిస్తోందా? విషాదకరంగా, కొన్నిసార్లు ఢిల్లీ అలాగే ఉండింది.

విషాదమేమిటంటే, ఖుశ్వంత్ సింగ్‌ను వీటిపై వివరించమని అడిగే అవకాశాన్ని నేను ఎన్నడూ పొందలేదు. ఢిల్లీకి ఆ తప్పిపోయిన 15వ పేరు గురించి కూడా అడిగే అవకాశం లేకుండా పోయింది. అయినప్పటికీ తర్వాత ఎప్పుడైనా ఎయిర్ ఇండియా విమానంలో ఒక అందమైన యువతి పక్కన కూర్చున్నప్పుడు, సంభాషణను నిలపడంలో నాకు తక్కువ సమస్యలు ఉంటాయి. నాకు ఆ అదృష్టం పట్టాలని కోరుకోండి మరి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వాళ్లు చెప్పేదే...



ఇండియా మేధావులు ఇండియాకు వ్యతిరేకం... పాశ్చాత్య దేశాల్లో ఇండియాకు సంబంధించిన మా జ్ఞానం గుప్పెడు మంది ఉన్నతవర్గ మేధావుల నుంచి వచ్చేది మాత్రమే.

– సాల్వతోర్ బబోన్స్, సోషియాలజిస్ట్

ఇదే సమయం



ఒక్క నెల కూడా వృథా చేయకుండా రాహుల్ గాంధీ తన తర్వాతి భారత్ జోడో యాత్రను తూర్పు నుంచి పశ్చిమానికి మొదలుపెట్టాలి. ఫలితాలు అద్భుతంగా ఉంటాయి.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

మార్చాలి



బీజేపీ నాయకత్వం నిజాయతీగా ఆత్మవిమర్శ చేసుకుంటే అర్థమయ్యేది ఏమంటే, కర్ణాటక తీర్పు బీజేపీకి వ్యతిరేకంగా వచ్చింది; అంతేగానీ, కాంగ్రెస్‌కు అనుకూలంగా కాదు. కాబట్టి కర్ణాటక యూనిట్‌ను వీలైనంత త్వరగా ప్రక్షాళన చేయాలి.

– సందీప్ బాలకృష్ణ, వ్యాఖ్యాత

ఏం జరగనుంది?



పాకిస్తాన్ మరోసారి చరిత్రలో అలాంటి ఒక విచిత్రమైన దశలో ఉంది – వచ్చే వారంలో ఈపాటికల్లా ఇమ్రాన్ ఖాన్ మరోసారి పాకిస్తాన్ ప్రధానమంత్రి కావొచ్చు; లేదా నిర్బంధంలో ఉండి జీవితంలో ఎప్పటికీ కనబడకుండా పోవచ్చు.

– సిరిల్ అల్మీదా, పాక్ జర్నలిస్ట్

అభిప్రాయాలేనా?



కేవలం రాజకీయ అభిప్రాయాల్లో విభేదాల వల్ల మన స్నేహితులు, కుటుంబ సభ్యులతో బంధాలను తెంచుకోవద్దు. చాలామంది వాళ్ల రాజకీయ వైఖరులతో సంబంధం లేకుండా ఒక బంధానికి చాలా ఇవ్వగలరు. మీరు కూడా ఇవ్వలేనివాళ్లలో ఒకరు కావద్దు.

– శ్రుతీ చతుర్వేది, ఆంత్రప్రెన్యూర్

బాధ్యత ఒక్కరిదే



ఆయన ఎన్నికల్లో హిందూ–ముస్లిం అంశం తెచ్చారు; పాకిస్తాన్ అంశం తెచ్చారు; బాధిత కార్డును వాడుతున్నారని అన్నారు; గెలవడానికి ఏమేం చేయవచ్చో అన్నీ చేశారు. దాన్ని మోదీ వర్సెస్ కాంగ్రెస్ పోరాటంగా మలిచారు. అందుకే కర్ణాటకలో బీజేపీ ఓటమి నరేంద్ర మోదీది. ఎందుకంటే ఇది ఆయన ముందుండగా జరిగిన ఎన్నిక కాబట్టి! దీనికి ఆయనే బాధ్యత వహించాలి.

– రోషన్ రాయ్, వ్యాఖ్యాత

నడక చాలు



ప్రతి ఉదయం ఒక పదిహేను నిమిషాల నడకకు వెళ్లండి. పెద్ద వర్కవుట్లు అక్కర్లేదు – కేవలం నడక చాలు. ఉదయపు ఎండ, కదలిక – ఉమ్మడిగా మన జీర్ణక్రియ, జీవక్రియ, మూడ్, సర్కేడియన్ రిథమ్(చీకటి వెలుగులకు శరీర స్పందన) మీద సానుకూల ప్రభావం చూపుతాయి.

– సాహిల్ బ్లూమ్, కంటెంట్ క్రియేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

స్పందన

నెహ్రూ హిందువేనంటారా?

సాక్షి దినపత్రికలో సుధీంద్ర కులకర్ణి 'నెహ్రూ హిందువు కాదంటారా?' అన్న వ్యాసం ప్రచురితమైంది (మే 9, మంగళవారం నాటి సంచిక). నెహ్రూ హిందువు అవునా? కాదా? అన్న చర్చ ఆయన జీవించి ఉన్నప్పటి నుంచే కొనసాగుతూ వచ్చింది. ఇప్పటికీ జరుగుతున్నది. నెహ్రూ హిందువు ఎలా అవుతారో... ఆయన రచనల్లో హిందూ తాత్విక భావనలు ఎలా ప్రస్ఫుటంగా కనిపిస్తాయో సుధీంద్ర కులకర్ణి సాధారణీకరణం చేసి అద్భుతంగా పేర్కొన్నారు. ఇవన్నీ మాట్లాడుకోవడానికీ, ఇలా పత్రికల్లో వ్యాసాలు రాసుకోవడానికీ చాలా బాగానేఉంటాయి. కానీ... చేతల చేత నెహ్రూ ఏమిటన్నది సుధీంద్ర ఒక్కటంటే ఒక్క ముక్క కూడా రాయలేదు.

1947 జూలై 22న దేశానికి స్వతంత్రం రావడానికి మూడు వారాల సమయం ఉన్నదనగా త్రివర్ణ పతాకంలోని గాంధీ చర్ఖా మాయమైపోయింది. ఆ స్థానంలోకి అశోకుడి విజయ చక్రం (దాన్ని మనవాళ్లు ధర్మ చక్రం అన్నారు) వచ్చి చేరింది. గాంధీ ఫిలాసఫీకి క్రమంగా కనుమరుగు చేయడంతోపాటు.. హిందూ ఐకాన్లను తెరమరుగు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం జరిగింది. ఈ విషయంలో నెహ్రూ చాలా తెలివిగా వ్యవహరించారు. బౌద్ధాన్ని ప్రమోట్ చేయడం వల్ల హిందువులకు వ్యతిరేకమనే ఇమేజి రాదు. ఎందుకంటే బుద్ధుడిని హిందువులు అప్పటికే దశావతారాల్లో ఒకడిగా అబ్సార్బ్ చేసుకున్నారు కాబట్టి!

జాతీయ జెండాలోకి ధర్మచక్రం వచ్చిన సరిగ్గా ఏడాదికి అశోకుడి నాలుగు సింహాలు రాజముద్రగా వచ్చి చేరింది. నిజానికి అప్పటివరకూ స్వాతంత్ర్యోద్యమంలో కూడా గాంధీ రాముడి గురించే ప్రబోధించారు. 'రఘుపతి రాఘవ రాజారాం' అనే అన్నారు. హఠాత్తుగా అశోకుడు భారతదేశ యవనికపై పుట్టుకొచ్చాడు. ఇంకేం రాముడు వెనక్కి వెళ్లాడు. రామరాజ్యమూ లేకుండా పోయింది. జీవితాంతం నరమేధం చేసి... రక్తపు కూడు తిన్న అశోకుడు ధర్మస్వరూపుడు, శాంతి స్వరూపుడయ్యాడు.

ఒకవైపు భారతీయ సమాజాన్ని ఆధునికీకరిస్తున్నామని చెప్తూనే.. మరోవైపు హిందూ సమాజాన్ని ఆధునికీకరించడానికంటూ.. 1948లోనే ఆదరాబాదరాగా 'హిందూ కోడ్ బిల్లు' తీసుకొని వస్తున్నట్టు నెహ్రూ ప్రకటించారు. బాబూ రాజేంద్ర ప్రసాద్ బిల్లును తిరస్కరిస్తూ.. దీన్ని అన్ని మతాలకూ వర్తింపజేస్తే చేయాలనీ, లేకపోతే చెత్త బుట్టలో పారేయాలనీ నెహ్రూకు లేఖ కూడా రాశారు. దీంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఆ తరువాత నెహ్రూ పట్టుబట్టి బిల్లును నాలుగు ముక్కలు చేసి విడివిడిగా ఆమోదింపజేసుకొన్నారు. తత్ఫలితం ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం కూడా! చరిత్ర చరిత్ర కాకుండా పోయింది. మన విద్య విద్య కాకుండా పోయింది. మన సంస్కృతి సంస్కృతి కాకుండా పోయింది.

ఒక తరాన్ని 'అభారతీయులు'గా చేయాలంటే.. వారి మూలాలకు వారిని దూరం చేయాలి. అందుకు చేయాల్సిన మొదటి పని... ఈ దేశాన్ని ఏకం చేసిన మహాపురుషులనూ, వారి చరిత్రనూ కనుమరుగు చేయాలి. అందుకోసం వాటిపై బురద చల్లాలి. వారి జీవన విధానాన్ని ఛిన్నాభిన్నం చేయాలి. ఈ దేశంలో నాడు జరిగిందీ... నేడు జరుగుతున్నదీ అదే.

– కోవెల సంతోష్ కుమార్ | 90521 16463

అంతరిస్తున్న మన బలగం

అభిప్రాయం



పున్నా కృష్ణమూర్తి

యూఆర్ అనంత మూర్తి 'సంస్కార' నవల కన్నడంలో వచ్చినప్పుడు పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. సంకుచిత సంప్రదాయ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి చనిపోయిన తరువాత అంత్యక్రియల సందర్భంగా స్వీయ సమూహపు వివక్ష అందులోని ఇతివృత్తం. ఈ నవల ఇంగ్లీషులో వచ్చినపుడు రామ్ మనోహర్ లోహియా చదివి, పలాభి చేత చదివింపచేశారు. తదుపరి ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సంస్కార' సినిమా అనేక ప్రకంపనలను పుట్టించింది. నిషేధించబడింది. ఆ మరుసటి ఏడాది 1970లో ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డు సాధించింది. భారతీయ ప్రత్యామ్నాయ సినిమాలకు మార్గదర్శి అయింది. అక్షరం అంకురం అయితే ... సినిమా వెయ్యి కొమ్మల వృక్షం.

ఇందుకు తాజా ఉదాహరణ నటుడు, రచయిత, దర్శకుడు అయిన వేణు యెల్దండి దర్శకత్వం వహించిన 'బలగం' చిత్రం. 'గుండు కరుగగా పాడె హనుమంతుడు' అన్న వాక్యం ప్రేక్షకులందరి అనుభవంలోకి తెచ్చింది క్లైమాక్స్ పాట పాడిన కొమురమ్మ. 'ఇయ్యాలా మాయందు గలిగి, మాతో ఈ పదాలు పలికిస్తున్నాడో ఏమో' అన్నపుడు నాభి నుంచి దుఃఖం పొరలని మనిషి ఉండరు.

ఒక వ్యక్తి చనిపోయినపుడు ఆ వ్యక్తి గుణగణాలను, బంధుమిత్రులతో సంబంధాలను తలచుకుని పాటపాడడం మనోభారాన్ని తగ్గించుకోవడం ప్రపంచమంతా ఉంది. ఉదాహరణకు 'ద వీపింగ్ కేమెల్' చిత్రం. మంగోలియా సంచార జాతులకు చెందిన సమూహాలు గోబి ఎడారిలో ఒంటెలపై ఆధారపడి జీవిస్తాయి. అక్కడి వేసవిలోనూ మంచు కరగదు. శీతకాలం భయంకరం. శీతకాలంలో ఒంటె ప్రసవించడం అంటే శరీరానికి రంపపు కోతే. తల్లి ఒంటె శిశువును దగ్గరకు రానివ్వని సందర్భాలు ఉంటాయి. అప్పుడేం చేస్తారు? సంచార వాద్యకారుని వెతికి రప్పిస్తారు. రెండు తంత్రుల పురాతన పరికరంపై అతడు వినిపించే సంగీతం తల్లి ఒంటెను బిడ్డ దగ్గరకు చేరుస్తుంది. ఈ చిత్రం ఉత్తమ డాక్యుమెంటరీగా ఆస్కార్ (2003) అవార్డు, ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌తో సహా అసంఖ్యాక అవార్డులను గెలుచుకుంది. వీటన్నిటి కన్నా ముఖ్యమైన అంశం మంగోలియా కళాకారుల సంప్రదాయ సంగీతాన్ని ప్రపంచం సంరక్షించుకోవాల్సిన 'ఇందిర గ్రాహ్యం కాని సాంస్కృతిక వారసత్వం (ఇంటాన్జిబుల్ కల్చరల్ హెరిటేజ్)'గా యునెస్కో గుర్తించింది. సంరక్షించుకోవాల్సిన ఇటువంటి వారసత్వ కళలు దాదాపు 500 యునెస్కో జాబితాలో ఉన్నాయి.



'బలగం' విషయానికి వస్తే బుడగ (బేడీ) జంగాల సామాజిక వర్గానికి చెందిన వారు ఈ కళకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో వేణు యెల్దండి ఎంపిక చేసిన వరంగల్ జిల్లా దుగ్గొండి అటవీ గ్రామానికి చెందిన మొగిలయ్య, కొమురమ్మలు ఈ ప్రక్రియలో దాదాపు చివరి ప్రతిభావంతులైన కళాకారులు. బుడగ జంగాలు పాటను అప్పటికప్పుడే పుట్టిస్తారు, బంధుమిత్రుల నుంచి రాబట్టిన గుణగణాలతో! అలాంటి కళాకారులను ఈ యాంత్రిక సమాజం మరచింది. ఇప్పుడు భర్త మొగిలయ్య తీవ్ర అనారోగ్యంలో 'ప్రాణ నాథా...' పాడుతూ రోదిస్తోంది కొమురమ్మ.

పల్నాడు, భువనగిరి జిల్లా కొండ్రపోలు, రాయలసీమలో బుడగ జంగాలు పాడగా వ్యాస రచయిత విన్నాడు. లాభం కాబట్టి ఇవే పెంచాలి అనుకున్న వాణిజ్య మొక్కలు తప్ప ఇతర వృక్ష జాతులను, పురుగూ పుట్రా అన్నిటినీ పొలంలో నుంచి సమూలంగా పెళ్లగించే యాంత్రిక వ్యవసాయ ధోరణి సాంస్కృతిక రంగంలోకీ వచ్చింది. అందుకే వృత్తికారులను, గాత్ర, వాద్య ప్రదర్శన కళాకారులను దూరం చేసుకుంది.

ఈ నేపథ్యంలో బుడగ జంగాల కళా సంపద అంతరించి పోకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. ఈ కళను యునెస్కో గుర్తింపునకు రిజిస్టర్ చేయాలి. యునెస్కో గుర్తింపు వస్తే ప్రయోజనం ఏమిటి? మొగిలయ్య, కొమురమ్మలకు, వారి తదుపరి తరాలకు సమున్నత గౌరవం లభిస్తుంది. సామాజిక ఆర్థిక ఉన్నతి ఏర్పడుతుంది. వివిధ దేశాలలో అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఏర్పడుతుంది.

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్ట్
మొబైల్: 76809 50863

క్లుప్తంగా...

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వృద్ధుడి మృతి

ధర్మారం(పెద్దపల్లి): తన సంతకాలు ఫోర్జరీ చేసి భూమి కాజేశారని.. న్యాయం చేయాలంటూ పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట గత శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు మెట్‌పల్లి రాంచందర్‌రావు(75) ఆదివారం మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన మెట్‌పల్లి రాంచందర్‌రావు కుటుంబం హైదరాబాద్‌లో నివసిస్తోంది. తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన సోదరులు భూమిని విక్రయించారని గతంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ గత శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన రాంచందర్‌రావు అధికారులను కలిశారు. అధికారులు పట్టించుకోవడం లేదంటూ కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నల్లమలలో బైక్ రైడింగ్‌కు యత్నం

- రూ.2.4 లక్షల జరిమానా విధింపు
- అధికారుల అదుపులో యువకులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

అమ్రాబాద్: సరదాగా నల్లమలలో బైక్ రైడింగ్‌కు వచ్చిన కొందరు రైడర్స్‌కు అటవీ శాఖాధికారులు భారీ జరిమానా విధించారు. మద్దిమడుగు రేంజ్ ఎఫ్‌ఆర్‌వో ఆదిత్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కొందరు యువకులు 16 బైక్‌లపై బయలుదేరి శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగు వచ్చారు. అనంతరం కృష్ణానది వైపు అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడే బస చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న అటవీ శాఖాధికారులు అర్ధరాత్రి సమయంలో అక్కడికి వెళ్లి బైక్‌లను స్వాధీనం చేసుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఒక్కొక్క బైక్‌కు రూ.15 వేల చొప్పున రూ.2.4 లక్షల జరిమానా విధించినట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఒంటికి నిప్పు పెట్టుకుని..

ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో బాధితుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సీఐ నాగరాజు

జోగిపేట(అందోల్): తనపై దాడి చేసిన వారిని పట్టించుకోవడం లేదంటూ ఓ వ్యక్తి ఆదివారం రాత్రి జోగిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. జోగిపేట రిక్షా కాలనీలో నివాసం ఉంటున్న ఖలీల్(40) బసవేశ్వర విగ్రహం వద్ద తనపై కొందరు దాడిచేసి ఫోన్ పగలగొట్టారని డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఇద్దరు పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అప్పటికి ఖలీల్ తప్ప అక్కడ ఎవరూ లేకపోవడంతో స్థానికులను విచారించారు. ఘర్షణ జరిగిన మాట వాస్తవమేనని చెప్పడంతో ఖలీల్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి దాడి చేసిన వారిని ఉదయం పిలిపిస్తామని చెప్పి పంపించారు. కానీ కొద్దిసేపటికే ఖలీల్ స్టేషన్ వద్దకు వచ్చి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని స్టేషన్‌లోకి పరుగు తీశాడు. స్టేషన్‌లో ఉన్న సీఐ నాగరాజు, ఎస్‌ఐ సామ్యానాయక్ బయటకువచ్చి సిబ్బందితో మంటలను ఆర్పివేయించారు. వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, పోలీసులు వెంటనే స్పందించినా ఖలీల్ మద్యంమత్తులో అఘాయిత్యం చేసుకున్నాడని సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు.

టీచర్ల పదోన్నతులు చేపట్టాలి : యూఎస్పీసీ

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవులు ముగిసేలోపే ఉపాధ్యాయుల పదోన్నతులు, ఖాళీల భర్తీ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కె.జంగయ్య అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. బదిలీలపై హైకోర్టు తీర్పు వచ్చేలోగా తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు చేపట్టాలని, ఖాళీల్లో నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని యూ ఎస్పీసీ డిమాండ్ చేసింది. సీపీఎస్ రద్దు వాగ్దానంచేసి హిమాచల్, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేంద్ర బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరింది. ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించారని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించింది. సమావేశంలో యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, వై.అశోక్ కుమార్, ఎం.రవీందర్, ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి పాల్గొన్నారు.



కొండగట్టు

శ్రీఆంజనేయం..

మల్యాల (చొప్పదండి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఈనెల 12న ప్రారంభమైన వేడుకలు.. పెద్ద జయంతితో ముగిసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. మూడురోజుల్లో సుమారు రెండు లక్షల మంది స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు అంచనా. లక్షలాదిమంది స్వాములు ఇరుముడులు చెల్లించి, దీక్ష, మాల విరమణ చేసి, మొక్కులు చెల్లించుకుని ఇంటిదారి పట్టారు.



భద్రాచలం

ప్రసన్నాంజనేయం..

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా ఆంజన్న మాలధారులు పోటెత్తారు. 'జై శ్రీరామ్.. జై హనుమాన్' నామస్మరణలతో భద్రగిరి మార్మోగింది. హనుమజ్జయంతి సందర్భంగా అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన, సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఊహించని రీతిలో భక్తుల రాక పెరగడంతో ఆలయంలో లడ్డూ ప్రసాదాల కొరత ఏర్పడింది.

వల వేసి ఉచ్చులోకి..!

సిటీ ఉగ్ర మాడ్యుల్‌లో మహ్మద్ సలీం కీలకం | మిగిలిన ఐదుగురినీ ఆకర్షించింది అతడే | ఏడాది కాలంలో నాలుగు ఇళ్లు మార్చిన వైనం | మధ్యప్రదేశ్ ఏటీఎస్ విచారణలో వెలుగులోకి..



మహ్మద్ సలీం



మహ్మద్ హమీద్



రెహ్మాన్

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఫార్మాస్యూటికల్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మహ్మద్ సలీం టెర్రర్ మాడ్యుల్‌లో కీలకమని నిర్ధారించారు. ఇతడే మిగిలిన వారిని ఈ ఉచ్చులోకి లాగినట్లు తేల్చారు. భోపాల్‌లో చిక్కిన 11 మందితోపాటు నగరంలో అరెస్టు అయిన ఐదుగురినీ ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. మహ్మద్ సలీంగా మారిన సౌరభ్ రాజ్ విద్య 2018లో తన భార్యతో కలిసి నగరానికి వలసవచ్చాడు. తొలుత సైదాబాద్‌లో నివసించిన వీళ్లు అక్కడి ఓ పాఠశాలలో టీచర్లుగా పనిచేశారు. ఇతడు కేవలం ఉగ్రవాద కార్యకలాపాల కోసం మాడ్యుల్ తయారు చేయడానికే హైదరాబాద్ చేరుకున్నట్లు ఏటీఎస్ చెప్తోంది.

అబ్బాస్ కోసం ఆటో ఖరీదు చేసి...

సైదాబాద్ నుంచి సలీం తరచూ మలక్‌పేటలోని ప్రార్థన స్థలానికి వెళ్లేవాడు. అక్కడే ఇతడికి హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ అబ్బాస్ అలీతో పరిచయమైంది. కొన్నాళ్లకు ఇద్దరూ మంచి స్నేహితులుగా మారారు. పేదరికంలో ఉన్న అబ్బాస్‌ను తన దారిలోకి తెచ్చుకోవడానికి సలీం అతడి అవసరాలు తెలుసుకుని ఆటో ఖరీదు చేసి, తక్కువ రేటుకు అతడికి అద్దెకు ఇచ్చాడు. ఇలా పూర్తిగా తన మీద ఆధారపడిన అబ్బాస్‌ను తన ఇంటికి పిలిచి రెచ్చగొట్టే వీడియోలు చూపించడం, ఆడియోలు వినిపించాడు. ఈ క్రమంలో సలీంతో కలిసి పనిచేయడానికి అబ్బాస్ అంగీకరించాడు.

భార్య ద్వారా రెహ్మాన్ పరిచయం

నగరంలోని ఓ మల్టీ నేషనల్ కంపెనీలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రెహ్మాన్‌తోపాటు ఇతడి భార్య కూడా మతం మార్చుకుంది. రెహ్మాన్‌ది ఒడిశా కాగా, అతడి భార్యది మధ్యప్రదేశ్. ఈమెకు, సలీం భార్యకు భోపాల్ నుంచే పరిచయం ఉంది. రెహ్మాన్ తన భార్య ద్వారా సలీం భార్యకు... ఆమె ద్వారా సలీంకు పరిచయమయ్యాడు. తరచూ సలీం ఇంటికి వచ్చి వెళ్లే రెహ్మాన్ మెల్లగా అతడి ఉచ్చులో పడ్డాడు. గోల్కొండలోని ఓ ప్రార్థన స్థలంలో సలీంకు డెంటిస్ట్ షేక్ జునైద్‌తోపాటు దినసరి కూలీ మహ్మద్ హమీద్‌తో పరిచయమైంది. వీరినీ తన దారిలోకి తెచ్చుకున్న సలీం మరికొందరిని తన మాడ్యుల్‌లో చేర్చుకోవాలని భావించాడు. ఈ విషయం హమీద్‌కు చెప్పగా... అతడు తన చిన్ననాటి స్నేహితుడైన జవహర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌ను (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) పరిచయం చేశాడు.

ఖరీదు చేసింది మూడు ఎయిర్ గన్స్

ఈ మాడ్యుల్‌కు ఇప్పటివరకు వేరే ఎవరి నుంచీ ఆర్థిక సాయం అందలేదని ఏటీఎస్ అధికారులు చెప్తున్నారు. ఇప్పటివరకు అయిన ఖర్చంతా సలీం, రెహ్మాన్, జునైద్ భరించారని అంటున్నారు. గత ఏడాది కాలంలో ఇతడు నాలుగు ఇళ్లు మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. సైదాబాద్ నుంచి అక్బర్ బాగ్, అక్కడ నుంచి సీతాఫల్‌మండి.. ఆపై గోల్కొండ ప్రాంతానికి మకాం మార్చాడు. రెహ్మాన్, జునైద్ కూడా ఇతడి ప్రోద్బలంతోనే అక్కడే ఇళ్లు అద్దెకు తీసుకున్నారు. సలీం తన మాడ్యుల్‌ను ప్రాక్టీస్ చేయడానికి ఎంజే మార్కెట్ సమీపంలోని ఓ దుకాణం నుంచి మూడు ఎయిర్ గన్స్, పిల్లెట్స్ కొన్నాడు. వీటిలో రెండే రికవరీ కాగా.. మరోదాని ఆచూకీ లభించలేదు.

అమ్మా.. నీ వెంటే నేనూ

- గంటల వ్యవధిలో తల్లీకుమారుడి మృతి
- మాతృ దినోత్సవం రోజు విషాదం



పార్వతమ్మ (ఫైల్)



ఈశ్వరయ్య (ఫైల్)

హాలియా: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లీ కుమారుడు గంటల వ్యవధిలో మృతి చెందారు. మాతృ దినోత్సవం రోజు నల్లగొండ జిల్లాలో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలివి. హాలియా మున్సిపాలిటీ పరిధి ఇబ్రహీంపేటకు చెందిన వందనపు పార్వతమ్మ (95), చంద్రయ్య దంపతులకు కుమారుడు వందనపు ఈశ్వరయ్య (74)తో పాటు ఐదుగురు కుమార్తెలు సంతానం. వందనపు చంద్రయ్య గ్రామంలోనే కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని పిల్లలను పెంచి పెద్దచేసి అందరి వివాహాలు జరిపించాడు. పదహారేళ్ల క్రితం చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. వీరి కుమారుడు ఈశ్వరయ్య ఇబ్రహీంపేటలో నివసిస్తూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. పార్వతమ్మ, ఈశ్వరయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బిడ్డ వద్ద ఉంటున్న పార్వతమ్మ తీవ్ర అస్వస్థతకు గురై శనివారం ఉదయం 11 గంటలకు మృతి చెందింది. అదేరోజు కుమారుడు వందనపు ఈశ్వరయ్య ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు నల్లగొండ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. తల్లి, కొడుకు ఒకే రోజు 12 గంటల వ్యవధిలో మృతి చెందడంతో ఇబ్రహీంపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

టబ్‌లో ముంచి..ఇద్దరు పిల్లల్ని చంపి..

- మాతృదినోత్సవం వేళ ఓ తల్లి దారుణం
- అనంతరం హెయిర్ కలర్ తాగి ఆత్మహత్యాయత్నం



పిల్లల మృతదేహాలు



భారతి

మీర్‌పేట: అంతర్జాతీయ మాతృ దినోత్సవం వేళ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి ఇద్దరు చిన్నారులను నీటి టబ్‌లో ముంచి చంపి తనూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. మాడ్గుల మండలం కుబ్యాతండాకు చెందిన నేనావత్ శ్రీనివాస్, భారతి (25)కి 2020లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు విక్కీ (17నెలలు), లక్కీ (8 నెలలు) ఉన్నారు. ప్రస్తుతం జిల్లెలగూడ లలితానగర్ రోడ్ నంబర్-2లో నివాసముంటున్నారు. శనివారం ఉదయం అత్తామామలు, ఆడపడుచు పిల్లలను చూసేందుకు ఇంటికి వచ్చారు. ఉయ్యాలలో ఉన్న చిన్న కుమారుడు లక్కీని ఆమె అత్త ఊపుతుండగా 'నువ్వు నా కుమారున్ని ముట్టుకోవద్దు' అనడంతో అత్తాకోడళ్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరికొకరు కలబడగా భర్త శ్రీనివాస్ కలగజేసుకుని సముదాయించడంతో రాత్రి తల్లిదండ్రులు, సోదరి ఇంటి నుంచి వెళ్లిపోయారు. విషయాన్ని భారతి తన తల్లిదండ్రులకు చెప్పడంతో, ఆదివారం ఉదయం ఆమె తల్లిదండ్రులు, సోదరుడు ఇంటికి వచ్చి భార్యాభర్తలిద్దరికీ సర్దిచెప్పి తిరుగుపయనమయ్యారు. ఈ పరిణామాలతో మనస్తాపం చెంది భర్త బయటకు వెళ్లాడు.

పిల్లలను చంపి భర్తకు ఫోన్ చేసి.. :ఇంట్లో ఒంటరిగా ఉన్న భారతి క్షణికావేశంలో ఇద్దరు పిల్లలను నీటి టబ్‌లో ముంచి వారు చనిపోయాక, ఆమె కూడా వెంట్రుకలు నల్లబడేందుకు వాడే వాస్మోల్ హెయిర్ కలర్ తాగింది. భర్తకు ఫోన్ చేసి 'ఇద్దరు పిల్లలను చంపేశాను.. నేను కూడా చనిపోతున్నాను.. నువ్వు ఇక ప్రశాంతంగా ఉండు' అని చెప్పింది. వెంటనే శ్రీనివాస్ ఇంటికి వచ్చి చూసేసరికి ఇద్దరు పిల్లలు అచేతనంగా పడి ఉన్నారు. వెంటనే వారిని కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భారతి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

సింగరేణి అధికారిపై బీఆర్ఎస్ నాయకుడి దాడి

- నీ శవం కూడా దొరకదంటూ బెదిరింపు
- కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఘటన



శివప్రసాద్

ఇల్లెందు: సింగరేణి సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్న బీఆర్ఎస్ నేత ఒకరు.. పై అధికారిపై దాడి చేశాడు. విధులకు సక్రమంగా రావడంలేదని ప్రశ్నించడంతో అతను ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఆదివారం ఈ ఘటన జరిగింది. బాధిత అధికారి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఫిల్టర్ బెడ్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న నాదెండ్ల శ్రీనివాసరెడ్డి ఇల్లెందు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి తరచూ విధులకు గైర్హాజరవుతున్నాడు. వచ్చినా మస్టర్ (హాజరు) వేసుకుని వెళ్లిపోతుండటంతో సింగరేణి అధికారులు అడ్డుకుని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 7 గంటలకు సింగరేణి సేఫ్టీ అధికారి శివప్రసాద్ విధులకు వెళ్తుండగా మధ్యలో శ్రీనివాస రెడ్డి అటకాయించాడు. తాను గతంలో మర్డర్ చేశానని, మళ్లీ చేస్తానని, నీ శవం కూడా దొరకదంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన వెనుక ఎమ్మెల్యే ఉన్నారని, తానే నంబర్-2 అంటూ దుర్భాషలాడుతూ ముఖంపై దాడి చేశాడు. 'మస్టర్ వేసుకుని వెళ్తా, డ్యూటీలకు రానని రెండు రోజుల క్రితమే చెప్పా, నువ్వు మళ్లీ ఉన్నతాధికారులకు ఎందుకు చెబుతున్నావ్' అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన శివప్రసాద్.. సింగరేణి అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌కు విషయం తెలుపగా.. దాడికి నిరసనగా సింగరేణి ఉద్యోగులు పెన్‌డౌన్ కార్యక్రమం పాటించారు. సాయంత్రం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏరియా జనరల్ మేనేజర్ షాలేమురాజుకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడ్డ బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కోటిన్నరకు చేరువలో కంటి వెలుగు పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కోటిన్నర కంటి పరీక్షలకు చేరువైంది. ఈ ఏడాది జనవరి 18న ప్రారంభమైన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కింద 1,42,30,576 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 20.69లక్షల మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 10,285 గ్రామ పంచాయతీ వార్డులు, 3,221 మున్సిపల్ వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రభుత్వ సెలవు దినాలు, పండుగలు మినహాయించి ప్రభుత్వ పనిదినాలకు అనుగుణంగా కొనసాగిస్తూ వచ్చిన ఈ రెండో విడత కార్యక్రమం జూన్ 15వ తేదీ నాటికి వందరోజులు పూర్తి చేసుకోనున్నట్లు రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ తెలిపింది.

దగ్గరి చూపు సమస్యలున్న వారే ఎక్కువ

కంటివెలుగు కార్యక్రమంలో అత్యధికంగా దగ్గరి చూపు సమస్యలున్న వారే గుర్తించబడుతున్నారు. వారికి తక్షణమే రీడింగ్ అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు వైద్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. దగ్గరి చూపు సమస్యలున్న వారిలో అత్యధికులు 40 ఏళ్ల వయసు పైబడిన వారున్నారు. ఇవి కాకుండా కంటి సమస్యలతో వస్తున్న చాలా మందికి చుక్కల మందులతో పాటు విటమిన్ ఏ, డీ, బీ కాంప్లెక్స్ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నారు. కాగా, 50 ఏళ్ల పైబడిన వారు అత్యధికంగా మోతబిందు(కాటరాక్ట్) సమస్యతో బాధపడుతున్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి చికిత్స చేసే సమయాన్ని సెల్‌ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తున్నామని వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదివరకే శస్త్ర చికిత్స పూర్తయి ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి ఎప్పటికప్పుడు వైద్యులు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

'సెగ'దరగ.. ఇదేం భగభగ!



భువనగిరి పట్టణ శివారులో మధ్యాహ్నం 2గంటల సమయంలో నిర్మానుష్యంగా మారిన హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి

▶ మొదటి పేజీ తరువాయి

అదే జిల్లాలోని జన్నారంలో 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికం...

వేసవి సీజన్ చివరి దశలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయని, ప్రస్తుతం సాధారణం కంటే కాస్త ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో ఉష్ణోగ్రతల మధ్య హెచ్చుతగ్గులుంటాయని ఐఎండీ అధికారులు వివరిస్తున్నారు. ఆదివారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఖమ్మంలో ఈ సీజన్ సాధారణ ఉష్ణోగ్రత కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైంది. అలాగే నల్లగొండ, భద్రాచలంలో సాధారణంకంటే 2 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.రానున్న మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉండటంతో దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.



యాదాద్రి కొండపై ఎండ తీవ్రతను తట్టుకోలేక కాళ్లకు చున్నీ, స్కార్ఫ్‌లు కట్టుకొని నడుస్తున్న వృద్ధుడు

బలహీన పడుతున్న 'మోకా'

అతి తీవ్ర తుపానుగా కొనసాగిన 'మోకా' తుపాను మయన్మార్ సమీపంలో తీరం దాటినట్లు వాతావరణ శాఖ తెలిపింది. తుపానుతీరం దాటడంతో బలహీనపడుతుందని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రానికి వాయవ్య దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు వివరించింది.

ఏపీలోనూ మంటలు..

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఏపీలో ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఎండలు భగభగమండగా కోస్తా జిల్లాల్లో వాటి ప్రభావం ఇంకా ఎక్కువ కనిపించింది. అనేక ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉ.11 గంటలకే చాలా ప్రాంతాల్లో 40–41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు బయటకురావడానికే బెంబేలెత్తిపోయారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు గోదావరి, గుంటూరు, పల్నాడు, కాకినాడ, ప్రకాశం జిల్లాల్లో ఎండ తీవ్రతగా ఎక్కువగా కనిపించింది. ఈ జిల్లాల్లో దాదాపు అన్నిచోట్లా 40–44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో అత్యధికంగా 44.8 డిగ్రీలు నమోదైంది. ఏలూరు జిల్లా పంగిడిగూడెంలో 44.7, కామవరపుకోటలో 44.5, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో 44.4, ఏలూరు జిల్లా రాజుపోతేపల్లిలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

20 ఏళ్లుగా ఇంట్లోనే బంధించి..

అనుమానంతో చివరకు భార్య ప్రాణం తీసిన భర్త ● లంగర్‌హౌస్‌లో దారుణ ఘటన



బేగం మృతదేహం

లంగర్‌హౌస్: భార్యపై అనుమానంతో 20 ఏళ్లుగా ఆమెను గదిలో పెట్టి బంధించి, నరకం చూపించాడు. ఎవరితో మాట్లాడినా అనుమానిస్తూ అనేకమార్లు ఇళ్లు మారాడు. చివరకు నాంపల్లి నుంచి లంగర్‌హౌస్ బాగ్దాద్ కాలనీకి మకాం మార్చాడు. పక్కింటి వారితో మాట్లాడిందని ఆరోపిస్తూ భార్యను అతికిరాతకంగా హతమార్చాడు. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీలో నివాసముండే జహంగీర్‌కు పంజగుట్టలో నివాసముండే కనీజ్‌బేగం (40)తో 2004లో వివాహమైంది. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఆటో నడిపించే జహంగీర్ పెళ్లైన నాటినుంచే భార్యను అనుమానిస్తూ వేధిస్తున్నాడు. చివరకు తన తల్లితో కూడా భార్యను ఎక్కువగా మాట్లాడనిచ్చేవాడు కాదు. అతను బయటకు వెళ్లే సమయంలో భార్యను గదిలో ఉంచి బయట నుండి తాళం వేసుకొని వెళ్లిపోయే వాడు. గొడవలు చూసి ఇళ్ల యజమానులు హెచ్చరించడంతో పలుమార్లు ఇళ్లు మారాడు. 10 ఏళ్ల కిందట గొడవలు పెరగడంతో నలుగురు పిల్లలు అయ్యాక అనుమానమేంటని సర్ది చెప్పిన పెద్దలు కనీజ్‌ను మళ్లీ కాపురానికి పంపించారు.

చిన్న కూతురును అడిగి...

భార్యపై అనుమానంతో ఇళ్లు మారుతున్న జహంగీర్ పన్నెండు రోజుల క్రితం లంగర్‌హౌస్ బాగ్దాద్ కాలనీకి మకాం మార్చాడు. ఐదు రోజుల కిందట తన చిన్న కూతురుని పిలిచి అమ్మ ఇక్కడ ఎవరితో అయిన మాట్లాడిందా అని అడిగాడు. పక్కింటి వారితో మాట్లాడిందని కూతురు చెప్పడంతో.. ఊగిపోయిన జహంగీర్ భార్యను నడివీధిలో దారుణంగా కొట్టాడు. దీంతో పిల్లలను తీసుకొని ఎండీలైన్స్‌లో నివాసముండే తన అన్న గఫార్ ఇంటికి వెళ్లింది. శనివారం సాయంత్రం గఫార్ ఇంటికి వెళ్లిన జహంగీర్.. కలిసి ఉందామని నమ్మబలికి, పిల్లలను అక్కడే వదిలి భార్యను బాగ్దాద్ కాలనీలోని ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి భోజనం చేశాక భార్యతో మరోమారు గొడవ పడి... చున్నీతో ఆమె గొంతును బిగించి హత్య చేశాడు. అనంతరం లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి భార్యను హత్య చేశానని చెప్పి లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇళ్లు కూల్చారన్న మనోవేదన

- గౌరవెల్లి నిర్వాసితుడికి అస్వస్థత
- పశువుల కొట్టంలో నివాసం.. చికిత్స



పశువుల కొట్టంలో చంద్రారెడ్డి

అక్కన్నపేట (హుస్నాబాద్): ఇళ్లు కూల్చేశారన్న మనోవేదనతో గౌరవెల్లి నిర్వాసితుడు అస్వస్థతకు గురయ్యాడు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లిలో ఈనెల 10న పోలీసుల పహారా మధ్య అధికారులు నిర్వాసితుల ఇళ్లను కూల్చివేయించారు. అప్పటి నుంచి చాలామంది ఊరిమీది ప్రేమతో మనోవేదనకు గురవుతున్నారు. ఇదేక్రమంలో గ్రామానికి చెందిన అంగెటి చంద్రారెడ్డి (75) అస్వస్థతకు గురయ్యాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కొడుకులు ప్రస్తుతం అదే మండలం నందారం స్టేజీ వద్ద ఇల్లు కట్టేందుకు పునాదులు తీశారు. ఇల్లు పూర్తయ్యేవరకు తండ్రితో కలిసి తెలిసినవారి పశువుల కొట్టంలో ఉంటున్నారు. తండ్రి చంద్రారెడ్డిని కొట్టంలో ఉంచి స్థానిక ఆర్ఎంపీతో చికిత్స చేయిస్తున్నారు.

'దూదేకుల సమస్యలు పరిష్కరించండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దూదేకుల కులస్తుల సమస్యలు పరిష్కరించాలని దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మైనార్టీ ముస్లిం నూర్ బాషా, దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దా సాహెబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న వారికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నామినేటెడ్ పదవుల్లో అవకాశం కలిపించాలని కోరారు. దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు, ఆత్మ గౌరవ భవన నిర్మాణం, రిజర్వేషన్ కల్పన తదితర అంశాలను సైతం వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డి. సుసాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఐదు శాతమే! రాత మార్చింది

బీజేపీ ఓట్లలో 5% కాంగ్రెస్‌కు బదిలీ ● దాంతో హస్తానికి 43% ఓట్లు, 135 సీట్లు

జేడీ(ఎస్) ఓట్లకు 7% కోత వాటిలో 5% బీజేపీకి	బీజేపీకి ఈసారి 36% ఓట్లు 2018లో 36.2% ఓట్లు	తగ్గింది 0.2 శాతమే కానీ 38 సీట్లకు కోత	లింగాయత్ ప్రాబల్యమున్న 69 సీట్లలో 45 కాంగ్రెస్‌కే

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయం విలక్షణమైనదనే చెప్పాలి. రాష్ట్రంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన పార్టీలవారీ ప్రాంతీయ సరిహద్దులను చెరిపేసి ట్రెండునే మార్చేసిన గెలుపది. చారిత్రకంగా బీజేపీ, జేడీ(ఎస్)ల కంచుకోటలైన కీలక ప్రాంతాల్లో ఈసారి కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది. అది కూడా రెండు పార్టీలనూ ఒకే ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో దెబ్బ తీయడం విశేషం. బీజేపీ ఓడినా మొత్తమ్మీద ఆ పార్టీ ఓటు బ్యాంకు మాత్రం పదిలంగానే ఉండటం మరో విశేషం. బీజేపీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 36.2 శాతం ఓట్లు రాగా ఈసారి 36 శాతం దక్కాయి. కాకపోతే ఈసారి జేడీ(ఎస్) రాష్ట్రవ్యాప్తంగా కోల్పోయిన 7 శాతం ఓట్లలో 5 శాతం ఓట్లను బీజేపీ దక్కించుకుంది. అదే సమయంలో అంతిమ ఫలితాన్ని తేల్చడంలో కీలకంగా మారిన పలు అసెంబ్లీ స్థానాల్లో కలిపి మొత్తమ్మీద 5 శాతం ఓట్లను కాంగ్రెస్‌కు కోల్పోయింది. దాంతో మెజారిటీకి బీజేపీ సుదూరంలో ఆగిపోగా ఆ ఓట్ల ఊపుతో కాంగ్రెస్ గెలుపు బావుటా ఎగరేసింది. 2018లో 38 శాతం ఓట్లు సాధించిన ఆ పార్టీ, ఈసారి 43 శాతం ఓట్లతో 135 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 66 సీట్లకు పరిమితమైంది. బీజేపీకి గట్టి పట్టున్న ముంబై కర్ణాటక, జేడీ(ఎస్) దుర్గమైన పాత మైసూరు ప్రాంతాలు ఈసారి కాంగ్రెస్‌కు జై కొట్టాయి. కర్ణాటక ఫలితాల ప్రాంతాలవారీ విశ్లేషణలో ఇలాంటి పలు ఆసక్తికరమైన విశేషాలు తెరపైకి వస్తున్నాయి...

కోస్తా కర్ణాటక

బీజేపీ కంచుకోటల్లో ఈ ప్రాంతమూ ఒకటి. కొన్ని దశాబ్దాలుగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఎప్పుడూ బీజేపీదే పై చేయి. ఈసారి కూడా కాంగ్రెస్ కంటే బీజేపీ రెట్టింపు సీట్లు నెగ్గిన, ఆ పార్టీకి ఊరటగా నిలిచిన ఏకైక ప్రాంతం కోస్తానే. ఇక్కడి 19 స్థానాల్లో బీజేపీ 13, కాంగ్రెస్ 6 నెగ్గాయి. అయినా 2018తో పోలిస్తే బీజేపీకి 3 సీట్లు తగ్గగా ఆ మేరకు కాంగ్రెస్‌కు పెరిగాయి. బీజేపీకి దాదాపుగా 3 శాతం ఓట్లు తగ్గి ఆ మేరకు కాంగ్రెస్‌కు పెరగడమే ఇందుకు కారణం.

బెంగళూరు సిటీ

రాజధాని కావడంతో పూర్తిగా నగర ఓటర్లతో కూడిన వైవిధ్యమైన ప్రాంతమిది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రతి ఎన్నికల్లోనూ నువ్వా నేనా అన్నట్టుగా పోరు సాగుతుంది. గత నాలుగు ఎన్నికల్లోనూ రెండు పార్టీలకూ దాదాపుగా చెరో 40 శాతం ఓట్లొచ్చాయి. ఈసారి కూడా బీజేపీ 46 శాతం, కాంగ్రెస్‌కు 41 శాతం ఓట్లు సాధించాయి. అయితే బీజేపీ 2018 కంటే 4 సీట్లు ఎక్కువగా గెలుచుకోగా కాంగ్రెస్ 2 స్థానాలు కోల్పోయింది. ఇక జేడీ(ఎస్) ఇక్కడ 2018లో గెలిచిన 2 సీట్లనూ కోల్పోయింది.

2018, 2023ల్లో ప్రాంతాలవారీగా పార్టీలు సాధించిన ఓట్ల శాతం



సెంట్రల్ కర్ణాటక

ఇది స్వింగ్ ప్రాంతంగా పేరుబడింది. ఒక్కోసారి ఒక్కో పార్టీని ఆదరిస్తూ వస్తోంది. 2008లో బీజేపీని, 2013లో కాంగ్రెస్‌ను అక్కున చేర్చుకుంది. మళ్లీ 2018లో ఇక్కడి 23 సీట్లలో బీజేపీ 16 గెలవగా ఈసారి కాంగ్రెస్ 15 నెగ్గింది!

హైదరాబాద్ కర్ణాటక

తన కంచుకోటైన ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ ఈసారి స్వీప్ చేసేసింది. ఎస్సీల ఆదరణకు తోడు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత ప్రాంతం కావడం ఈసారి ఆ పార్టీకి మరింత కలిసొచ్చింది. దాంతో 46 శాతం ఓట్లతో మొత్తం 40 సీట్లకు గాను ఏకంగా 26 స్థానాలను ఒడిసిపట్టింది. బీజేపీ 10 సీట్లకు పరిమితమైంది.

ముంబై కర్ణాటక


లింగాయత్‌ల ప్రాబల్యమున్న ఈ ప్రాంతం బీజేపీ కంచుకోట. 1990లో రాజీవ్‌గాంధీ చేతిలో తమ సామాజిక వర్గానికి చెందిన నాటి సీఎం వీరేంద్ర పాటిల్‌కు జరిగిన ఘోర అవమానం నేపథ్యంలో దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను దూరం పెట్టిన లింగాయత్‌లు ఈసారి ఆ పార్టీని అక్కున చేర్చుకున్నారు. దాంతో దాదాపు 45 శాతం ఓట్లతో మొత్తం 50 స్థానాల్లో ఏకంగా 33 సీట్లు కాంగ్రెస్ హస్తగతమయ్యాయి. గత 3 దశాబ్దాల్లో ఇక్కడ కాంగ్రెస్ ఓట్ల శాతం 40 శాతం దాటడం ఇదే తొలిసారి! ఇక బీజేపీ ఈసారి దాదాపు 3 శాతం ఓట్లను కాంగ్రెస్‌కు కోల్పోయింది. దాంతో 2018తో పోలిస్తే ఏకంగా 14 సీట్లు కోల్పోయి 16 సీట్లకు పరిమితమైంది. లింగాయత్‌ల జనాభా 20 శాతానికి పైగా ఉండి వారి ఓట్లు నిర్ణాయకంగా మారే మొత్తం 69 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి ఈసారి కోలుకోలేని దెబ్బ తగిలింది. వీటిలో కాంగ్రెస్ ఏకంగా 45 సీట్లు కొల్లగట్టగా బీజేపీకి కేవలం 20 స్థానాలు దక్కాయి.

పాత మైసూరు

64 అసెంబ్లీ స్థానాలతో రాష్ట్రంలో అతి పెద్ద ప్రాంతమిది. జేడీ(ఎస్)కు ఆవిర్భావం నుంచీ పెట్టని కోటగా ఉంటూ వస్తోంది. ఈసారి కాంగ్రెస్ ఇక్కడ ఏకంగా 42 శాతం ఓట్లు సాధించింది. 2018 కంటే ఇది ఏకంగా 7 శాతం ఎక్కువ! దాంతో కాంగ్రెస్ తన చరిత్రలోనే అత్యధికంగా ఇక్కడ 43 సీట్లు కొల్లగొట్టింది. మరోవైపు జేడీ(ఎస్) 2018తో పోలిస్తే ఏకంగా 9 శాతం ఓట్లు కోల్పోయింది. అప్పుడు 26 సీట్లు నెగ్గగా ఈసారి 14కు పరిమితమైంది. ఇక బీజేపీకి ఓట్లు 2.8 శాతం పెరిగినా ఏకంగా 11 సీట్లు తగ్గాయి!

– సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటకలో గత నాలుగు ఎన్నికల్లో ప్రాంతాలవారీగా పార్టీలకు వచ్చిన సీట్లు



క్లుప్తంగా

బంగ్లా తీరాన్ని తాకిన మోకా

బంగ్లాదేశ్, మయన్మార్‌ల్లో తీవ్ర నష్టం

సాక్షి, విశాఖపట్నం: భీకర మోకా తుపాను ఆదివారం మధ్యాహ్నం బంగ్లాదేశ్, మయన్మార్ తీరాన్ని తాకి తీవ్ర నష్టం కలగజేసింది. గంటకు 200 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. సముద్రంలో 8–12 అడుగుల ఎత్తున ఎగిసిపడిన అలలు లోతట్టు ప్రాంతాలను ముంచివేశాయి. సెంట్ మార్టిన్ దీవిలో బలమైన గాలులు, భారీగా వానలు కురిశాయి. గత రెండు దశాబ్దాల్లో ఇదే అత్యంత శక్తివంతమైన తుపాను అని అధికారులు తెలిపారు. ఈ తుపాను ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం చూపితే హుద్‌హుద్ తరహా పెను విపత్తుకు కారణమయ్యేదని నిపుణులు చెబుతున్నారు.

జగదీశ్ శెట్టార్ ఓటమి

బెంగళూరు: కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం జగదీశ్ షెట్టార్ ఘోర పరాజయం మూటగట్టుకున్నారు. బీజేపీ టికెట్ నిరాకరణతో ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన ఆయన హుబ్బళ్లి-ధార్వాడ్(సెంట్రల్) నియోజకవర్గంలో బీజేపీకి చెందిన మహేశ్ తెంగినకాయ్ చేతిలో 34,289 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షించిన నేవీ

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. నేవీకి చెందిన గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ మర్ముగోవాపై నుంచి ప్రయోగించినట్లు ఆదివారం వెల్లడించారు. ఐఎన్ఎస్ మర్ముగోవాతోపాటు బ్రహ్మోస్ క్షిపణి కూడా దేశీయంగా తయారైనవేనని చెప్పారు. సముద్రజలాలపై మన నావికాదళ శక్తిని, దేశ ఆత్మనిర్భరతకు చాటిచెప్పే పరిణామమని వివరించారు. ధ్వని వేగం కంటే మూడు రెట్లు వేగంతో ఇది దూసుకెళ్లిందన్నారు. భారత్–రష్యా ఉమ్మడిగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జలాంతర్గాములు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలతోపాటు భూమిపై నుంచి సైతం ప్రయోగించేందుకు వీలున్న బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేస్తోంది.

'జనశక్తి' ఎగ్జిబిషన్‌లో మోదీ

న్యూఢిల్లీ: మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ పూర్తయిన సందర్భంగా నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్(ఎన్‌జీఎంఏ)లో ఏర్పాటైన ఎగ్జిబిషన్‌ను ప్రధాని మోదీ ఆదివారం సందర్శించారు. 'జన శక్తి: ఒక సమ్మిళిత శక్తి'ఇతివృత్తంతో ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖులైన 13 మంది కళాకారుల కళా ఖండాలున్నాయి. ఎగ్జిబిషన్‌లో ఆయన కలియదిరిగారని సాంస్కృతిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మన్‌కీ బాత్‌లో తమకు ప్రేరణనిచ్చిన అంశాల గురించి కళాకారులు ప్రధానికి వివరించారని పేర్కొంది.



సీఎం ఎంపిక ఖర్గే చేతికి!

కర్ణాటక సీఎల్పీ ఏకవాక్య తీర్మానం	సోనియా కోర్టులో బంతి	నేడు ఢిల్లీకి సిద్దూ, డీకే?	ఇద్దరి మధ్య పోటీ తీవ్రం

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక అంత తేలికగా ముగిసేలా కనిపించడంలేదు. సీఎం అభ్యర్థిని నిర్ణయించే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకే నూతన ఎమ్మెల్యేలు కట్టబెట్టారు. ఆదివారం సాయంత్రం బెంగళూరులోని ఓ హోటల్లో కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి కారకులైన నాయకులు, కార్యకర్తలు, కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ తొలుత పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. అనంతరం సీఎం ఎంపిక అధికాన్ని ఖర్గేకు అప్పగిస్తూ మాజీ సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన ఏక వాక్య తీర్మానాన్ని కూడా ఎమ్మెల్యేలు ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అధిష్టానం తరపున ఖర్గే నియమించిన ముగ్గురు పరిశీలకులు సీఎం అభ్యర్థిపై ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకుంటారని చెప్పారు. ఆదివారం ఈ తతంగం పూర్తి చేసి సోమవారానికల్లా ఖర్గేకు వారు నివేదిక అందజేస్తారన్నారు. ఖర్గే నియమించిన పరిశీలకుల కమిటీలో మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జితేంద్ర సింగ్, ఏఐసీసీ మాజీ కార్యదర్శి దీపక్ బబారియా ఉన్నారు. వీరు, వేణుగోపాల్ అంతకుముందు సీఎం రేసులో ఉన్న సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు.

కార్యకర్తల హడావుడి

సీఎల్పీ భేటీ జరిగిన హోటల్ బయట కాంగ్రెస్ కార్యకర్తల హడావుడి కనిపించింది. సిద్దరామయ్య, శివకుమార్ వర్గీయులు బ్యానర్లు, జెండాలు చేతబూని తమ నేతే సీఎం అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు ఇద్దరు నేతలు తమకు మద్దతు తెలిపే ఎమ్మెల్యేలతో వేర్వేరుగా భేటీలు జరిపారు. రెండు వర్గాలు పోటాపోటీగా పోస్టర్లు వేశాయి. ఇద్దరు నేతల నివాసాల వద్ద కూడా పోస్టర్లు కనిపించాయి. ఎన్నికలకు ముందు పార్టీ నేతలను ఒకే తాటిపైకి తేవడంలో సఫలీకృతమైన కాంగ్రెస్ పార్టీ ఫలితాల తర్వాత అదే ఐక్యతను కొనసాగించడానికి ఇబ్బందులు పడుతోంది. కర్ణాటక అసెంబ్లీ గడువు ఈ నెల 24తో ముగియనుంది. తాజా ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ సాధించిన కాంగ్రెస్ ఆలోపు ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంది.

నేడూ సీఎల్పీ భేటీ?

బనశంకరి: ఆదివారం నాటి సీఎల్పీ సమావేశానికి చాలామంది ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. దాంతో నూతన సభ్యులందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకు భేటీ సోమవారం కూడా కొనసాగుతుందని భావిస్తున్నారు. సిద్దరామయ్యకు 75 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండగా 40 మంది డీకే శివకుమార్ వెంట ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో వారిద్దరూ సీఎం పదవిని చెరో రెండున్నరేళ్ల పంచుకునేలా సూత్రంపైనా ఆదివారం భేటీలో చర్చించారు. సిద్దరామయ్య, డీకే సోమవారం ఢిల్లీ వెళతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ, రాహుల్ సమక్షంలో సీఎం అంశం కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు.

ఓవర్ టు రాజస్తాన్



ఎస్.రాజమహేంద్రారెడ్డి

మల్లికార్జున ఖర్గే ఇంట గెలిచారు. ఇక రచ్చ గెలవడానికి సన్నద్ధమవుతున్నారు. గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ బాస్‌గా 80 ఏళ్ల వయసులో నియమితుడైనప్పుడు, పార్టీని గాడిలో పెట్టడం ఖర్గేకు తలకు మించి భారమే అవుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. దశాబ్ద కాలంగా వరుస పరాజయాలతో, పరాభవాలతో నానాటికీ తీసికట్టుగా తయారవుతున్న కాంగ్రెస్‌కు యువరక్తం ఎక్కిస్తే ఆ జోష్ వేరేగా ఉండేదని కూడా వ్యాఖ్యానించారు. గాంధీల (సోనియా, రాహుల్)కే చేతకానిది ఈయన వల్ల అవుతుందా అంటూ పెదవి విరిచిన వాళ్లూ ఉన్నారు. శనివారం ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు చూశాక చాలామందికి ఆయన నాయకత్వ పటిమపై అనుమానాలు పటాపంచలైపోయాయి. నిజానికి కాంగ్రెస్ సాధించిన ఈ విజయం మామూలుదా! ఇంకోపార్టీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా సొంత కాళ్లమీద మరో ఐదేళ్ల మందగమనంతోనో, వాయువేగంతోనో పరుగెత్తగల ఆత్మవిశ్వాసాన్ని, సత్తాను కాంగ్రెస్‌కు అందించింది. కర్ణాటక కాంగ్రెస్‌కు రెండు కళ్లలాంటి మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మధ్య రగులుతున్న చిరకాల వైరాన్ని చల్లార్చడం ఎవరి తరమూ కాదన్న సమయంలో ఖర్గే జాతీయ అధ్యక్షుని హోదాలో రంగంలోకి దిగి చాకచక్యంగా ఆ అగ్నిని చల్లార్చారు. అదిగో అక్కడే, ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడటానికి ముందే, యుద్ధ భూమిలోకి దిగకముందే కాంగ్రెస్‌కు సగం విజయాన్ని చేకూర్చారు. అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి ప్రచారం మొదలై ఓటేసే తేదీ వచ్చేదాకా సిద్దరామయ్య, శివకుమార్ పల్లెత్తు మాట అనుకోకుండా ఆప్త మిత్రుల్లా కనిపించడం కర్ణాటక ఓటర్లలోకాంగ్రెస్‌పై నమ్మకాన్ని పెంచింది. రాహుల్ భారత్ జోడో యాత్ర ఎన్నికలకు ముందే కర్ణాటక మీదుగా వెళ్లేట్టు వ్యూహరచన చేయడం కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ఈ రెండు అంశాల్లోనూ ఖర్గే వ్యూహాత్మకంగా వ్యవహరించి కన్నడిగుల మనసు కొల్లగొట్టారు. దాని ఫలితమే ఈ సానుకూల ఫలితాలు.

రాజస్తాన్ పరీక్షకు రెడీ

తన మొదటి లక్ష్యాన్ని జనం జేజేల మధ్య దిగ్విజయంగా చేరుకున్న ఖర్గే తదుపరి లక్ష్యంవైపు దృష్టి సారించారు. బెంగళూరులో మోగిన విజయదుందుభి 1,921 కిలోమీటర్ల దూరంలో ఉన్న జైపూర్‌లో ప్రతిధ్వనించింది. ఒకరకంగా ఇది రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు ఖర్గే మోగించిన నగారా! అంతర్గత పోరుతో సతమతమవుతున్న అక్కడి పార్టీ వ్యవహారాలను కొలిక్కి తేవడం ఖర్గే ముందున్న తక్షణ కర్తవ్యం. సీఎం గహ్లోత్, యువ నేత సచిన్ పైలట్ మధ్య సయోధ్య కుదర్చాల్సి ఉంది. సీన్ రాజస్తాన్‌కు మారుతుంది. అదే సీన్, అదే దర్శకుడు. పాత్రలే మారతాయి. అంతే. చేయి తిరిగిన దర్శకుడు గనుక అక్కడా లక్ష్యాన్ని చేరతారంటున్నారు.

ఇక రాజస్తాన్ 'రచ్చ'పై దృష్టి

2018లో జరిగిన రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపించిన పైలట్‌ను కాదని గహ్లోత్‌కు పట్టం కట్టడంతో వారి మధ్య అగ్గి రాజుకుంది. ఐదేళ్లు గడిచి మళ్లీ ఎన్నికల ముంగిట్లోకి వచ్చేసరికి అది కాస్తా కార్చిచ్చులా వ్యాపించింది. సొంత పార్టీ మీద, ముఖ్యమంత్రి మీదా అలిగి ధర్నా చేసేందుకూ పైలట్ వెనకాడలేదంటే ఆయనలో అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. మరోవైపు గతేడాది సెప్టెంబర్లో తనను వరించి వచ్చిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవిని గహ్లోత్ తృణీకరించారు. సీఎం పదవే ముద్దంటూ బింకానికి పోయారు. అప్పటికే ఆయన పేరిట 12 సెట్ల నామినేషన్ పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. అధిష్టానం కోరికను, లేదా ఆదేశాన్ని మన్నించకుండా రాష్ట్రానికే పరిమితమైన గహ్లోత్‌కు, తన స్థానంలో అధ్యక్షుడైన ఖర్గే ముందు చేతులు జోడించి నిల్చోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. విభేదాలు పక్కన పెడతారా, అధిష్టానం ముందు హాజరవుతారా అంటూ ఖర్గే ఇప్పటికే ఆ ఇద్దరికీ తాఖీదు పంపించారు. గాంధీల ఆశీర్వాదంతో అధ్యక్షుడైన ఖర్గే కర్ణాటక విజయంతో మరో మెట్టు పైకి చేరుకున్నారు. పార్టీలో ఇప్పుడు ఆయన మాటలకు తిరుగులేదు. త్వరలోనే గహ్లోత్, పైలట్‌లను పిలిచి బుజ్జగించడమో, తప్పదనుకుంటే హెచ్చరించడమో తప్పని పరిస్థితిలో ఖర్గే ఉన్నారు. ఈ ఏడాది డిసెంబరులో జరగనున్న రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలను ఎదురీదడం కాంగ్రెస్‌కు కష్టమేనన్నది అంతర్గత నివేదికల సారాంశం. ఈ నివేదికల నేపథ్యంలో ఖర్గే మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు అవసరమైన పథకాలను సిద్ధం చేసుకుంటున్నారు. పక్షం రోజుల ముందే సీనియర్ నేతలు కమల్‌నాథ్, వేణుగోపాల్ ద్వారా సచిన్‌కు రాయబారం పంపారు. విభేదాలు పక్కన పెడితే ఏఐసీసీ జనరల్ సెక్రటరీ పదవితో పాటు వర్కింగ్ కమిటీలోనూ చోటు కల్పిస్తానని ఆశ చూపారు. పైలట్ ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారని అభిజ్ఞ వర్గాల భోగట్టా. ఈ నేపథ్యంలో పైలట్‌ను రాజస్తాన్ పీసీసీ అధ్యక్షునిగా నియమించాలన్నది ఖర్గే మరో ఆలోచనగా ఉంది. పార్టీ టికెట్ల విషయంలో, మంత్రివర్గంలో కొన్ని స్థానాల విషయంలో తనమాట చెల్లితే అభ్యంతరం లేదని పైలట్ భావిస్తున్నట్టు వినికిడి. అయితే ఈ ప్రతిపాదనకు సమ్మతించేది లేదని గహ్లోత్ బాహాటంగానే స్పష్టం చేశారు. దీనికి విరుగుడుగా పైలట్ ఈ నెల చివరి వారంలోనో, వచ్చే నెల మొదటి వారంలోనో పార్టీని చీల్చడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తన తండ్రి రాజేశ్ పైలట్ వర్ధంతి (జూన్ 11) నాటికి పైలట్ చీలిక వర్గాన్ని తయారు చేసి తీరతారంటున్నారు. అదే జరిగితే వీరి వ్యవహారాన్ని అధిష్టానం మరింత సీరియస్‌గా తీసుకునే అవకాశముంది.

గహ్లోత్–పైలట్ విభేదాలు తారస్థాయికి

కాంగ్రెస్ బాస్‌గా భేషైన పనితీరు

గహ్లోత్, పైలట్ తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ నిర్ణయానికి బద్ధులుగా ఉండాలన్నది అధిష్టానం మాటగా ఖర్గే హితవు చెబుతున్నారు. గాంధీలు కూడా ఖర్గే మాటే ఫైనల్ అన్న సంకేతాన్ని పరోక్షంగా ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గహ్లోత్, పైలట్ మధ్య రాజీ కుదిర్చి రాజస్తాన్‌లోనూ పార్టీని ఎన్నికల యుద్ధక్షేత్రంలో సమర్థంగా ముందుకు నడపడం ఖర్గేకు పెద్ద కష్టమేమీ కాదు.

సీబీఐ కొత్త డైరెక్టర్‌గా సూద్

ప్రస్తుతం కర్ణాటక డీజీపీగా ఉన్న సూద్	రెండేళ్లు పదవిలో కొనసాగనున్న సూద్

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తదుపరి డైరెక్టర్‌గా కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. ప్రస్తుత డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైస్వాల్ పదవీ కాలం ఈ నెల 25న ముగిసిపోనుంది. అదే రోజు ప్రవీణ్ సూద్ బాధ్యతలు స్వీకరిస్తారని ఆదివారం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. 59 ఏళ్ల వయసున్న ప్రవీణ్ సూద్ రెండేళ్ల పాటు సీబీఐ డైరెక్టర్ పదవిలో కొనసాగుతారు. 1986 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్ కర్ణాటక్ కేడర్‌కు చెందినవారు. జైస్వాల్ తర్వాత దేశంలో అత్యంత సీనియర్ అధికారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అధిర్ రంజన్ చౌధరి సభ్యులుగా ఉన్న హైపవర్డ్ కమిటీ శనివారం నాటి సమావేశంలో ప్రవీణ్ సూద్ పేరుకి ఆమోద ముద్ర వేసింది. కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణ్ సూద్ నియామకాన్ని రంజన్ చౌధరి వ్యతిరేకించినట్టుగా తెలుస్తోంది. ప్రవీణ్ ఐఐటీ ఢిల్లీ, ఐఐఎం బెంగళూరు, న్యూయార్క్‌లోని సిర్కాజ్ వర్సిటీ నుంచి డిగ్రీలు పొందారు.



సూద్ వర్సెస్ శివకుమార్

సీబీఐ డైరెక్టర్‌గా నియమితులైన ప్రవీణ్ సూద్ చుట్టూ ఎన్నో వివాదాలు ఉన్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ నేతలకి, ఆయనకి మధ్య విభేదాలు తరచూ బట్టబయలయ్యాయి. అందుకే సూద్ నియామకాన్ని హై పవర్డ్ కమిటీ సభ్యుడైన కాంగ్రెస్ నేత రంజన్ చౌధరి తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలుస్తోంది. బెంగళూరు కమిషనర్‌గా 2017లో నియమితులైన సూద్‌ని ఆరు నెలల్లోనే నాటి సీఎం సిద్ధరామయ్య బదిలీ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే సూద్ తిరిగొచ్చి డీజీపీగా ఎదిగారు. సూద్ బీజేపీ ఏజెంట్ అంటూ గత మార్చిలో పీసీసీ అధ్యక్షుడు శివకుమార్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయనపై కేసు పెట్టి అరెస్ట్ చేస్తామని శివకుమార్ బహిరంగంగానే హెచ్చరించారు!

కర్ణాటకలో 66కు పెరిగిన బీజేపీ సీట్లు

బెంగళూరు: కర్ణాటకలో జయనగర అసెంబ్లీ స్థానం ఫలితం ఆదివారం అర్ధరాత్రి దాటాక తేలింది. పోస్టల్ ఓట్లను కూడా కలపగా కాంగ్రెస్ అభ్యర్థి చెందిన సౌమ్యారెడ్డిని బీజేపీ అభ్యర్థి రామమూర్తి 16 ఓట్ల తేడాతో ఓడించినట్టు అధికారులు ప్రకటించారు. దాంతో కాంగ్రెస్ మొత్తం 135 సీట్లు సాధించగా బీజేపీ 66 చోట్ల నెగ్గింది. అయితే స్వతంత్ర ఎమ్మెల్యే లతా మల్లికార్జున్ కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో ఆ పార్టీ బలం 136కు చేరుకుంది.

రష్యాపై ఎదురుదాడికి ఉక్రెయిన్ సన్నాహాలు!

బెర్లిన్: రష్యా ఆక్రమించిన ప్రాంతాలకు తిరిగి విముక్తి కల్పించడానికి ఎదురుదాడికి దిగుతామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. అయితే రష్యా భూభాగంపై దాడులకు పాల్పడబోమని స్పష్టం చేశారు. జర్మనీ పర్యటనకు వెళ్లిన జెలెన్‌స్కీ ఆదివారం జర్మనీ ఛాన్సలర్ ఒలఫ్ స్కాల్జ్‌తో సమావేశమయ్యారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సరిహద్దు ప్రాంతాలకు విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని మీడియాకు తెలిపారు. తమ ప్రాంతాలను రష్యాపై నుంచి తీసుకుంటామన్నారు. రష్యాపై దాడికి దిగేటంత ఆయుధ సంపత్తి తమ దగ్గర లేదన్నారు. రష్యా అక్రమంగా స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తిరిగి తీసుకుంటామని చెప్పారు. తమకు అండదండగా ఉంటూ 300 కోట్ల డాలర్ల విలువైన మిలటరీ సాయం చేసిన జర్మనీ ఛాన్సలర్ ఒలఫ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 15 । మే । 2023



నంబర్ లేకుంటే కటకటాలే

నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై రాచకొండ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. -8లో



మాతృత్వం ఓ మధుర జ్ఞాపకం

'తల్లిగా ఉండడం వాస్తవంగా ప్రపంచంలోనే అత్యంత కష్టతరమైన పని. కానీ ప్రతి స్త్రీకి మాతృత్వం అనేది ఓ మధుర జ్ఞాపకమే' అని సినీనటి భూమిక చావ్లా అన్నారు. -8లో

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రియాద్ నుంచి బయలుదేరిన ఓ ప్రయాణికుడు వయా బహ్రేన్ మీదుగా జీఎఫ్-274 విమానంలో ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతడి లగేజీని తనిఖీ చేసిన అధికారులు 14 బంగారు బిస్కెట్లను గుర్తించారు. 1287 గ్రాముల బరువు కలిగిన బంగారం 67.96 లక్షల విలువ ఉంటుందని నిర్ధారించారు.

సూరీడు సుర్రు!

భానుడి సెగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండకు తోడు వేడి గాలులతో తల్లడిల్లారు. ఆదివారం భాగ్యనగరంలో గరిష్ట ఉష్ణోగ్రత 39.7 డిగ్రీలుగా నమోదైంది. పగటిపూట పలు ప్రాంతాల్లోని రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సూర్యాస్తమయం అనంతరం ఎండ తగ్గడంతో రోడ్డెక్కిన వాహనాలతో రద్దీ కనిపించింది. మధ్యాహ్నం వేళ సెక్రటేరియట్ వైపు వెళ్లే ఎన్టీఆర్ మార్గ్ బోసిపోయింది. రాత్రివేళ ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది.- సాక్షి, సిటీబ్యూరో



మధ్యాహ్నం బోసిపోయిన ఎన్టీఆర్ మార్గ్



నిర్మానుష్యంగా తెలుగు తల్లి ఫ్లైఓవర్



రాత్రి వేళ వాహనాలతో కిక్కిరిసిన ఎన్టీఆర్ మార్గ్

న్యూస్‌రీల్

కిలో చికెన్ రూ.250

ధరలు మరింత పెరిగే అవకాశం!

సాక్షి, సిటీబ్యూరో: చికెన్ ధరలు భగ్గుమంటున్నాయి. ఆదివారం కిలో కోడి మాంసం రూ. 250కి చేరింది. ఎండలు మండుతుండటం, వేడి గాలుల తీవ్రతతో ఫారాల్లోని కోళ్లు చనిపోతుండటంతో ఉత్పత్తులు పడిపోయాయి. దీంతో చికెన్ ధరలు ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం రిటైల్‌గా కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.250 వరకు విక్రయిస్తుండగా.. స్కిన్‌తో ఉన్న చికెన్ రూ.220 వరకు అమ్ముతున్నారు. గత వారం రోజుల్లో కిలో చికెన్ ధర రూ. 50 నుంచి రూ.60 వరకు పెరిగింది. ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడమే చికెన్ ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. వచ్చే ఆదివారం నాటికి ధర మరింత పెరిగే అవకాశం ఉందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. వేసవి సెలవులు, ఫంక్షన్లు ఎక్కువగా జరుగుతుండటంతో చికెన్ వినియోగం బాగా పెరిగి ధరలు మండుతున్నాయి.

మా విజయం వెనుక అమ్మ ముందు చూపు

ట్విట్టర్‌లో పంచుకున్న కొత్వాల్ ఆనంద్



తల్లి, భార్యతో సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: మదర్స్ డే నేపథ్యంలో ఆదివారం నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ట్విట్టర్ ద్వారా తన అనుభవాలను పంచుకున్నారు. తల్లితో పాటు భార్య లలితతో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. ఈ సందర్భంగా 'మదర్స్ డే అనేది ప్రతి ఒక్కరి జీవితంలోనూ అత్యంత విలువైంది. నా తల్లి యశోదా దేవి (89) ముందు చూపు కారణంగానే ఈ స్థాయిలో ఉన్నాం. 1930-40ల్లో గ్రామీణ తెలంగాణలో పాఠశాలలు లేకపోవడంతో ఆమెకు చదువుకునే అవకాశం దక్కలేదు. అయినప్పటికీ ఆమెకు ఉన్న పరిజ్ఞానంతో ఆంగ్ల మాధ్యమంలో చదువుకోకుంటే తన పిల్లలు జీవితంలో ముందుకు వెళ్లలేరని గుర్తించారు. దీంతో మా నివాసాన్ని రంగారెడ్డి జిల్లా కుంట్లూరు నుంచి నగరానికి మార్చారు. ఇక్కడి ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో మమ్మల్ని చేర్పి చదివించారు. అక్కడ నుంచి మా ప్రస్థానం ప్రారంభమైంది. అమ్మ ప్రేమ, కష్టం, ముందు చూపు కారణంగానే మేం ఈ స్థాయిలో ఉన్నాం.. జై హో ఆల్ మామ్స్' అని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుకు నెటిజనుల నుంచి మంచి స్పందన వచ్చింది.

సారూ.. కాస్త చూడరూ!



- ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల విస్తరణలో నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ
- రూ.380 కోట్లతో రహదారులు, సైకిల్‌ట్రాక్ నిర్మాణం
- పనుల్లో నాణ్యతను పరిశీలించే వారే కరువు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్ల విస్తరణలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వివిధ మార్గాల్లో చేపట్టిన నిర్మాణ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరం శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో ఔటర్ బయట ఉన్న సర్వీస్ రోడ్లపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోతోంది. ఐటీ ఉద్యోగుల రాకపోకలు సైతం పెరగడంతో రోడ్ల విస్తరణ తప్పనిసరిగా మారింది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) పలు మార్గాల్లో రోడ్ల విస్తరణ చేపట్టింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 23 కిలోమీటర్ల సైకిల్ ట్రాక్‌తో పాటు సుమారు రూ.380 కోట్లతో రోడ్ల విస్తరణను చేపట్టారు. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల రోడ్లను నాలుగు లేన్‌లకు పెంచుతున్నారు. ఇంత వరకు బాగానే ఉంది కానీ ఈ రోడ్ల నిర్మాణంపై హెచ్‌జీసీఎల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. కాంట్రాక్టర్లు నాసిరకం వస్తువులను వినియోగించేందుకు అధికారులే ఒక విధంగా అవకాశం కల్పిస్తున్నట్లు ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత అనుభవాలను విస్మరించారు..

రోడ్ల విస్తరణలో భాగంగా పలు చోట్ల అండర్‌పాస్‌లు, నాలా పనులు చేపట్టాల్సి ఉంది. వర్షపు నీరు రోడ్లపై చేరకుండా చర్యలు తీసుకోవాలి. గతంలో చిన్న గోల్కొండ వద్ద అండర్‌పాస్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో నెల రోజులకుపైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సరైన నాణ్య లేకపోవడంతో చాలా చోట్ల రోడ్లు కుంగుతున్నాయి. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు సుమారు 24 కిలోమీటర్లకుపైగా రూ.కోట్లు వెచ్చించి ప్రస్తుతం ఈ రోడ్లను నిర్మిస్తున్నారు. గత అనుభవాలు కళ్ల ముందు కనిపిస్తున్నప్పటికీ తాజాగా చేపట్టిన ఈ రోడ్ల నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.


బాధ్యత హెచ్‌జీసీఎల్‌దే..

ఇటీవల ఔటరింగ్ రోడ్డును ఐఆర్‌బీ సంస్థకు 30 ఏళ్ల లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో హెచ్‌జీసీఎల్ బాధ్యతలు సర్వీస్ రోడ్లకే పరిమితమయ్యాయి. 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో ప్రజల అవసరాలకనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు అవసరమైన చోట్ల సర్వీస్ రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉంటుంది. పచ్చదనం పరిరక్షణ కూడా హెచ్‌జీసీఎల్ పర్యవేక్షణలోనే ఉంది. సర్వీస్ రోడ్లకు రెండు వైపులా సుమారు ఒక కిలోమీటర్ విస్తీర్ణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరిస్తున్న కాలనీలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే గ్రిడ్ రోడ్ల నిర్మాణం వంటివి హెచ్‌జీసీఎల్ చేపట్టాల్సి ఉండగా.. కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకమవుతోంది.

కబ్జాలపై కన్నెర్ర

అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం సర్వే నం.307, 308, 329 ,342 ప్రభుత్వ స్థలాలతో పాటు ఎస్ఎఫ్‌సీ, హెచ్ఎండీఏ, చెరువులు, కుంటలు, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం కన్నెర్రజేసింది. సుమారు 2500 అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ రహస్య విచారణ జరిపించారు. అక్రమాలకు బాధ్యులైన ఆర్ఐ పరమేశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేశారు. ఆర్డీఓ మల్లయ్య, తహసీల్దార్ సంజీవరావు పాత్రపై ఆరా తీస్తున్న నేపథ్యంలో 'జస్ట్ మూడేళ్ల ..ప్రభుత్వ భూముల్లో వేలాదిగా అక్రమ నిర్మాణాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 13న ఒక కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ - అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం కూల్చివేతలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అధికారులు చెబుతున్నారు. గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారులు రంగంలోకి దిగి అందిన కాడికి దండుకుని రూ.కోట్లు గడించారు. మేడ్చల్ జిల్లా అధికారుల రహస్య విచారణలో అధికారికంగా రూ.75 కోట్లు.. అనధికారికంగా రూ.375 కోట్ల లావాదేవీలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. భూ మాఫియాపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



అర్వింద్‌కుమార్ జారీ చేసిన ఉత్తర్వులు



ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలెన్నో..

ఎక్కడివీ కరెన్సీ కట్టలు?

- ఓ వ్యక్తి ఇంట్లోంచి రూ.1.65 కోట్లు స్వాధీనం
- అగ్ని ప్రమాదంతో బయటపడిన భారీ నగదు
- హవాలా డబ్బుగా పోలీసుల అనుమానం



రాంగోపాల్‌పేట్: నగరంలోని ఓ వ్యక్తి ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.1.65 కోట్ల నగదు బయటపడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెజిమెంటల్ బజార్‌లో నివసించే భైరి శ్రీనివాస్ అభిజిత్ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉత్పత్తి చేసే కంపెనీలో డీజీఎంగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఆయన ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. అదే సమయంలో శ్రీనివాస్‌తో పాటు కుటుంబ సభ్యులు విశాఖపట్టణంలో ఉన్నారు. స్థానికులు వెంటనే గోపాలపురం పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదిలో ఉండే పనికిరాని వస్తువులు, కొంత చెక్క సామగ్రి మంటల్లో కాలిపోయాయి. మంటలు పూర్తిగా ఆరిపోయిన తర్వాత రాత్రి 12 గంటల సమయంలో గోపాలపురం పోలీసులకు ఇదే ఇంట్లో కోట్ల రూపాయల నగదు ఉందనే సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఇంటిని స్థానికులు, పోలీసులతో పాటు బంధువుల సమక్షంలో తెరిచారు. మొదటి అంతస్తులోని బెడ్రూంలో గాలించారు. మంచం కింద, అల్మారా తదితర ప్రాంతాల్లో గాలించగా రూ.1.65 కోట్ల నగదు లభించింది. ఇందులో 50 మాత్రమే రూ.2 వేల కరెన్సీ నోట్లు ఉండగా.. మిగతావి రూ.500, రూ.200 నోట్లు ఉన్నాయి. పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 2 గంటల సమయంలో నగదును, ఆభరణాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హవాలా నగదేనా?

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు హవాలా మార్గంలో తరలించేందుకు ఉన్నదేననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఓ కంపెనీలో డీజీఎంగా పనిచేసే వ్యక్తి ఇలా ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు ఇలా ఉంచుకుంటారా? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. సాధారణంగా డబ్బు ఇంట్లో ఉండే చాలా భద్రంగా దాచుకుంటారు కానీ.. కేవలం బ్యాగుల్లో, అల్మారాలో నిర్లక్ష్యంగా దాచి ఉంచడంతో ఇవి ఎక్కడికైనా తరలించేందుకు దాచిపెట్టి ఉంటారని, తరచుగా ఇలా డబ్బు తరలించే వాళ్లే ఇలా ఉంచుతారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు భైరి శ్రీనివాస్‌కు ఫోన్ చేస్తే దీనికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని వచ్చిన తర్వాత అన్నీ చూపిస్తానని ముక్తసరిగా జవాబిచ్చారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు స్వాధీనం చేస్తామని, అన్ని రకాల పత్రాలు పరిశీలించిన తర్వాత సక్రమంగా సంపాదించినది అని తేలితే వారికి అప్పగిస్తారని ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు.

ఆది నుంచీ అనుమానాలే..

భైరి శ్రీనివాస్ 10 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. గత 6 ఏళ్ల క్రితం తాను ఉండే ఇంటితో పాటు పక్కనే ఉండే మరో ఇల్లు కొనుగోలు చేశారు. ఈ రెండు ఇళ్లు సుమారు రూ.3 కోట్ల విలువ చేస్తాయి. శ్రీనివాస్ స్వస్థలం అయిన వైజాగ్‌లో కూడా గత కొద్ది రోజుల క్రితమే విలువైన ఇల్లు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. అనతికాలంలోనే కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు ఎలా సంపాదించారని స్థానికులు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. హవాలా వ్యాపారం చేస్తున్నారా? అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.

kక!

- 'కొరియన్' ట్రెండ్‌కు సిటీ యూత్ ఫిదా
- ఆట పాటల నుంచి ఆహారం దాకా...
- బీటీఎస్‌కు పెద్దఎత్తున ఫాలోయింగ్
- కొరియన్ డ్రామాలను తెగచూసేస్తున్న వైనం
- హైదరాబాద్‌లో వెలుస్తున్న స్టోర్స్

హైదరాబాద్.... మినీ ఇండియాగా ప్రసిద్ధి. అనేక ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లు. కొత్తగా ఏ ట్రెండ్ వచ్చినా దాన్ని వెంటనే ఫాలో అవుతుంటారు. ఇప్పుడు అదే కోవలోకి చేరిపోయింది కొరియన్ ట్రెండ్. 2012లో వచ్చిన గంగ్నమ్ స్టైల్ నుంచి ఇప్పటి బీటీఎస్ మ్యూజిక్ దాకా.. వీటికి మనోళ్లు తెగ ఫిదా అవుతున్నారు. కె -పాప్, కె-డ్రామా, కె- ఫుడ్, కె- ఫ్యాషన్‌లపై మన హైదరాబాదీ యువత మోజు పెంచుకుంది. సిటీలో కొరియన్ ట్రెండ్ ఎలా ఉందో ఓ లుక్కేద్దాం!! - సాక్షి, సిటీడెస్క్

దక్షిణ కొరియా సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు నగరాన్ని తుపానులా చుట్టేస్తున్నాయి, లాక్‌డౌన్ టైమ్‌లో చాలా మంది అనేక భారత మెట్రోల్లానే నగరవాసులు కూడా ఆన్‌లైన్ వినోదం వైపు ఎక్కువగా మొగ్గు చూపారు. అదే క్రమంలో కె- డ్రామాల క్రేజ్‌లో చిక్కుకున్నారు. దక్షిణ కొరియా టెలివిజన్ ధారావాహిక 'క్రాష్ ల్యాండింగ్ ఆన్ యు' ముగింపును చూస్తూ హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని మణి తన కన్నీళ్లను ఆపుకోలేకపోయింది. 'దక్షిణ కొరియా వారసురాలు ఉత్తర కొరియా సైన్యానికి చెందిన తీపి-విషాద ప్రేమకథలో లీనమైపోయి ఏడ్చాను' అంటోందామె!

మన సినిమాల్లాగే...

మసాలా మెలోడ్రామాకు అలవాటు పడిన మనకు తగ్గట్టే విదేశీ లొకేషన్స్‌లో పాటలు, మిల్స్ - బూన్ రొమాన్స్, మన సినిమాల్లో తరహాలోనే హాస్యం, ట్రయాంగిల్ లవ్ స్టోరీస్, కిడ్నాప్‌లు, ఆకస్మిక మతిమరుపు, సంకల్ప శక్తి కలిగిన తల్లులు, కుటుంబ గౌరవం కోసం ప్రతీకారం తీర్చుకోవడాలు అన్నీ వీటిలోనూ ఉండడం విశేషం. యూరోమానిటర్ ప్రకారం, కె-డ్రామాలను భారతీయులు ఎక్కువగా వీక్షించడంతో, నెట్‌ఫ్లిక్స్‌లో కె-డ్రామాల వీక్షకుల సంఖ్య 370 శాతం పెరిగింది. వీటిని హిందీ, తెలుగు, తమిళ భాషల్లో అనువాదం చేయడంతో నగర యువత కె-డ్రామాకు పెద్ద ఎత్తున అభిమానులయ్యారు.

బీటీఎస్ హోరులో...

కొరియన్ మ్యూజిక్ సెన్సేషన్ బీటీఎస్ (బుల్లెట్ ప్రూఫ్ బాయ్ స్కౌట్స్ లేదా బ్యాంగ్టన్ బాయ్స్) ఇప్పుడు ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తోంది. 21వ శతాబ్దిలో పాప్ ఐకాన్‌గా నిలిచింది. 2010లో ఓ గ్రూపుగా ఏర్పడిన ఏడుగురు సభ్యుల బృందం జూన్ 2013లో తమ మొదటి ఆల్బమ్ '2కూల్ 4స్కూల్' పేరుతో దూసుకొచ్చారు. ఈ ఆల్బమ్ ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల సంఖ్యలో అభిమానుల హృదయాలను గెలుచుకుంది. హిప్ హాప్ బ్యాండ్ గ్రూప్‌గా మొదలు పెట్టి కే-పాప్(కొరియన్ పాపులర్ మ్యూజిక్), పాప్(పాపులర్ మ్యూజిక్), ఆర్ అండ్ బీ (రిథమ్ అండ్ బ్లూస్), ఈడీఎం(ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మూజిక్) వంటి అనేక రూపాల్లో తమ సత్తాను చాటుకుంది.



నాటకాల నుంచీ నాలుగు విధాలుగా...

తినే ఆహారం, ధరించే దుస్తులు, ఆభరణాలు, ఇంకా ముందుకెళ్లి వారు తాగే సోజు (కొరియన్ ఆల్కహాలిక్ పానీయం), వారు మాట్లాడే భాష వారు ఉపయోగించే సౌందర్య ఉత్పత్తులు ఇలా ప్రతిదీ సిటీ యూత్‌కి ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా మారాయి. దేశంలో ఒక్క దక్షిణ కొరియా నూడిల్ బ్రాండ్ నోంగ్‌షిమ్ మాత్రమే 1 మిలియన్ డాలర్ల విక్రయాలను నమోదు చేసింది.

భాషపై సిటీజనుల ఆసక్తి

ఈ కె డ్రామాల క్రేజ్‌తో సిటీలో కొరియన్ భాషా తరగతులపై ఆసక్తి కూడా బాగా పుంజుకుంది. ''కొరియన్ భాషను నేర్చుకునే వారు తమకు నచ్చిన భాషా చిత్రాల్లో వారి చిహ్నాలు ఏమి చెబుతున్నాయి, గాయకులు ఏమి పాడుతున్నారనేది అర్థం చేసుకోవాలనుకుంటున్నారు. అలాగే భాష ద్వారా కొరియాతో నేరుగా కనెక్ట్ అవ్వాలనుకుంటున్నారని ఇండో-కొరియన్ కల్చరల్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌కు చెందిన నగరశాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు.


సిటీలో కొరియన్ స్టోర్స్

కొరియన్ ట్రెండ్‌కు అనుగుణంగా నగరంలోని బాలానగర్, మాదాపూర్, హిమాయత్‌నగర్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, బంజారాహిల్స్, గచ్చిబౌలి, అమీర్‌పేట, సికింద్రాబాద్, తిరుమలగిరి వంటి ప్రాంతాల్లో గ్రాసరీ స్టోర్స్, ఆర్గానిక్ ఫుడ్ కాస్మొటిక్, ఫుడ్ బేకరీ, కేక్ , కిచెన్ స్టోర్స్ వెలిశాయి. జూబ్లీహిల్స్‌లో చబ్బీ చో, బంజారాహిల్స్‌లో సెవెన్ సిస్టర్స్, గచ్చిబౌలిలో హైకూ రెస్టారెంట్లు కొరియన్ వంటకాలు ఇష్టపడే నగరవాసుల అభిరుచులకు తగ్గ ఆతిథ్యాన్ని అందిస్తోంది.

కొరియన్ కల్చర్ విజృంభణ వెనుక మొత్తం ఆ దేశపు నాటకాలే ప్రధాన కారణంగా విశ్లేషకులంటున్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉన్న 500 కొరియన్ డ్రామాలలో డిసెండెంట్స్ ఆఫ్ ది సన్, బాయ్స్ ఓవర్ ఫ్లవర్స్, రిప్లై 1988, కింగ్‌డమ్, స్కై కాజిల్... వంటివి వీక్షకుల క్రేజ్‌కు పునాది రాళ్ల వంటివిగా చెప్పొచ్చు. 'ఒత్తిడితో కూడిన పరిస్థితిలో కొరియన్ నాటకాలు నన్ను నవ్విస్తాయి' అని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని వర్షి అంటోంది.

ఫుడ్‌కు యమా క్రేజ్

నటీనటులు తమ చాప్‌స్టిక్‌లతో వేడి వేడి కప్పు రమ్యున్ నూడుల్స్‌పై చప్పరించడం లేదా కిమ్చీని తినే సన్నివేశాల వీక్షణ ద్వారా పుట్టుకొస్తున్న అభిరుచులు నగరవాసుల్ని పట్టి కుదిపేస్తున్నాయి. దశాబ్దానికి పైగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నివసిస్తున్న కొరియన్ జాతీయురాలు చో మిన్ యున్ నగరంలో కొరియన్ వంటకాలకు ప్రత్యేకించిన గోగురియో రెస్టారెంట్‌ను ఇటీవలే హైటెక్ సిటీలో ప్రారంభించారు. 'కె-డ్రామా కె-పాప్‌ల జనాదరణతో, కొరియన్ ఫుడ్‌పై కూడా ఆసక్తి పెరుగుతోంది అందుకే రెస్టారెంట్ ప్రారంభించాలని నిర్ణయించుకున్నాను' అని చో మిన్ యున్ వివరించారు.



నాటకాలే ప్రధాన కారణం



పాల వినియోగం ఉండదు

కొరియన్ ఆహార సంస్కృతి చైనీస్, జపనీస్ సంస్కృతుల నుంచి ప్రేరణ పొందింది. ఆహారంలో, పాల అతి వినియోగం ఉండదు. కొరియన్ మిరపకాయ పేస్ట్ అయిన గోచుజాంగ్ గోచుగారు - కాల్చిన మిరప పొడి, ఇది భారతీయ మిరపకాయ కంటే చాలా భిన్నంగా ఉంటుంది. ఆహారం ఎల్లప్పుడూ కిమ్చీతో వడ్డిస్తారు, కొరియన్ల కోసం చాలా ప్రత్యేకమైన పులియబెట్టిన సైడ్ డిష్ సంప్రదాయకంగా చేప నూనెతో వడ్డిస్తారు. ఇక్కడి ప్రజలు దాన్ని ఎక్కువగా ఇష్టపడరు, దీంతో చేప నూనెను వాడటం మానేశాను.

– బెంజమిన్, జూబ్లీహిల్స్‌లోని ఓ కొరియన్ రెస్టారెంట్ చెఫ్

బీటీఎస్‌కు పెద్ద ఫ్యాన్



మొదటి నుంచి పాప్ సంగీతం అంటే ఇష్టం. ఇక కొరియన్ బీటీఎస్, ఎక్సో, బ్లాక్ పింక్, రెడ్ వెల్వెట్, షిండీ గ్రూపుల పాటలు వింటాను. మొదట్లో భాష అర్థం కాకపోయేది. క్రమక్రమంగా అలవాటు అయ్యింది, ఆ పాటలు నేర్చుకున్నా. బీటీఎస్‌లో సుగా అంటే ఇష్టం. వాళ్ల కాన్సర్ట్ వెరీ గుడ్. ఇక ఈ బృందంలోని ఏడుగురిది ఒక్కొక్కరిదీ ఒక్కో స్ఫూర్తిదాయక చరిత్ర. చాలా కష్టాలకు ఎదురొడ్డి ఈ స్థాయికి వచ్చారు.

-పి.రితిక, బీఎస్సీ ఫస్ట్ ఇయర్, నారాయణగూడ

నంబర్ లేకుంటే కటకటాలే!



- వాహనాల నెంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై సీరియస్
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న రాచకొండ ట్రాఫిక్ పోలీసులు
- గత నాలుగు నెలల్లో 49 వేలకు పైగా కేసులు
- తాజాగా ఆరుగురికి జైలు శిక్ష విధించిన కోర్టు

సాక్షి, సిటీబ్యూరో: నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై రాచకొండ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ప్రతి రోజు ఉదయం , సాయంత్రం సమయాల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. నెంబర్ ప్లేట్ సరిగా లేకపోయిన, కనిపించకుండా ప్లేట్‌ను వంచినా, మాస్క్ వేసినా, అస్పష్ట నెంబర్ ప్లేట్‌తో నడిపినా, ట్యాంపరింగ్ చేసినా కేంద్ర మోటారు వాహన చట్టం సెక్షన్ 192 కింద కేసులు నమోదు చేస్తున్నారు. చార్జిషీట్లు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు రాచకొండ పరిధిలో 49 వేలకు పైగా నెంబర్ ప్లేట్ టాంపరింగ్ కేసులు నమోదయ్యాయి.

పునరావృతమైతే అంతే..

కొత్త వాహనాలు 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ తెలిపారు. నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌తో తొలిసారి చిక్కిన వాహనదారులు వెంటనే వాటిని సరిచేసుకోవాలని, ఇదే తప్పు పునరావృతం ఐతే కిమినల్ కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు.

ఆరుగురికి జైలు శిక్ష..

నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేస్తూ రెండోసారి పట్టుబడిన ఆరుగురు నిందితులకు న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధించింది. వీరిలో అత్యధిక మందికి రూ.5 వేల వరకు జరిమానా విధించారు. అలాగే మూడు నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్ష కూడా విధించారు. ఇకపై నెంబర్‌ప్లేట్లు లేని వాహనాలు నడిపే వారందరిపై కేసులు నమోదు చేసి చార్జిషీట్లు నమోదు చేస్తామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. వాహనదారులు ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాల వల్ల నేరాలకు ఆస్కారం ఉంటుందని, అలా జరగకుండా చూడాల్సిన అవసరం ఉందంటున్నారు.

ఏటీఎంలో చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.ఐదు లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు

కేపీహెచ్‌బీకాలనీ: నకిలీ తాళాలు, పాస్‌వర్డులతో ఏటీఎం యంత్రాన్ని తెరిచి అందులోని రూ.5 లక్షల రూపాయల నగదును దోచుకువెళ్లిన నిందితుడిని ఒక్క రోజులోనే కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన సుద్దాల హరీష్ కుత్బుల్లాపూర్ పరిధిలోని ద్వారకానగర్‌లో నివాసం ఉంటూ పెట్రో ఏటీఎం సర్వీసెస్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆశతో తాను ఇటీవల కాలంలో మరమ్మతులు చేసిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని మహారాష్ట్ర బ్యాంక్ బ్రాంచ్ వద్ద ఉన్న ఏటీఎం కేంద్రం తాళాలను, పాస్‌వర్డులను దొంగిలించాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటరిగా తలకు హెల్మెట్ ధరించి ఏటీఎం కేంద్రంలోకి వచ్చాడు. అప్పటికే తనవద్ద ఉన్న తాళాలు, పాస్‌వర్డులతో ఏటీఎం యంత్రంలోని డబ్బుదాచే తలుపులు తెరిచాడు. అందులో ఉన్న రూ.ఐదు లక్షల రూపాయల నగదును తీసుకొని అక్కడి నుంచి పారిపోయాడు. అయితే పూణేలోని సీసీ కెమెరాల సర్వైలెన్స్ కేంద్రంలో చోరీ ఘటనను గుర్తించి అక్కడి నిర్వాహకులు శనివారం తెల్లవారుజామున రెండున్నర గంటలకు మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్ కొమ్ము వెంకట శ్రీధర్ శాస్త్రికి ఫోన్ చేసి చోరీ విషయాన్ని తెలిపారు. దీంతో వెంటనే సుమారు మూడున్నర గంటల సమయంలో ఏటీఎం కేంద్రం వద్దకు చేరుకున్న బ్యాంక్ మేనేజర్ చోరీ విషయాన్ని నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సీసీ కెమెరాలలో రికార్డయిన ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడింది టెక్నీషియన్ హరీష్‌గా గుర్తించారు. ద్వారకానగర్‌లోని హరీష్ ఇంటిపై ఆకస్మికంగా దాడిచేసి అతన్ని ఇంట్లోనే అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.ఐదు లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. చోరీ జరిగిన ఒక్కరోజులోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులను, కేపీహెచ్‌బీ పోలీసు సిబ్బందిని సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాసరావుతో పాటు కూకట్‌పల్లి సీఐ కిషన్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మాతృత్వం ఓ మధుర జ్ఞాపకం


కార్యక్రమంలో మాట్లాడుతున్న నటి భూమిక

- నటి భూమిక చావ్లా
- ఈషా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం

బంజారాహిల్స్: 'తల్లిగా ఉండడం వాస్తవంగా ప్రపంచంలోనే అత్యంత కష్టతరమైన పని. కానీ ప్రతి స్త్రీకి మాతృత్వం అనేది ఓ మధుర జ్ఞాపకమే' అని ప్రముఖ బాలీవుడ్ నటి భూమిక చావ్లా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 లోని ఈషా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమికను ఈషా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. సంతానం కోసం ఆతృతపడే వారికి తమ సంస్థ ద్వారా 'మహిళలకు మాతృత్వం' అనే బహుమతిని అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా భూమిక మాట్లాడుతూ..మాతృత్వం అనేది ప్రతి స్త్రీకి ఒక సున్నితమైన అంశమని, సంతానలేమికి సంబంధించి సామాజికంగా సమస్యను ఎదుర్కొంటారన్నారు. తాజా సాంకేతికత పరిశోధన ఈ రంగంలో అత్యుత్తమమైన నైపుణ్యాలు ఈషా ఐవీఎఫ్ సొంతం చేసుకుందన్నారు. మానసిక మద్దతును అందిస్తుందన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ చందనా లక్కిరెడ్డి మాట్లాడుతూ..సంతానలేని సమస్య రోజు రోజుకి ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారిందన్నారు. ప్రతి ఆరుగురిలో ఒకరు తమ జీవితకాలంలో ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని, ఇది జనాభాలో 17.5 శాతం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య పర్వతనేని, డాక్టర్ చాందిని చింత తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల హుక్కా దందా

- టోలిచౌకి ప్రాంతంలో ప్రత్యేక పార్లర్ ఏర్పాటు
- గుట్టురట్టు చేసిన పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: టోలీచౌకి ప్రాంతంలో గుట్టుగా హుక్కా దందా సాగిస్తున్న అన్నదమ్ములకు పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ది సీషా ఫ్యాక్టరీ కేఫ్ పేరుతో నడుస్తున్న హుక్కా పార్లర్‌పై దాడి చేసి ఇరువురినీ అరెస్టు చేసినట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు ఆదివారం వెల్లడించారు. పాతబస్తీలోని కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అర్షద్ హుస్సేనీ, సయ్యద్ ఒబేద్ హుస్సేనీ అన్నదమ్ములు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వీళ్లు కాకతీయ నగర్‌లో ఈ హుక్కా పార్లర్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లుగా గుట్టుగా సాగుతున్న దీనికి వచ్చే యువతకు వివిధ రకాలైన ఫ్లేవర్స్‌తో కూడిన పొగాకు ఉత్పత్తుల హుక్కా అందిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ పార్లర్‌లో భారీగా పొగాకు ఉత్పత్తులతో పాటు మండే స్వభావం ఉన్న వాటినీ గుర్తించారు. ఓ భవనం రెండో అంతస్తులో ఈ పార్లర్ ఉందని, అందులో ఉన్న ఉత్పత్తుల కారణంగా అగ్నిప్రమాదాలకు ఆస్కారం లేకపోలేదని పోలీసులు చెప్తున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు.

క్లుప్తంగా

కుషాయిగూడలో భారీ చోరీ

రూ.8 లక్షల నగదు, 35 తులాల బంగారు ఆభరణాలు మాయం

కుషాయిగూడ: రిసార్టులో పుట్టినరోజు వేడుకలు జరుపుకొని వచ్చేలోగా ఇల్లు గుల్లయింది. ఇంట్లో నగదుతో పాటు పెద్ద మొత్తంలో బంగారం దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రథమపురి కాలనీలో నివసించే కరన్ ముఖర్జీ పాన్‌బ్రోకర్‌గా వ్యాపారం చేస్తుంటాడు. శనివారం తన కుమారుడి పుట్టినరోజు వేడుకలను షామీర్‌పేట్‌లోని ఓ రిసార్ట్‌లో నిర్వహించాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన కరన్ కుటుంబ సభ్యులు ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో ఇంటికి తిరిగివచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి ఉన్నాయి. దీంతో ఆందోళన చెందిన కరన్ కుటుంబ సభ్యులు లోనికి వెళ్లిచూడగా ఇంట్లో ఉన్న రూ.8 లక్షల నగదు, 35 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మదన్‌లాల్ తెలిపారు.

సిటీలో తెలంగాణ-ఒడిశా వైద్యుల సదస్సు



సాక్షి సిటీ బ్యూరో: తెలంగాణ ఒడిశా వైద్యుల సంఘం తొలి సదస్సు టుడాకాన్ (టీటీడీఏసీఏఎస్)నగరంలోని ఏఐజీ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించారు. దీనిని ఒడిశా రాష్ట్ర మంత్రి సవ్యసాచి నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర హెచ్ అండ్‌ఎఫ్‌డబ్ల్యు మిషన్ డైరెక్టర్ శ్వేతా మహంతి, ఏఐజీ ఆసుపత్రి వైస్ చైర్మన్ డా.పీ.సి రథ్, టీటీడీఏ ప్రెసిడెంట్ డా.సునీల్ స్వైన్ పాల్గొన్నారు.

కాగ్నా నదిలో బాలుడు మునక

- దైవ దర్శనానికి వచ్చి అనంతలోకాలకు
- బాలుడు బోరబండ వాసి


సమజ్ఞాన్ మృతదేహం

ధారూరు: కాగ్నా నది చెక్ డ్యామ్‌లో బాలుడు మునిగి మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెలువు రోజు కావడంతో హైదరాబాద్‌లోని బోరబండ బాబాసైలానీనగర్‌కు చెందిన ఎ.చంద్రకాంత్ కుటుంబం..బంధువులతో కలిసి ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ ప్రాంగణానికి చేరుకున్నారు. ముందుగా శిలువ వద్ద ప్రార్థనలు చేశారు. భోజనాల కోసం వంట పనుల్లో నిమగ్నమయ్యారు. చంద్రకాంత్ కుమారుడు సమజ్ఞాన్(13) కొంతమంది పిల్లలతో కలిసి సమీపంలోని కాగ్నానది చెక్‌డ్యాం నీటిలోకి దిగారు. సమజ్ఞాన్ లోతైన నీటిలోకి జారిపోయాడు. భయపడిన మిగిలిన పిల్లలు పరు గున వచ్చి చెప్పడంతో వెంటనే కుటుంబీకులు నీటిలో దిగి బాలుడిని బయటకు తీసి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 నెలల కూతురితో సహా తల్లి ఆత్మహత్య

భర్త వేధింపులే కారణమని ఫిర్యాదు


విజయ వసంత కుమారి (ఫైల్)

ముషీరాబాద్: భర్త, అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ గృహిణి 10 నెలల బిడ్డతో సహా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాంనగర్ బాకారంలో నివాసం ఉండే విజయ వసంత కుమారి, ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి విద్యాసాగర్ భార్యా భర్తలు. వీరికి 10 నెలల కూతురు విద్యాధరణి ఉంది. విద్యాసాగర్ వివాహం జరిగిన నాటి నుంచి భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గొడవలు జరిగాయి. ఈ నెల 12న భార్య, కూతుర్ని ఇంట్లో ఉంచి..తన తల్లిని తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లాడు. అనంతరం 13వ తేదీన అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. తలుపుతట్టగా ఎంతకూ తీయకపోవడంతో ఇరుగుపొరుగువారు, పోలీసుల సాయంతో తలుపులు తెరిచి చూడగా విజయ వసంతకుమారితో పాటు చిన్నారి మృతిచెంది కన్పించారు. తల్లీ కూతురు పురుగుల మందు తాగి మృతిచెంది ఉంటారని ముషీరాబాద్ పోలీసులు భావిస్తున్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నా కూతుర్ని హత్య చేశారు...

అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివాసం ఉండే విజయవసంత కుమారి తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ పోలీసులు 306, 498ఎ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ కూతురు, మనవరాలికి విషమిచ్చి అల్లుడే హత్యచేశాడని నూకరాజు ఆరోపించారు. ప్రస్తుతం విద్యాసాగర్ ముషీరాబాద్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్ పర్యవేక్షణలో ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

గోవా నుంచి మద్యం తెస్తే కేసులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్పెషల్ డ్రైవ్


స్పెషల్ డ్రైవ్‌లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాజేంద్రనగర్: గోవాతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుండి మద్యాన్ని తీసుకొచ్చిన వారిపై ఎక్సైజ్ శాఖ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. గత వారం రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. గోవా నుండి మద్యాన్ని తీసుకొస్తున్న వారిని గుర్తించి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. గోవా నుండి మద్యం బాటిళ్ల తీసుకురావడం నేరమన్నారు. గోవాకు వెళ్లిన వారు తమ వెంట బాటిళ్ల తీసుకొస్తున్నారని తమకు సమాచారం ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. గోవాకు వెళ్లిన వారు తమ వెంట మద్యం బాటిళ్లను తీసుకురావొద్దని సూచించారు. ఎవరైనా తీసుకొస్తే వారిని గుర్తించి ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఒక్క బాటిల్ ఉన్నా కేసు నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా మద్యంను తీసుకొచ్చి ఇక్కడ విక్రయించిన లేదా తమ ఇళ్లల్లో స్టాక్ పెట్టుకున్నా... నేరమన్నారు. రాష్ట్రంలో తయారైన రాష్ట్రంలో విక్రయించే బాటిళ్లను మాత్రమే వినియోగించాలని సూచించారు.

విదేశీ మద్యం స్వాధీనం

అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతానికి చెందిన బి.జనార్దన్ రెడ్డి, అగర్వాల్ వద్ద విదేశీ మద్యం ఉందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

'ఐదు తరాలు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న నర్సింహారెడ్డి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ ఉద్యమకారుడు గులాబీల మల్లారెడ్డి రచించిన కథల సంపుటి 'ఐదు తరాల' అనే పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ సాహితీవేత్త, అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం తమ ఐదు తరాలకు చెందిన వారసులు ఎలా పోరాటం చేశారో ఈ పుస్తకం ద్వారా తెలియజేయడం స్ఫూర్తిదాయకం అన్నారు. ఇలాంటి పోరాటపటిమ ఉన్న నాయకుల స్ఫూర్తి భవిష్యత్ తరాలవారికి ఎంతో అవసరం అన్నారు. పుస్తక రచయిత గులాబీల మల్లారెడ్డి మాట్లాడుతూ... మాకు సంబంధించిన ఐదు తరాల వారు దొరతనానికి, దోపిడీకి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రముఖ సాహితీవేత్త కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా మంత్రి శ్రీదేవి, రాపోలు సుదర్శన్, బొజ్జా భిక్షమయ్య, ప్రమోద్ ఆవంచ, వేముల ప్రభాకర్, గుడిపాటి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ పెంచాలి

గవర్నర్ తమిళిసై


సత్య నాట్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి పాఠశాల స్థాయినుంచే శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నాట్యరాజన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ ప్రియా కార్తికేయన్ శిష్యురాలు డాక్టర్ ఎస్ఎన్.సత్య భరతనాట్య ఆరంగేట్రం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలకు చక్కటి హావాభావాలతో చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి శాస్త్రీయ సంగీత కళలపట్ల అభిరుచి కలిగి ఉండడం ఎంతో మంచి విషయమన్నారు. అనంతరం నృత్య గురువులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు సాయికుమార్, ప్రముఖ నృత్య గురువు పుంజాల అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తదితరులు

పోలీసుల కస్టడీలో వజ్రాభరణాల దొంగ

- చోరీ సొమ్మంతా గుంతలు తీసి పాతిపెట్టిన వైనం
- మొత్తం రికవరీ దిశగా పోలీసులు


నిందితుడు చాపల అంజప్ప

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.72లోని ప్రశాసన్‌నగర్‌లో మాజీ డీజీపీ ఆనందయ్య నివాసంలో వజ్రాభరణాలు, వెండి వస్తువులు, డాలర్లు దొంగిలించిన కేసులో నిందితుడిని రెండు రోజుల కస్టడీలో భాగంగా విచారించారు. ఈ ఘటనలో సొత్తు రికవరీతో పాటు మరింత సమాచారం రాబట్టేందుకు నిందితుడిని శని, ఆదివారాలు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం సాయంత్రం జైలుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే..నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన చాపల అంజప్ప అలియాస్ అంజలప్ప(24) చింతల్‌బస్తీల చేపల వ్యాపారం చేస్తూ జల్సాలకు అలవాటుపడ్డాడు. రోజువారి సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలపై దృష్టి పెట్టాడు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో శమంతక జ్యువెలర్స్‌లో ఆభరణాలు దొంగిలించగా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ డీజీపీ ఇంట్లోకి ప్రవేశించి 30 తులాల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, డాలర్లు, నగదు తస్కరించి పరారయ్యాడు. పోలీసులు గాలిస్తుండగానే నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడి అక్కడి పోలీసులకు చిక్కాడు. జైలులో ఉన్న అంజప్పను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీకి తీసుకొని సొత్తు రికవరీ కోసం విచారణ చేపట్టారు. ప్రశాసన్‌నగర్ దొంగతనం అనంతరం నిందితుడు ఆభరణాలు ఖైరతాబాద్ రైలు పట్టాల పక్కన గుంత తీసి పాతిపెట్టినట్లు చెప్పాడు. వెండి వస్తువులను బంజారాహిల్స్‌లోని శ్మశాన వాటికలో గుంత తీసి అందులో భద్రపరిచాడు. డాలర్లను, ఖరీదైన వాచీలను కేర్ ఆస్పత్రి వెనుకాల ఉన్న ఓ పాడుబడ్డ భవనంలో ఉంచాడు. అక్కడి నుంచి యాదాద్రికి దర్శనానికి వెళ్ళాడు. వచ్చిన తర్వాత జైలులో పరిచయం అయిన బార్కాస్ పాత నేరస్తుడు అబ్దుల్లాతో జతకట్టి ప్రశాసన్ నగర్ చోరీలో దాచిన రెండు బంగారు బిస్కెట్లు చార్మినార్ వద్ద విక్రయించినట్లు అంగీకరించాడు. మొత్తం సొత్తును రికవరీ చేసే దిశలో పోలీసులు సఫలమైనట్లు సమాచారం.

క్లుప్తంగా...

18న 'బీసీల గోస-బీజేపీ భరోసా' సదస్సు

- బీఆర్ఎస్ పాలనలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమావేశంలో పాల్గొన్న చింతల, ఓబీసీ మోర్చా నేతలు

బంజారాహిల్స్: ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో బీసీల గోస-బీజేపీ భరోసా సదస్సులో బీసీలంతా పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన సమావేశం ఆదివారం సాగర్ సొసైటీలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన చింతల మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఓబీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వంపై దీని ప్రభావం పెద్ద ఎత్తున చూపుతుందని ఆయన పేర్కొన్నారు. బీసీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జాలి చూపించడం లేదని శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ డ్రీమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జకీర్

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని వాసవీ డ్రీమ్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జకీర్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జయబాబు, కోశాధికారిగా రామమోహనరావు ఎన్నికయ్యారు. వాసవీ డ్రీమ్స్ అపార్ట్‌మెంట్ నివాసితుల సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంగళరావునగర్: బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి సూచించారు. సరితకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం స్థానిక జవహర్‌నగర్ బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కావ్యారెడ్డి మాట్లాడుతూ... కార్పొరేట్ ఆస్పత్రులు కూడా స్పందించి బస్తీల్లో తమ సేవలు వినియోగించాలని సూచించారు. వైద్య శిబిరంలో సాధారణ రోగాలతోపాటు బీపీ, షుగర్, మహిళలకు సంబంధించిన రోగాలు, పిల్లల జబ్బులు తదితర రోగులకు వైద్యం అందజేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కిలారి మనోహర్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకెల దీపక్‌రెడ్డి, ఓబీసీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి రూప తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం



పార్టీలో చేరిన నేతలతో విజయారెడ్డి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఛత్రపతి శివాజీనగర్‌కు చెందిన పలువురు యువకులు, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి పార్టీలో చేరిన నేతలకు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతున్న నేపథ్యంలో సంబురాలు జరుపుకొన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడటమే కాకుండా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీలో చేరిన వారికి సూచించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా కిలో రూ. 15, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 14, క్యారెట్ 40, దొండ 18, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 31, మొరంగడ్డ 18, కందగడ్డ 55, సొరకాయ 7.

సమస్యల రాజ్యం..

ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ముందుకు సాగని అభివృద్ధి

అభివృద్ధి అంతంతమాత్రం!

- ఎక్కడి సమస్యలు అక్కడే...
- పరిష్కారంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నా అధికారులు పట్టించుకోని వైనం

నిధులు మంజూరు అవుతున్నా పనులు ముందుకు సాగడం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తుండగా ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోతున్నాయని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల అమల్లో అధికారులు విఫలం చెందారని ప్రజాప్రతినిధులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.



బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్‌లో రోడ్డుపై వరదలా ప్రవహిస్తున్న తాగునీరు

బంజారాహిల్స్: నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరగకపోవడానికి కారణాలు ఏంటని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం నిలదీస్తున్నారు. తరచూ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా, సమీక్షలు జరుపుతున్నా సమస్యలు మాత్రం ఎక్కడికక్కడే కళ్లకు కడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ల వారీగా సమస్యలు తెలుసుకొని కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రెండు వారాల్లోగా ప్రజా సమస్యలు పరిష్కరించాలని తాజాగా ఎమ్మెల్యే దానం సంబంధిత అధికారులను ఆదేశించారు.

- నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఎక్కడెక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయో స్థానికులే అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సారైనా సమస్యలు ఏమేరకు పరిష్కారమవుతాయో చూడాల్సి ఉంది.

హిమాయత్‌నగర్ డివిజన్‌లో...

- హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఎక్కడ చూసినా ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తున్నాయని స్థానిక నేతలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేదని ప్రహరీ కూడా లేవన్నారు. వర్షాకాలం వస్తున్నా చాలా చోట్ల నాలా పనులు పూర్తి కాలేదని ఆరోపించారు. చిన్న వర్షం వచ్చినా సమస్యలు చుట్టుముడుతున్నాయన్నారు. మినర్వా గల్లీలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన సీసీ రోడ్డు పనులు ఆగిపోయాయని ఆరోపించారు. చాలా మందికి ఉచిత నీరు ఇస్తున్నప్పటికీ బిల్లులు వస్తున్నాయని దీని వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని దుయ్యబట్టారు. హైదర్‌గూడలో మురుగు సమస్య ఎక్కువగా ఉందన్నారు.

ఖైరతాబాద్ డివిజన్‌లో...

- పంజగుట్ట నుంచి మోడల్ హౌస్ వరకు మురుగు నీటి పైప్‌లైన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొయ్యాడ అరుణ్‌కుమార్ సూచించారు. కుమ్మరి బస్తీలో డ్రెయినేజీ పైప్‌లైన్ లేదని దుర్గానగర్, వెంకటరమణ కాలనీ, ఆనంద్ నగర్ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదని ఆరోపించారు. రాజ్‌నగర్‌లో వర్షానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని మోటార్లు పెట్టి పంపింగ్ చేయాల్సి ఉండగా వీటి ఊసే లేదన్నారు. గాంధీ తాతా నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ వేయాలని సూచించారు. మురుగు సమస్య వస్తే ఎయిర్‌టెక్ మిషన్లు తీసుకురావడం లేదన్నారు. ఓల్డ్ సీబీబీ క్వార్టర్స్‌లో వరద నీటి సమస్య తీవ్రంగా ఉందని రాజ్‌నగర్ నాలాలో పూడిక తీత పనులు సరిగా చేయడం లేదన్నారు.

జూబ్లీహిల్స్ డివిజన్‌లో...

- బంజారాహిల్స్‌రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని వీధి దీపాలు పని చేయడం లేదని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ దుయ్యబట్టారు. ఫిలింనగర్ 18 బస్తీల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉందని జలమండలి సిబ్బంది సరిగా స్పందించడం లేదన్నారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని తప్పించుకుంటున్నట్లు ఆరోపించారు. ఇందిరానగర్‌లో పూర్తయిన పనుల వద్ద సీసీ రోడ్లు వేయాలన్నారు. కరెంటు స్తంభాలు కూడా మార్చాల్సిన అవసరంద ఉందని గుర్తు చేశారు. ఆరు బస్తీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇచ్చామని గుర్తు చేశారు.

సోమాజిగూడ డివిజన్‌లో...

- డివిజన్‌లో మూడు గ్రౌండ్లు ఉన్నాయని ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సంగీతా యాదవ్ సూచించారు. ఎంఎస్ మక్తాలో నిధులు మంజూరైనా సీసీ రోడ్డు పనులు ఇంకా మొదలు పెట్టలేదన్నారు. వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉందని, ఎంఎస్ మక్తాలో కరెంటు వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని ఆరోపించారు. నాలాల్లో పూడిక తీత సమస్య అలాగే ఉందన్నారు. పింఛన్లు మంజూరైన డబ్బులు రాలేదన్న ఫిర్యాదులు అందుతున్నాయని రెవెన్యూ అధికారులపై సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, జలమండలి అధికారులు స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు.

బంజారాహిల్స్ డివిజన్‌లో...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఉదయ్‌నగర్, సింగాడికుంట బస్తీల్లో వేలాది మంది నివసిస్తుంటారని ఈ ప్రాంతంలో ఒక్క కమ్యూనిటీ హాల్ కూడా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచవటి కాలనీలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. ఉదయ్‌నగర్‌లో ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు దండుకుంటున్నారని నియంత్రించేవారే కరువయ్యారని ఆరోపించారు. తట్టికాన సెక్షన్ నుంచి మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. శ్రీరాంనగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు జరగడం లేదని ఆరోపించారు. పేదలకోసం ఉద్దేశించిన జీవో 58, 59పై ఏ ఒక్కరూ అవగాహన కలిగించడం లేదని తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారని దుయ్యబట్టారు.

వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో...

- ఓల్డ్ వెంకటేశ్వరకాలనీ, నూర్‌నగర్, యూబీఐ కాలనీల్లో సీసీ రోడ్లు మంజూరు చేయాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కోరారు. వర్షాకాలంలో రోడ్లు వేయలేమని.. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఓల్డ్ వెంకటేశ్వరనగర్, సుఖ్‌దేవ్‌నగర్, గాంధీపుర బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లలో నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పంజగుట్ట శ్మశాన వాటిక నుంచి ధోబీఘాట్ బస్తీకి దారి సమస్య ఇంకా తేలడం లేదన్నారు. ప్రతాప్‌నగర్ ఉప్పర బస్తీలో సమస్యలపై జలమండలి అధికారులు స్పందించడం లేదని ఆ ప్రాంతాన్ని ఎల్లారెడ్డిగూడ సెక్షన్ నుంచి తట్టికాన సెక్షన్‌కు కానీ, బంజారాహిల్స్ సెక్షన్‌కు కానీ మార్చాలని కోరారు. పేజ్ కాలేజీ వద్ద నాలా సమస్య అలాగే ఉందన్నారు.

వేడుకగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: అభయాంజనేయ స్వామి కరుణా కటాక్షాలతో అందరికీ సకల శుభాలు చేకూరాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి ఆకాంక్షించారు. హనుమాన్ స్టోన్ కట్టర్స్ కాలనీ శివదత్త షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హనుమాన్ జయంతి పర్వదినానే స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించిన బస్తీ అధ్యక్షుడు, ఆలయ చైర్మన్ వేముల యాదయ్యను ప్రత్యేకంగా అభినందించారు. కమిటీ సభ్యులు వెంకటేశ్, సుబ్బారెడ్డి, పల్లె గురుమూర్తి, యాదవ్, చెన్నయ్య, కృష్ణాచారి, వెంకటేశ్‌గౌడ్, దేవరాజ్‌నాయక్, దశరథ్, భరత్ కుమార్ సిద్ధాంతి, ప్రశాంత్ జోషి తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ గ్రౌండ్ వద్ద గుప్పుమంటున్న గంజాయి

రహమత్‌నగర్: టీ అంజయ్యనగర్‌లోని పీజేఆర్ గ్రౌండ్ వద్ద కొంత మంది యువకులు గంజాయి సేవిస్తూ నానా హంగామా చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంపుగుంపులు కూర్చుంటూ యథేచ్ఛగా గంజాయి సేవిస్తుంటారని బస్తీవాసులు వాపోతున్నారు. మత్తులో తరుచు ఘర్షణలకు దిగుతుంటారని తెలిపారు. ఆకతాయిల గొడవల కారణంగా రాత్రి వేళల్లో బయటికి రావాలంటేనే భయం వేస్తుందని బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని మాల మహానాడు హైదరాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోనేల రమేశ్ ఎస్ఆర్‌నగర్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

కర్ణాటక ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతం తథ్యం

కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్



మాట్లాడుతున్న భవానీశంకర్

రహమత్‌నగర్: కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతం అవుతాయని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి అత్యధిక మెజారిటీని అందించిన కన్నడ ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన డివిజన్ కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్‌సే హాత్ జోడో పాదయాత్రకు దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని అధికారం చేపట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కన్నడ ఓటర్ల తీర్పును తెలంగాణ ప్రజలు ఆదర్శంగా తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. రహమత్‌నగర్ డివిజన్‌లో నివాసముంటున్న కన్నడిగులను కాంగ్రెస్ డివిజన్ తరుఫున త్వరలోనే కలిసి సన్మానించనున్నట్లు భవానీశంకర్ వెల్లడించారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలరె పరిగణలోకి తీసుకుని రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జేపీ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... పేద ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ఇకపై ప్రతి నాయకుడు ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. నగర నాయకుడు వినోద్ కుమార్‌గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆండాళు, నేతలు కేశవులు, రాములు, సుందర్, మలాకీ, రాంబాబు యాదవ్, యాదగిరి, విష్ణు, నయింఖాన్, దేవేందర్, హరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా...



వెంకటగిరిలో పాదయాత్ర చేస్తున్న ఉపేందర్‌రెడ్డి

వెంగళరావునగర్: వెంకటగిరిలో కొన్నేళ్లుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని టీ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. జాగో జూబ్లీహిల్స్ పేరుతో ఆదివారం యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరి, హైలాంకాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా స్థానికంగా ఉన్న మహిళలను, వృద్ధులను, యువతీయువకులను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఏ ప్రాంతానికి వెళ్లానా జాగో జూబ్లీహిల్స్ పాదయాత్రకు మంచి స్పందన లభిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక నేతలు ధర్మేందర్‌రెడ్డి, యాదగిరి, శాసనాల గాలయ్య, రాజు, విరూపాక్ష, భాస్కర్ రెడ్డి, కొండపల్లి రమేష్, వడ్డెర మోహన్, వెంకటేష్, షరీఫ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన పైప్‌లైన్ మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న జలమండలి అధికారులు

ఫిలింనగర్: ఫిలింనగర్ ప్రధాన రహదారిలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం సమీపంలో దెబ్బతిన్న సీవరేజి పైప్‌లైన్ పనులకు ఆదివారంతో మరమ్మతులు పూర్తయ్యాయి. పైప్‌లైన్లతో పాటు దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లకు కూడా మరమ్మతులు నిర్వహించారు. ఇక్కడ 40 ఏళ్ల క్రితం అప్పటి నివాసాలకు అనుగుణంగా రోడ్డు పక్కన వేసిన సీవరేజి పైప్‌లైన్, మ్యాన్‌హోళ్లు మెల్లమెల్లగా దెబ్బతింటూ డ్రెయినేజీ ఓవర్‌ఫ్లోతో పాటు మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతూ స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం వచ్చిందంటే ఇక్కడ మ్యాన్‌హోళ్లు లీకవుతూ మురుగు అంతా రోడ్లను ముంచెత్తుతున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని జలమండలి జీఎం హరిశంకర్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో శని, ఆదివారాల్లో దెబ్బతిన్న పైప్‌లైన్ పనులకు మరమ్మతులు చేపట్టే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. 12 మీటర్ల మేర 300 ఎంఎం డయా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. అలాగే దెబ్బతిన్న రెండు మ్యాన్‌హోళ్లను తిరిగి నిర్మించారు. ప్రస్తుతానికి అయితే సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయిందని... రానున్న వానాకాలంలో ఇబ్బంది తప్పినట్లేనని హరిశంకర్ తెలిపారు. రాబోయే రోజుల్లో పకడ్బందీ పైప్‌లైన్ పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్ రోడ్డు మధ్యలోకి వచ్చిందని రాబోయే రోజుల్లో రోడ్డుపక్కన నిర్మించనున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

తప్పిన పెను ప్రమాదం

బంజారాహిల్స్: బ్రేక్ ఫెయిల్ అయిన ఓ కొబ్బరి బొండాల లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన ఎర్రమంజిల్‌లోని బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. వివరాలివీ... ఆదివారం తెల్లవారుజామున మోర్ సూపర్ మార్కెట్ వైపు నుంచి తాజ్‌దక్కన్ హోటల్ వైపు వెళ్తున్న ఓ కొబ్బరి బొండాల లారీ దారూవాలా వద్ద బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో ఒక్కసారిగా వెనక్కి వచ్చింది. ఈ క్రమంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ వెనక్కి వచ్చే క్రమంలో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. అనంతరం జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానికుల సహకారంతో లారీని పక్కకు తప్పించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బంజారాహిల్స్: కేశ సౌందర్యం అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యం. కోవిడ్ తర్వాత చాలామందిలో జుట్టు రాలడం అనేది అతిపెద్ద సమస్యగా కనపడుతోంది. దీనికి పరిష్కారం చూపేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని సెంచురీ ఆస్పత్రిలో జుట్టుకు సంబంధించిన ఆరోగ్యం కోసం ఉచిత శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ప్రముఖ చర్మవైద్య నిపుణురాలు, కేశ సంరక్షణ విషయంలో ప్రత్యేకశిక్షణ పొందిన డాక్టర్ అపర్ణా కృష్ణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బాధితులకు ఉచితంగా హెయిర్ ఎనాలసిస్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రూ. 3 వేల విలువ చేసే ఈ పరీక్షను శిబిరంలో పూర్తి ఉచితంగా చేస్తామన్నారు. పాలిక్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.

సొంత ప్రయోజనాలకే ప్రజాప్రతినిధుల ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి



బద్దం బాల్‌రెడ్డి నగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ఫిలింనగర్: భారతీయ జనతా పార్టీ చేపట్టిన బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఏడో రోజు అయిన ఆదివారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఫిలింనగర్‌లోని బద్దం బాల్‌రెడ్డినగర్ బస్తీలో పర్యటించారు. స్థానిక బీజేపీ నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీవాసులకు ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని ఎవరిని అడిగినా సమస్యలు ఏకరువు పెడుతున్నారని ఆరోపించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తదితర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సొంత ప్రయోజనాల కోసం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం.. స్వచ్ఛంద పాలనను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఇకనైనా వారి విధానాలను మార్చుకొని ప్రజారంజకంగా పాలన సాగించాలని హితవుపలికారు. రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.


శ్రీఆంజనేయం...



నందినగర్‌లో సువర్చలాహనుమాన్ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా హనుమాన్ జయంతి
- భక్తులతో కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

బంజారాహిల్స్: హనుమజ్జయంతి వేడుకలు ఆలయాల్లో కనుల పండువగా నిర్వహించారు. వైశాఖ దశమి ఆదివారం హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయస్వామికి విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర సహిత సహస్ర నాగవల్లి దళార్చన, ఆంజనేయ మూలమంత్ర హోమం, మన్యుసూక్త హవనం వైభవంగా నిర్వహించారు. ఆలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. స్వామివారిని తమలపాకులు, పూలు, వడలతో అత్యంత సుందరంగా అలంకరించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో సువర్చలా హనుమాన్ కల్యాణాన్ని ఆలయ అర్చకులు శేష శేలాచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం.12 విశ్వసాయి మందిరంలో...



దైవసన్నిధానంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి



పంజగుట్ట కుమ్మరిబస్తీ శివాలయంలో అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఫిలింనగర్ మాగంటి కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో లక్ష తమలపాకుల అర్చన కార్యక్రమంలో బస్తీవాసులు భారీగా పాల్గొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఫిలింనగర్ దైవసన్నిధానంలోని దాసాంజనేయస్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో.. సహాయక చర్యల్లో పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఏడుగురి మృతి

- మరో ఆరుగురికి గాయాలు
- కాకినాడ జిల్లాలో అతివేగంగా ఆటోను ఢీకొన్న బస్సు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోరంగి పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలోని యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 13 మంది మహిళలు తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని ఎపెక్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేసేందుకు ఉదయం ఆటోలో వెళ్లారు. ఉదయం షిఫ్ట్ పని పూర్తిచేసుకుని మధ్యాహ్నం రెండుగంటల సమయంలో తిరిగి అదే ఆటోలో ఇళ్లకు బయలుదేరారు. ఆటో బయలుదేరిన పదినిమిషాల్లోనే.. మరో 20 నిమిషాల్లో ఇళ్లకు చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. ఎపెక్స్ కంపెనీ నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న సుబ్బారాయుని దిబ్బ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న మోజో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొంది. అత్యంత వేగంగా ఆటోను ఢీకొన్న బస్సు పక్కనున్న రైలింగ్‌ను ఢీకొని ఆటోను సుమారు 20 మీటర్ల మేర ఈడ్చుకుపోయింది. బస్సు ఢీకొన్న తాకిడికి ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో మహిళ మృతి చెందింది. యానాం ఫరంపేటకు చెందిన ఆటోడ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావు ప్రమాదాన్ని ముందే గుర్తించి ఆటోలో నుంచి దూకేసి ప్రాణాలు దక్కించుకున్నాడు.

ఇచ్చిపుచ్చుకున్నారు..

అమరావతి కేంద్రంగా చంద్రబాబు క్విడ్ ప్రో కో గుట్టురట్టు


సాక్షి, అమరావతి: కృష్ణా నది కరకట్టపై చంద్రబాబు నివాసం.. అమరావతిలో చంద్రబాబు క్విడ్ ప్రో కోకు ఓ మచ్చు తునకని నిగ్గు తేలింది. అమరావతిలోని సీడ్ క్యాపిటల్‌లో నారాయణ బినామీల పేరిట ఉన్న 75,888 చదరపు గజాల స్థలాలు టీడీపీ భూబాగోతానికి నిదర్శనమని నిర్ధారణ అయ్యింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో టీడీపీ పెద్దల అవినీతి బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే చంద్రబాబు, నారాయణ, లింగమనేని, వారి బంధువులు, బినా మీలు భారీ భూ దోపిడీకి బరితెగించారని ఆధారాలతో సహా వెల్లడైంది. చంద్రబాబు అండ్ గ్యాంగ్ అమరావతిలోని అవినీతి సామ్రాజ్యాన్ని సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బట్టబయలు చేసింది. దాంతో టీడీపీ ప్రభుత్వంలో అమరావతి కేంద్ర బిందువుగా ఏ–1 నారా చంద్రబాబు, ఏ–2 పొంగూరు నారాయణ యథేచ్ఛగా సాగించిన భారీ భూ దోపిడీపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. అమరావతిలో చంద్రబాబు ప్రభుత్వం పాల్పడిన అక్రమాలు, అవినీతిపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించడం సరైనదేనని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో తన అవినీతి బట్టబయలు కాకుండా బాబు కొన్నేళ్లుగా అడ్డుకుంటున్న కుట్రలకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాజధాని ల్యాండ్ పూలింగ్, సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లలో పచ్చ ముఠా అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.

బాబు, నారాయణవి అక్రమ ఆస్తులే

అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తులను అటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి అధికారం కల్పిస్తున్న క్రిమినల్ లా ఆర్డినెన్స్ ప్రకారం అనుమతించాలని సీఐడీ కోరింది. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం –1988 ప్రకారం లింగమనేని కుటుంబం క్విడ్ ప్రో కో కింద చంద్రబాబుకు ఇచ్చిన కరకట్ట నివాసం.. సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో నారాయణ బినామీల పేరిట పొందిన 75,888 చదరపు గజాల స్థలాలను అటాచ్ చేసేందుకుసీఐడీకి అనుమతిస్తూ హోమ్ శాఖ రెండు వేర్వేరు జీవోలు జారీ చేసింది. దాంతో సీఐడీ ఆ విషయాన్ని ఏసీబీ న్యాయస్థానానికి నివేదించి, ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు ఉపక్రమించనుంది. తదుపరి దశల్లో మరిన్ని కఠిన చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేస్తోంది.

భారీ అవినీతికే 'మాస్టర్ ప్లాన్'

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ–1 బాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పునాది వేశారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే అప్పటి టీడీపీ ప్రభుత్వం, సింగపూర్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఒప్పందం చేసుకుంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెన్సీ ఎంపిక కోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టకుండా సింగపూర్ కంపెనీకి నామినేషన్ పద్ధతిలో అడ్డగోలుగా అప్పగించేశారు. దాంతో చంద్రబాబు, నారాయణ కనుసన్నల్లోనే మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ కంపెనీ రూపొందించింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది.



అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌లో అక్రమాలను నిరూపిస్తున్న మ్యాప్

క్విడ్ ప్రో కో కిందే కరకట్ట నివాసం

చంద్రబాబు, లింగమనేని క్విడ్ ప్రో కో కింద పరస్పరం భారీగా అవినీతికి పాల్పడినట్టు సిట్ నిర్ధారించింది. లింగమనేని కుటుంబ సభ్యుల భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా చేసినందుకు బాబుకు భారీగా ముట్టజెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు' ఇవ్వడంతో సరిపెట్ట లేదు. లింగమనేని కృష్ణానది కరకట్ట మీద ఉన్నని వాసాన్ని కూడా బాబుకు ఇవ్వడం గమనార్హం. పక్కా క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసం బాబుకు ఉచితంగా ఇచ్చేశారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

కరకట్ట నివాసంపై బాబు కట్టుకథలు

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు జీతంతోపాటు హౌస్ రెంట్ అలవెన్స్ (ఇంటి అద్దె అలవెన్స్) కూడా తీసుకున్నారు. అంటే ప్రజాధనం నుంచి సీఎంగా ఇంటి అద్దె అలవెన్స్ తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి అద్దెను లింగమనేని కుటుంబానికి చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. అంటే ఇంటి అద్దె అలవెన్స్‌ను ప్రజాధనం నుంచి తీసుకుంటున్న చంద్రబాబు.. తాను నివసిస్తున్న ఇంటికి మాత్రం అద్దె చెల్లించడమే లేదన్నది నిర్ధారణ అయ్యింది. క్విడ్ ప్రో కోలో భాగంగా ఆ నివాసం చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారు కాబట్టే అద్దె చెల్లించలేదు.

దేశ భక్తితో ఇచ్చారట!

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని కూడా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని లింగమనేని రమేశ్ న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. మరి ఉచితంగా ఇచ్చిన ఇంటికి చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎలా తీసుకున్నారన్న ప్రశ్నకు సమాధానమే లేదు. దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేయాలి. ఆ ఇంటిని ప్రభుత్వానికి అప్పగించాలి. ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలి. ఆ నివాసం ప్రభుత్వానికి చెందుతుంది. కానీ 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కోలో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది దీనినిబట్టి కూడా నిర్ధారణ అయ్యింది.

లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాలను 'కొనుగోలు చేసినట్టు' చూపించడం గమనార్హం. అమరావతి ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసింది. ఆ పేరుతో ఆ భూమిని హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ మేరకు అప్పట్లోనే నారా లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై, మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

- అమరావతిలో అత్యంత ప్రధానమైన సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. ఎందుకంటే శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ కూడా సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మించాలని నిర్ణయించారు.
- ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి కాబట్టి, సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా చంద్రబాబు, నారాయణ పన్నాగం పన్నారు. సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించింది. కానీ ఆ ప్లాన్‌ను బహిర్గతం చేయకుండా, ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు.
- ఆ సమయంలోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు.
- రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు.
- కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు.
- అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. వాటిలో 7,620 చదరపు గజాలు, 8,880 చదరపు గజాలు, 6,550 చదరపు గజాలు, 25 వేల చదరపు గజాల స్థలాలు కూడా ఉన్నాయి. అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం.
- భవిష్యత్‌లో స్టార్ హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఇతర భారీ వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలమైన విలువైన స్థలాలను పొందారన్నది స్పష్టమవుతోంది. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ. 1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమచేస్తున్నారు. అంటే ఆ భూములు కొను గోలు చేసి సీఆర్డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్‌కుమార్ కొత్తప్ప పూర్తిగా నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

వారి భూముల వద్దే ఇన్నర్ రింగ్ రోడ్డు

- అమరావతిలో 75 మీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించడంలో చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. వారి భూములను ఆనుకునే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. తమ భూముల నుంచి కాకుండా సామాన్య రైతుల భూముల నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం గమనార్హం. అందుకోసం ముందుగానే ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వకుండా సీఆర్డీయే నిలుపుదల చేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. అప్పటికే నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకే ఓ కన్సల్టెన్సీని నియమించి కనికట్టు చేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆస్పత్రి వద్ద ఉన్న తాడిగడప-ఎన్కేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్‌టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల మీదుగా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు- నిడమనూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు.

నగర వార్తలు

సందడిగా కోదాడవాసుల ఆత్మీయ సమ్మేళనం


సభను ప్రారంభిస్తున్న అతిథులు

నాంపల్లి: నల్లగొండ జిల్లా కోదాడ ప్రాంతవాసుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో సందడిగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు కోదాడ ఆత్మీయ ప్రవాస సమితిని ఏర్పాటు చేసుకుని వారంతా ఒకే వేదికపైకి వచ్చి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీరామ కవచం వేంకటేశ్వర్లు, మంత్రిప్రగడ భరతరావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు ప్రసంగాలు మంత్రముగ్ధులను చేశాయి. డాక్టర్ జాస్తి సుబ్బారావు రోగులకు వైద్యం చేయడానికి వెళ్లేటప్పుడు రేడియో వింటూ, తన సేవను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అహర్నిశలు శ్రమించిన కాంపౌండర్‌కు, రిక్షా పుల్లర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు తన ప్రసంగంతో సభా ప్రాంగణంలో ఉన్న ప్రజలను భావోద్వేగానికి గురి చేశారు. కేకేఆర్ కళాశాల, డాక్టర్ సుబ్బారావు ఆస్పత్రి తన ఆలోచనలను తెరిచి ప్రపంచానికి ఏదైనా చేయాలనే స్ఫూర్తిని కలిగించాయన్నారు. కోదాడలో పుట్టి పెరిగి ప్రభుత్వ హోదాల్లో ఉంటూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో కోట తిరుపతయ్య, ఎంవీ రెడ్డి, కొల్లు సురేష్ కుమార్, ధరావతు జానకి, చంద్రశేఖర్‌రావు, నంద్యాల కోటిరెడ్డి, మంత్రి ప్రగడ హనుమంతరావు, భర్మావతు నాగయ్య, పల్లె నాగేశ్వరరావు, ఆచార్య భట్టు రమేష్ పాల్గొని ప్రసంగించారు. కోదాడకు తాము చేస్తున్న అభివృద్ధిని వివరించారు.

ఐసీఎస్ఈ టెన్త్‌లో ప్రతిభ

సాక్షి, సిటీబ్యూరో: ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాలు వెల్లడయ్యాయి. కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ ఆఫ్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ బోర్డు ఆదివారం పదో తరగతి ఫలితాలను ప్రకటించింది. హైదరాబాద్ నగరంలోని పలు ఐసీఎస్ఈ స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారు. బంజారాహిల్స్‌లోని కల్పా స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అరిత్ రెడ్డి 98 శాతం, మానవ్ మెది గురు హరింద్ర అద్దంకి 97 శాతం, సుదా ప్రజ్ఞ అద్దంకి 96 శాతం మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

సదరం 'స్లాట్స్' తిప్పలు!

- 15 రోజుల్లో ఒక పర్యాయమే...
- నగరంలో ఐదు సదరం శిబిరాలు
- వారానికి ఒకసారి మాత్రమే వైకల్య నిర్ధారణ
- తిరస్కరణకు గురైతే అంతే...



దివ్యాంగులకు సదరం 'స్లాట్స్' తిప్పలు తప్పడం లేదు. వైకల్యం నిర్ధారణ పరీక్షలు నిర్వహించే సదరం శిబిరాలకు స్లాట్స్ అందని ద్రాక్షగా మారాయి. 15 రోజులకు ఒకసారి విడుదల చేస్తున్న స్లాట్స్ ఏ మూలకూ సరిపోని పరిస్థితి నెలకొంది.

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఐదు సదరం శిబిరాల కేంద్రాలు ఉన్నాయి. వివిధ కేటగిరీ వైకల్యాల నిర్ధారణ శిబిరాలు వారానికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తుండటంతో దివ్యాంగులకు నిరీక్షణ తప్పడం లేదు. వాస్తవంగా శారీరక వైకల్యం, మానసిక రుగ్మత, వినికిడి లోపం, కంటి రుగ్మతల లాంటి నాలుగు వైకల్యం నిర్ధారణ పరీక్షలు ప్రత్యేక శిబిరాల ద్వారా నిర్వహిస్తోంది. ఒక్కో వైకల్యానికి ఒక్కో కేంద్రాన్ని ప్రత్యేకంగా కేటాయించి వారంవారం శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. వికలత్వ నిర్ధారణ కోసం నాలుగు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి శాశ్వత, తాత్కాలిక ప్రాతిపదికన సర్టిఫికెట్ జారీ చేస్తోంది. మానసిక వైక్యలం పరీక్షలకు రెండు కేంద్రాలు మాత్రమే నిర్వహిస్తోంది. నిలోఫర్ ఆస్పత్రిలో 18 సంవత్సరాల లోపు, ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో 18 సంవత్సరాల పై బడిన వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు.

మీ సేవా కేంద్రాల ద్వారా స్లాట్...

కొత్తగా వైకల్య నిర్ధారణ పరీక్షలు కోసం మీ సేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సదరం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఆధార్ నెంబర్, వివరాలు నమోదుతో దరఖాస్తు చేసుకుంటే తేదీ, సమయం, కేంద్రంతో కూడిన స్లాట్ లభిస్తోంది. స్లాట్ ప్రకారం దరఖాస్తుదారులైన దివ్యాంగులు మీ సేవ కేంద్రం రసీదు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, మెడికల్ రిపోర్ట్స్‌తో సదరం కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుంది. స్లాట్ ప్రకారం సదరం క్యాంపునకు హాజరు కాకపోతే రెండు రోజుల తర్వాత తిరిగి మీ సేవా ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సదరం కేంద్రంలో సంబంధిత వైద్య బందం పరీక్షలు నిర్వహించి వైకల్యాన్ని నమోదు చేస్తోంది.

వైకల్యంపైనే...

మెడికల్ బోర్డు ఆన్‌లైన్ వివరాలను పరిశీలించి వైకల్యాన్ని నిర్ధారించిన తర్వాతనే తాత్కాలిక, శాశ్వత ధ్రువీకరణ పత్రాల జారీపై నిర్ణయం తీసుకుంటారు. తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలను ఒకటి, రెండు, మూడు, నాలుగు సంవత్సరాల వరకు వర్తించేలా ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. తాత్కాలిక సదరం సర్టిఫికెట్ రెన్యువల్ కోసం కూడా తిరిగి స్లాట్ బుకింగ్ చేసుకొని వైకల్య నిర్ధారణ పరీక్షలు హాజరు కావాల్సి ఉంటుంది.

రిజెక్ట్ అయితే అంతేనా?

క్యాంపులో సదరం సర్టిఫికెట్ జారీ చేయటంలో అప్లికేషన్ రిజెక్ట్ అయితే మళ్లీ స్లాట్ సమస్యగా తయారైంది. మానసిక, ఇతర ఇబ్బందులున్న చిన్న పిల్లలు, సర్టిఫికెట్ టెస్టులు టైంలో సహకరించకపోవడంతో డాక్టర్ల టీమ్ రిజెక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

సదరం శిబిరాలు ఇలా...

ఆస్పత్రి	వైకల్యం కేటగిరి	వారం
ఈఎన్‌టీ ఆస్పత్రి	వినికిడి లోపం	మంగళవారం
నిలోఫర్ ఆస్పత్రి	మానసిక వైకల్యం	గురువారం
మలకపేట ఏరియా ఆస్పత్రి	శారీరక వైకల్యం	శుక్రవారం
మానసిక వైద్యశాల ఎర్రగడ్డ	మానసిక వైకల్యం	గురువారం
సరోజినీదేవి కంటి ఆస్పత్రి	కంటి వైకల్యం	బుధవారం

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి


అభివాదం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చి కేవలం జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీల కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించిందన్నారు. తమను విస్మరించడం బాధాకరమన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.పరశురాం, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కరుణాకర్‌రావు మాట్లాడుతూ... జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్లకు ఎలా యూజీసీతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకొచ్చి తమను కూడా పర్మనెంట్ చేయాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక చట్టం ద్వారానే పర్మనెంట్ చేశారని గుర్తుచేశారు. మహిళా విశ్వవిద్యాలయంతో సహా మొత్తం 12 విశ్వవిద్యాలయాల్లో 2500 ఖాళీలు ఉన్నాయని, కాంట్రాక్ట్ అధ్యాపకులు 2 వేల వరకు ఉంటారని తమను రెగ్యులరైజ్ చేయడంవల్ల ప్రభుత్వానికి పెద్దగా ఫైనాన్స్ సమస్య కూడా రాదన్నారు. కొంతమంది వైస్ చాన్సిలర్‌లు తమను పర్మనెంట్ కాకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో తాము ముందంజలో ఉన్నామని కేసీఆర్ ఇచ్చిన ప్రతి పిలుపులో భాగస్వామ్యం అయ్యామని పలు సందర్భాల్లో కేసీఆర్ తప్పకుండా పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు డాక్టర్ భూమయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ దత్తు, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ వినితాపాండే, డాక్టర్ ప్రియాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పొత్తులపై జాతీయ సమావేశాల్లో నిర్ణయిస్తాం


సైదాబాద్‌లో జరిగిన పాదయాత్రలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సైదాబాద్: దేశంలో లౌకిక వ్యవస్థను ధ్వంసం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీని గద్దె దించాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. మతోన్మాదాన్ని రెచ్చకొడుతూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రధాని, బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను రాయితీగా ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎందుకు రాయితీలు ఇవ్వటం లేదని ఆయన ప్రశ్నించారు. ఆదివారం సైదాబాద్‌లో బీజేపీ హటావో–దేశ్ కో బచావో పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీపీఐ నాయకులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందన్నారు. కర్ణాటక ప్రజలు బీజేపీని దక్షిణ భారతదేశంలోకి రాకుండా గేట్లు బిగించారని అన్నారు. ఏపీలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బీజేపీకి వ్యతిరేకంగా లైన్ తీసుకోకపోతే తప్పు జరుగుతుందన్నారు. కర్ణాటక ఫలితాలతో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే ఉంటుందన్నారు. తెలంగాణలో పొత్తుల విషయమై త్వరలో జరిగే పార్టీ జాతీయ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నారాయణ వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ స్టేట్ సెక్రటరీయట్ మెంబర్ ఈటీ నర్సింహా, నేతలు ఎ.రవీంద్రాచారి, హైదరాబాద్ కార్యదర్శి ఛాయాదేవి, బి.వెంకటేశ్వర్లు, ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ పాల్గొన్నారు.

18న ఇందిరాపార్క్ వద్ద జర్నలిస్టుల మహాధర్నా


మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జర్నలిస్టు సంఘం నేతలు

టీయూడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య

పంజగుట్ట: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన కోసం ఈ నెల 18వ తేదీన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఫెడరేషన్ ఉపాధ్యక్షులు గుడిగ రఘు, విజయానంద రావు, మాణిక్ ప్రభు హెచ్‌యూజే కార్యదర్శి బి.జగదీశ్వర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య మాట్లాడుతూ... గడచిన మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. గతంలో సుప్రీం కోర్టులో కేసు ఉందని తాత్కారం చేశారని, సుప్రీం కోర్టు కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చు అని తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం ముందడుగు వేయడంలేదని ఆరోపించారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం జర్నలిస్టులకు అనుకూలంగానే నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని వారు స్పష్టం చేశారు. ఎంతో మంది జర్నలిస్టులు ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కరోనా మహమ్మారి విశ్వరూపం దాల్చిన అనంతరం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో సుమారు 400 మంది వరకు జర్నలిస్టులు మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా చిత్తశుద్ధితో స్పందించి జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ మేడ్చెల్ జిల్లా కార్యదర్శి కళ్యాణ్ చక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వి.ఎస్.పద్మరాజు, హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు జి.రేణయ్య పాల్గొన్నారు.

సోనమ్ మిత్తల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

నాంపల్లి: సోనమ్ మిత్తల్ ఎక్సలెన్స్ అవార్డులు–2023 ప్రదానోత్సవ సభ ఆదివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కె.ఎల్.ఎన్.ప్రసాద్ ఆడిటోరియంలో జరిగింది. సోనమ్ మిత్తల్ ఉమెన్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ అవార్డులను ఎనిమిది మందికి ప్రదానం చేశారు. క్రీడాకారిణి నిషిత అగర్వాల్, కూచిపూడి నాట్యకారిణి శ్రీలత కసినేని, నర్స్ నాతి జ్యోతి, అశ్వాపురం మండలం మొండికుంటలో సెలూన్ నిర్వహిస్తున్న బిందుప్రియ, మేకప్ ఆర్టిస్ట్ ఇందిర అగర్వాల్, కానిస్టేబుల్ గోరెంక సుమలత, సినీ నటి శ్రీలలిత, యాదాద్రి భువనగిరి జిల్లా మైసిరెడ్డిపల్లి సర్పంచ్ నోముల రమాదేవి రామిరెడ్డి అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు. మాజీ ఐపీఎస్ అధికారిణి అరుణ ఎం బహుగుణ, ఎఫ్ఎల్‌వో అధ్యక్షులు రీతు షా చేతుల మీదుగా వీరు అవార్డులను స్వీకరించారు. చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ శివకుమార్ మిత్తల్, మేనేజింగ్ ట్రస్టీలు ఊర్మిళామిత్తల్, అనిరుద్ మిత్తల్ పాల్గొన్నారు.


అవార్డులను ప్రదానం చేస్తున్న అరుణ ఎం బహుగుణ, రీతా షా

సన్నిధి

మంచిమాట

చీకటీ... వెలుగూ...

వెలుగుకు చీకటికి తేడా ఉంది. ఆ తేడా తెలియక పోతే అది గుడ్డితనం అవుతుంది. వెలుగు వెలుగే; చీకటి చీకటే. వెలుగును చూడలేక పోవడం దోషం; చీకటిని వెలుగు అని అనుకోవడం నేరం. వెలుగు చీకట్లు ఉండేది పక్కపక్కనే; మనం ఉండా ల్సింది వెలుగు పక్కనే. వెలుగుకు మాలిమి అవ్వాలి మనం; చీకటికి లొంగకుండా ఎదగాలి మనం. వెలుగులో సాగడమే జీవనం; చీకటిమయం కాకూడదు జీవితం.



వెలుగుకు చీకటికి తేడా తెలియక పోవడం అజ్ఞానం. అంతేకాదు, అజ్ఞానం వెలుగును చీకటి అని, చీకటిని వెలుగు అని అనుకునేట్లు కాదు భ్రమపడేట్లు చేస్తుంది. అసలు అజ్ఞానం అన్నదే చీకటి. అందుకే అజ్ఞానాంధ కారం అన్న మాట ఉంది. వెలుగు అన్నది జ్ఞానం. అదే మనకు కావాలి. వెలుగులా జ్ఞానం కావాలి; జ్ఞానం వెలుగై మనకు కావాలి. చీకటి నుంచి వెలుగులోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది కాబట్టే చీకటి నుంచి వెలుగులోకి తీసుకు వెళ్లమని ప్రార్థనగా బృహదారణ్యకోపనిషత్‌లో 'తమసోమా జ్యోతిర్గమయ' అని అనడం జరిగింది.

చీకటి నుంచి మనం వీలు అయినంత త్వరగా బయటపడాలి; అందుకు మనం మనలోంచి పైకి లేవాలి. రోజు అన్నాక పగలే కాదు రాత్రీ వస్తుంది. ఆ రాత్రిని మనం సేద తీరడానికి అంటే నిద్రపోవడానికి మాత్రమే తీసుకోవాలి. రాత్రి చీకటిలో నిద్రపోతూనే ఉండడమో, నిద్రపోతూ చీకట్లోనే ఉండిపోవడం మనకు ఎంత మాత్రమూ తగదు; అది సరికాదు.

పిచ్చిరాతలకు, కవిత్వానికి ఉన్న తేడాలాగా చచ్చు పడిపోయిన జీవనానికి, ప్రయోజనకరమైన జీవనానికి తేడా ఉంది, ఉంటుంది అన్న నిజాన్ని మనసులోనూ, మస్తిష్కంలోనూ నిలుపుకుని మనం మనుగడ చెయ్యాల్సి ఉంటుంది. చీకటి నుంచి వెలుగులోకి చేరుకోవాలి మనం; అజ్ఞానం నుంచి కదిలి, లేచి జ్ఞానంలోకి వెళ్లాలి మనం. మన అజ్ఞానమే లేదా మనకు ఉండాల్సిన జ్ఞానం లేకపోవడమే మన కష్టాలకు, నష్టాలకు, దుఃఖాలకు కారణం అవుతూ ఉంటుంది. గట్టిగా చెప్పాలంటే ప్రపంచంలోని గందరగోళానికి కారణం అజ్ఞానమే. మనకు విశ్రాంతిని ఇవ్వడం కోసం రాత్రి చీకటిని తీసుకు వచ్చిన ప్రకృతి మన జీవనం సాగడం కోసం పగలును, వెలుగును తీసుకువస్తోంది. వెలుగు ఉంటేనే మనకు వస్తువు తెలిసి వస్తుంది; జ్ఞానం ఉంటేనే మనుగడ కలిసి వస్తుంది.

చీకటిలాంటి అజ్ఞానం అసత్ అవుతుంది. మేలు లేదా మంచి కాకపోవడమే అసత్. ఆ ఆసత్ మనకు అక్కర్లేంది. ఆ అసత్ నుంచి సత్‌లోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది కాబట్టే అసత్ నుంచి సత్‌లోకి తీసుకు వెళ్లమని ప్రార్థనగా 'అసతోమా సద్గమయ' అనీ అనడం జరిగింది.

అంధకారంలోనూ, అసత్‌లోనూ ఉండడం మృత్యువు లేదా మరణంలో ఉండడమే అవుతుంది. మనం మృత్యువులోంచి జీవంలోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది కాబట్టే మృత్యువు నుంచి అమృతంలోకి అంటే జీవంలోకి తీసుకు వెళ్లమని ప్రార్థనగా 'మృత్యోర్మా అమృతం గమయ' అనీ అనడం జరిగింది.

మనం వెలుగులో సాగాలి; మనం సత్‌లో సాగాలి; మనం జీవంలో సాగాలి. ఈ జ్ఞానంతో మనం జీవించాలి.

- రోచిష్మాన్

> రోజులో చీకటి ఉన్నట్టే మనిషి అన్నాక, మనుగడ అన్నాక ఎవరికైనా ఒక దశలో అజ్ఞానం ఉంటుంది. మనిషి అన్నాక అతడికి అజ్ఞానదశ ఉంటుంది. అయితే మనిషి తన అజ్ఞానదశను ప్రయత్నించి అధిగమించగలగాలి; అధిగమించి తీరాలి. అజ్ఞానం నుంచి ఒక మనిషి తనను ఎలాగైనా విడిపించుకోవాలి. అజ్ఞానం నుంచి విడివడని మనిషి అర్ధరాత్రిలో ఆవగింజలా అయిపోతాడు.




అమృత బిందువులు

- విజయం ఒక ప్రయాణం మాత్రమే... గమ్యం కాదు
జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా
సఫలం కావడానికి అవకాశం ఉంటుంది
సమయం కోసం సహనంతో వేచి ఉండాలి అంతే.
- అవకాశం ఆకాశం నుండి రాదు...
అరచేతి గీతల్లోనూ ఉండదు
అలసిపోని గుండెల్లో ఉంటుంది...
అంతులేని పట్టుదలలో ఉంటుంది.
- మనిషికి ప్రశాంతత ఇచ్చేది
ప్రకృతే కావొచ్చు
కానీ మనసుకు ప్రశాంతత
ఇచ్చేది మాత్రం
ఇష్టమైన వారి నుండి వచ్చే
ఆత్మీయమైన
పలకరింపు.

బౌద్ధవాణి

ఉభయ శుద్ధి



బుద్ధుని మార్గాన్ని విశుద్ధి మార్గం అంటారు. బాహ్యశుద్ధి, ఆంతరంగిక శుద్ధి- ఈ రెండూ ఉన్నదే విశుద్ధి. మనసులో ఎన్నో కల్మషాల్ని పెట్టుకుని పైకి శుద్ధిగా కనిపిస్తారు కొందరు. ఇలాంటి వారు కపట కల్మషాలు కడుపులో ఉంచుకుంటారు కూడా. బుద్ధుని కాలంలో ఇలాంటి దొంగ సాధువులు, సన్యాసులు అనేకమంది ఉండేవారు.

అలాగే.. కఠోర తాపసులూ ఉండేవారు. వీరు ఆంతరంగిక శుద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చే వారు. స్నానం చేయక పోవడం, వంటికి మట్టి, బురదలు పూసుకోవడం, మాసిన వస్త్రాలు ధరించడం, శ్మశానంలో నిద్రించడం లాంటి పనులు చేసే వారు. బాహ్య శుభ్రతని అస్సలు పట్టించుకునే వారే కాదు.

బుద్ధుడు ఈ రెండు రకాల తపస్సుల్నీ అంగీకరించ లేదు. శారీరక శుద్ధి కంటే మనో శుద్ధికే అధిక ప్రాధాన్య తనిచ్చినప్పటికీ, బాహ్య శుభ్రతకీ తగినంత ప్రాధాన్యతనిచ్చాడు.

ఒకనాడు నిగంఠనాథ పుత్రుడైన సచ్చకుడు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. అప్పుడు బుద్ధుడు వైశాలి నగర సమీపంలోని మహావనంలో కూటగారశాలలో ఉంటున్నాడు. సచ్చకుడు వచ్చి-

''గౌతమా! కొందరు శ్రమణులు, బ్రాహ్మణులు శారీరక నిగ్రహానికే ప్రాధాన్యతనిస్తున్నారు. కానీ చిత్త నిగ్రహానికి ప్రాధాన్యతనివ్వడం లేదు. ఈ రెండింటిలో ఏది సరైనది?''అని అడిగాడు.

దానికి బుద్ధుడు-

''సచ్చకా! ఒక ఎండిన కట్టెపుల్ల ఉంది. అది ఎలాంటి పచ్చి లేకుండా పూర్తిగా ఎండిపోయింది. ఆ కట్టెను ఒకడు నీటిలో తడిపాడు. నానబెట్టాడు. తెచ్చి పొయ్యి కింద పెట్టాడు. ఆ ఎండు కట్టె మండుతుందా?''

''గౌతమా! మండదు''

''అలాగే సచ్చకా! మరొకని దగ్గర ఒక పచ్చి కట్టె ఉంది. దీనినీ వాడు నీటిలో తడిపాడు. నానబెట్టాడు. తెచ్చి పొయ్యిలో పెట్టాడు. అది మండుతుందా? దాని వల్ల ఫలితం ఉంటుందా?''

''గౌతమా! అస్సలు ఉండదు.''

''మరి ఇంకొకని దగ్గర పచ్చి కట్టె ఉంది. కాని అతడు దానిని నీటిలో ముంచలేదు. తడప లేదు. తెచ్చి పొయ్యిలో ఉంచాడు. అదైనా మండుతుందా?''

సచ్చకుడు నవ్వి ''గౌతమా! అది పచ్చి కట్టె. ఎలా మండుతుంది'' అన్నాడు.

''సరే సచ్చకా, వేరొకడు ఉన్నాడు. అతని దగ్గర బాగా ఎండిన కట్టె ఉంది. దాన్ని తడపకుండా, నీటి చెమ్మ తగలకుండా తెచ్చి పొయ్యిలో పెట్టాడు...'' అని బుద్ధుడు చెప్తూనే ఉన్నాడు. సచ్చకుడు మధ్యలోనే కల్పించుకుని ''ఇది తప్పక మండుతుంది. ఆరకుండా రగిలి ఉపయోగపడుతుంది. దానివల్ల ఫలితం వస్తుంది'' అన్నాడు.

బుద్ధుని పెదవుల మీద కనిపించీ కనిపించని చిరునవ్వు ఉదయించింది.

''సచ్చకా! అలాగే మనిషికి బాహ్య శుద్ధి, ఆంతరంగిక శుద్ధి రెండూ కావాలి. బాహ్యంలో అకుశల కర్మలకు, కామాలకి దూరంగా ఉన్నా మనసుల్లో కామ కోరికల్ని, కామ స్నేహాన్ని, కామ మోహాన్ని, కామ పిపాసను, కామ జ్వరాన్ని వదలని శ్రమణులు యోగ్యులు కారు. వారు నీటిలో తడిసిన, నానబెట్టిన ఎండు కట్టె లాంటివారే! ఉభయ శుద్ధులూ ఉన్నవారే ఉత్తమ యోగులు'' అన్నాడు.

సచ్చకునికి సత్యం బోధపడింది. ''భగవాన్! మీరు చెప్పిందే సత్యం'' అంటూ ప్రణమిల్లాడు.

- డా. బొర్రా గోవర్ధన్

గురువాణి

బంగారం లోంచి సువాసనలు..!



కొంత మంది యోగ్యత కలిగినవారు ఉన్నత పదవులలోకి వెళ్ళిన కారణం చేత ఆ పదవి శోభిస్తుంది. వాళ్ళకీ కీర్తి వస్తుంది. పదవి, వ్యక్తి గుణాలు రెండూ సమున్నతంగా ఉంటే... బంగారానికి తావి అబ్బినట్లుంటుంది. ఎలా అంటే...

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అధ్యక్షుడిగా చేసిన హెర్బర్ట్ హూవర్ బాగా పేదరికం అనుభవించాడు. తల్లీతండ్రీ లేరు. మేనమామ చదివిస్తున్నాడు. 18వ ఏట స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉండగా..కళాశాల ఫీజు కట్టేంత డబ్బుసమకూరక చిక్కుల్లోపడ్డాడు. దీనినుంచి బయటపడడానికి ... స్నేహితుడితో కలిసి ఒక ఆలోచన చేసాడు. అప్పట్లో పోలండ్‌లో పియానో విద్వాంసుడిగా ఖ్యాతి వహించిన ఈగ్నాసీ యాన్ పద్రెస్కీ కచేరీ పెట్టి వచ్చిన వసూళ్ళలో ఖర్చులు పోగా మిగిలిన డబ్బును ఫీజుల కింద చెల్లించాలనుకున్నారు. ఆయనను సంప్రదించి రెండువేల డాలర్లకు ఒప్పందం చేసుకున్నారు. కానీ వసూళ్లు కేవలం 1600 డాలర్లే వచ్చాయి. పైగా కచేరీ నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించాలి. ఏం చేయాలో తోచక నేరుగా పద్రెస్కీనే కలిసి వచ్చిన మొత్తం డబ్బు ఆయన చేతిలో పెట్టి మిగిలిన దానికి చెక్ ఇచ్చారు... మీరు కాలేజీ ఫీజులకోసం ఇది చేస్తున్నామని ముందుగా ఎందుకు చెప్పలేదంటూ పద్రెస్కీ ఆ చెక్ చింపేసి డబ్బు తిరిగి వారి చేతులో పెట్టి... మీ ఫీజు, కచేరీ నిర్వహణ ఖర్చులు పోగా మిగిలితే ఇవ్వండి, లేక పోయినా ఫరవాలేదన్నారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

పద్రెస్కీ తదనంతర కాలంలో పోలండ్‌కు ప్రధానమంత్రి అయ్యారు. అది మొదటి ప్రపంచ యుద్ధకాలం. పోలండ్‌లో కరువు పరిస్థితి. తినడానికి కొన్ని లక్షల మందికి అన్నంలేని స్థితి. ప్రధానమంత్రిగా ఆయన అమెరికాలోఉన్న అంతర్జాతీయ ఆహార, సహాయ సంస్థకు ఒక విజ్ఞాపన పంపారు. ఆ సంస్థకు అధ్యక్షుడు హెర్బర్ట్ హోవర్. ఆ ఉత్తరాన్ని పరిశీలించి టన్నులకొద్దీ బట్టలు, ప్రతిరోజూ 2 లక్షలమందికి భోజనానికి సరిపడా సామాగ్రి పంపారు. ఈ ఉపకారానికి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు చెప్పుకోవడానికి పద్రెస్కీ అమెరికా వెళ్ళి హోవర్‌ను కలిసాడు. ''మీరు కాదు కృతజ్ఞత లు.. నేను చెప్పాలి'' అన్నాడు హోవర్. అదేమిటి అని పద్రెస్కీ ఆశ్చర్య పోతుండగా... గతంలో ఫీజుకట్టలేక మీ కచేరీ పెట్టి మిమ్మల్ని ఇద్దరు విద్యార్థులు కలిసారు, గుర్తుందా... అని అడిగాడు హోవర్. ఎప్పుడో జరిగిన వృత్తాంతం. అప్పటికి కొన్ని దశాబ్దాలు గడిచాయి. మీరు తీసుకోకుండా ఇచ్చిన డబ్బుతో కాలేజి ఫీజు చెల్లించి చదువు పూర్తి చేసుకోవడానికి మీరు సహకరించింది నాకే. మీరు చేసిన సాయంతోనే నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను... అన్నాడు.

ఆ తరువాత కాలంలో...అంటే అమెరికా అధ్యక్షపదవి స్వీకరించడానికి ముందు కూడా హోవర్ పోలండ్ వెళ్లాడు. మళ్ళీ అక్కడ పేద పిల్లల స్థితిగతులను చూసి చలించిపోయి భారీ ఎత్తున సహాయం పంపే ఏర్పాట్లు చేసాడు... మంచి గుణగణాలు.. వారికే కాదు, వారి పదవులకు కూడా గౌరవం తెచ్చిపెడతాయి.

సినిమా

రామ్-పూరి డబుల్ ఇస్మార్ట్




● రామ్



● పూరి జగన్నాథ్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన 'ఇస్మార్ట్ శంకర్' (2019) సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబినేషన్ లోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం రానుంది. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. నేడు (మే 15) రామ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'డబుల్ ఇస్మార్ట్'ని ప్రకటించి, ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 8న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ''అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, హై బడ్జెట్‌తో 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తెరకెక్కనుంది. ఈసారి రెట్టింపు మాస్, రెట్టింపు వినోదాన్ని ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

డాన్ 3 ఉంది



● షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ కెరీర్‌లో చెప్పుకోదగ్గ చిత్రాల్లో 'డాన్' (2006) ఒకటి. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ బంపర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలోనే షారుక్ హీరోగా వచ్చిన 'డాన్ 2' (2011) కూడా ఘనవిజయం సాధించింది. ఇప్పుడు పుష్కర కాలం తర్వాత 'డాన్ 3'కి సన్నాహాలు జరుగుతున్నాయి. గడచిన పన్నెండేళ్లల్లో 'డాన్ 3' గురించి అడపా దడపా చర్చలు వస్తూనే ఉన్నాయి. తాజాగా 'డాన్ 3' గురించి చిత్రనిర్మాత రితేష్ అద్వానీ అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ఫర్హాన్ అక్తర్ కథ సిద్ధం చేస్తున్నారని, స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యాక షూటింగ్ ప్లాన్ చెబుతామనీ పేర్కొన్నారు రితేష్.

తురుమ్ ఖాన్‌ల కథ



● అవినాష్, శ్రీరామ్, దేవరాజ్

నిమ్మల శ్రీరామ్, దేవరాజ్ పాలమూర్, అవినాష్ చౌదరి హీరోలుగా, పులి సీత, విజయ, శ్రీయాంక హీరోయిన్లుగా నటించిన పల్లెటూరి రివెంజ్ కామెడీ డ్రామా ఫిల్మ్ 'తురుమ్ ఖాన్‌లు'. శివకల్యాణ్ దర్శకత్వంలో ఆసిఫ్ జానీ నిర్మించిన చిత్రం ఇది. త్వరలోనే ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు శివకల్యాణ్ మాట్లాడుతూ- ''ఈ ఆధునిక యుగంలో బ్రహ్మ, విష్ణు, ఈశ్వర్ అనే ముగ్గురు యువకులు ఒకే ఊరిలో పుట్టి, పెరిగి సరదాగా ఒకరినొకరు ఎలా ఆటపట్టించుకుంటారు? ఒకర్ని ఒకరు ఎలా ఏడిపించుకుంటారు? అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు. ''తురుమ్ ఖాన్‌లు' చిత్రం చిన్న సినిమాగా విడుదలైనా రిలీజ్ తర్వాత పెద్ద సినిమా అవుతుంది'' అన్నారు నిర్మాత ఆసిఫ్. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, అఖిలేష్ గోగు, సహనిర్మాత: కె. కల్యాణ్ రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దేవరాజ్ పాలమూర్.

ప్రేక్షకులకు ఇది స్పెషల్ ఫిల్మ్ - నాని



● నందినీ రెడ్డి, మాళవిక, సంతోష్, దుల్కర్, నాని, గౌతమి, ప్రియాంక, స్వప్నా దత్

''అన్నీ మంచి శకునములే..' ట్రైలర్, టీజర్‌లో పాజిటివ్ ఎనర్జీ కనిపించింది. ఈ సినిమాకు 'అన్నీ మంచి శకునములే..'. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్ముతున్నా'' అని అన్నారు నాని. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్రవిందా మూవీస్, స్వప్నా సినిమాస్‌పై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు నాని, దుల్కర్ సల్మాన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో నాని ఇంకా మాట్లాడుతూ- ''మంచి ఈజ్, బ్రహ్మాండమైన కామెడీ టైమింగ్ ఉన్న యాక్టర్ సంతోష్. అతన్ని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లుగా అనిపిస్తోంది. నందినీకి మరో నాని దొరికాడనిపిస్తోంది. 'అన్నీ మంచి శకునములే'కి విజువల్స్, సాంగ్స్, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ బాగా కుదిరినట్లు అనిపిస్తోంది. ప్రేక్షకులందరికీ గుర్తుండిపోయే ఓ స్పెషల్ చిత్రంగా నిలుస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు నాని. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ- ''వైజయంతీ మూవీస్ నాకు ఓ ఫ్యామిలీలాంటిది. రాజేంద్రప్రసాద్‌గారికి నేను అభిమానిని. 'మహానటి'కి ఆయనతో కలిసి వర్క్ చేశాను. 'సీతారామం' తర్వాత నాకు తొలి ఫోన్‌కాల్ నందినీ రెడ్డిగారి నుంచి వచ్చింది. 'అన్నీ మంచి శకునములే' సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''నా లైఫ్‌లో నేను చేసిన పెద్ద సినిమా ఇది. వీకే నరేశ్, రాజేంద్రప్రసాద్, గౌతమీ, వాసుకి, 'షావుకారు' జానకి, అంజు.. ఇలా వీరందరూ కలిసి నేను రాసుకున్న కథను పది రెట్లు పెంచారు. ఈ సినిమాకు లైఫ్ లైన్ సంగీత దర్శకులు మిక్కీ జే మేయర్. ఫ్యామిలీ ప్రొడ్యూసర్స్‌తో కలిసి వర్క్ చేసిన ఫీలింగ్ ప్రియాంక, స్వప్నాల వల్ల కలిగింది'' అన్నారు నందినీ రెడ్డి. ''సమ్మర్‌కు మన అమ్మమ్మగారి ఇంటికి వెళ్లొచ్చిన జ్ఞాపకంలా 'అన్నీ మంచి శకునములే' ఉంటుంది'' అన్నారు స్వప్నా దత్, ప్రియాంకా దత్. ''చాలాకాలం ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే చిత్రమిది'' అన్నారు సంతోష్ శోభన్. ''వైజయంతీ మూవీస్ సంస్థను మా పిల్లలు (స్వప్నా, ప్రియాంక) సక్సెస్‌ఫుల్‌గా రన్ చేస్తున్నారు. వీరి ఆలోచనలు అప్పట్లో నాకు రాలేదని ఈర్ష్యగా ఉంది'' అన్నారు నిర్మాత అశ్వినీదత్.''అసలు మనం ఎందుకు పుట్టాం? హిందూ ధర్మంలో మనం సెంటిమెంట్‌కు ఎంత వేల్యూ ఇస్తాం. ఆ సెంటిమెంట్ వల్ల మనం ఎలా ఉన్నాం? వంటి అంశాలు 'అన్నీ మంచి శకునములే..'లో ఉన్నాయి. ఒక అద్భుత సినిమాను చూసిన అనుభూతిని ప్రేక్షకులకు ఇస్తుందని గ్యారంటీ ఇస్తున్నాను'' అన్నారు రాజేంద్రప్రసాద్. ''పద హారు కూరల రుచుల సమ్మేళనం ఈ చిత్రం'' అన్నారు వీకే నరేశ్. ఈ వేడుకలో దర్శకులు నాగ్ అశ్విన్, హను రాఘవపూడి, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

అడిగినవన్నీ ఇస్తాడు!



● సముద్ర ఖని, ధ్రువన్

'నాన్నా ఎప్పుడు దేవుడు కనపడినా దండం పెట్టుకోమంటావు ఎందుకు' అని అడిగిన కొడుకుతో 'మనం అడిగినవన్నీ ఇస్తాడు కాబట్టి' అని తండ్రి అంటాడు. దానికి ఆ పిల్లాడు 'అన్నీ ఇచ్చేవాడిని దేవుడు అనరు.. నాన్నా అంటారు' వంటి సంభాషణలతో 'విమానం' టీజర్ విడుదలైంది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో సాగే ఈ చిత్రం జూన్ 9న విడుదల కానుంది. అంగవైకల్యంతో ఇబ్బంది పడుతున్నప్పటికీ కొడుకుని ఎంతో ప్రేమగా చూసుకునే తండ్రి వీరయ్య పాత్రను సముద్ర ఖని, కొడుకు పాత్రను మాస్టర్ ధ్రువన్ చేశారు. విమానం ఎక్కాలని ఆశపడే కొడుక్కి బాగా చదువుకుంటే నువ్వే ఎక్కగలవని తండ్రి అంటాడు. ''తండ్రీ-కొడుకు-విమానం చుట్టూ సాగే భాగోద్వేగాల ప్రయాణమే ఈ విమానం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రంలో అనసూయ భరద్వాజ్, రాజేంద్రన్, ధన్‌రాజ్, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు చేశారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: వివేక్ కాలేపు.

అక్టోబరులో ఆరంభం



● వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్

'మహానటి', 'సీతారామం' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ మరో స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగులో 'తొలిప్రేమ', 'రంగ్ దే', 'సార్' వంటి సినిమాలను తెరకెక్కించిన వెంకీ అట్లూరి దర్శకత్వం వహించనున్న చిత్రంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించనున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. ''అక్టోబరులో షూటింగ్‌ను ఆరంభించి, వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ప్రేక్షకులను అలరించే మరో మంచి కంటెంట్ ఓరియంటెడ్ ఫిల్మ్‌గా ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

వచ్చే ఏడాది సైబర్ వార్



● సుకుమార్

సైబర్ వార్ నేపథ్యంలో రూపొందనున్న సైంటిఫిక్ థ్రిల్లర్ 'కోకో'. జై కుమార్ దర్శకత్వంలో సందీప్ రెడ్డి వాసా నిర్మించనున్నారు. జూన్ మూడోవారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ సినిమా థీమ్, బ్యాక్‌డ్రాప్‌ను వివరించే గ్లింప్స్ వీడియోను దర్శకుడు సుకుమార్ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''భారత రక్షణ వ్యవస్థకు హాని కలగకుండా ఉండేందుకు రామానుజన్ అనే వ్యక్తి 'ఆర్ఎమ్- ఐఎస్‌యూ' (వేగం, ఖచ్చితత్వం, శక్తి) కోడ్‌తో ప్రపంచంలోనే మొట్టమొదటి ఆటోమేషన్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌ను కనుగొంటాడు. తండ్రి రామానుజన్ ఆశయాలు ఆచరణలోకి వచ్చేందుకు, తన కుటుంబానికి జరిగిన నష్టానికి ప్రతీకారం తీర్చుకోవడానికి బ్లాక్ హ్యాట్ హ్యాకర్ నిక్కీ 'కోకో' అనే పేరుతో సెల్ఫ్ మేడ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌ని ఉపయోగిస్తుంది. 'కోకో' భౌతికంగా కనిపించదు. మరోవైపు భారతదేశంపై సైబర్ వార్ చేయాలని ఓ చైనీస్ హ్యాకర్ ప్లాన్ చేస్తుంటాడు. పాక్, చైనా మద్దతు ఉన్న హ్యాకర్ల సమూహం భారతదేశానికి వ్యతిరేకంగా సైబర్ ముప్పును విస్తరించడంతో సంఘర్షణ ప్రారంభమవుతుంది. అప్పుడేం జరిగింది? అన్నదే 'కోకో' చిత్ర కథాంశంగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడం, మలయాళం, హిందీ భాషలతో పాటు తైవాన్, వియత్నాం భాషల్లో ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

ఒక్క రోజు.... 48 గంటలు!



● రేఖా నిరోషా

ఆదిత్య బద్వేలి, రేఖా నిరోషా జంటగా నిరంజన్ బండి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఒక్క రోజు.. 48 హవర్స్'. ప్రీతీ క్రియేషన్స్, హేమలత సమర్పణలో కృష్ణా రెడ్డి, కేకే నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, షేడ్ స్టూడియోస్ అధినేత బలివాడ దేవి ప్రసాద్ ఆవిష్కరించారు. నిర్మాత కేకే మాట్లాడుతూ- ''మా బేనర్‌లో ఇది తొలి చిత్రం. మంచి కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం ఔట్‌పుట్ బాగా వచ్చింది. విజయం పట్ల నమ్మకంతో ఉన్నాం'' అన్నారు. నిరంజన్ బండి మాట్లాడుతూ- ''అనుకోని పరిస్థితుల్లో కష్టాలపాలైన హీరో టైమ్ ట్రావెల్ చేసి తనని ఏ విధంగా కాపాడుకున్నాడు అనేది ఈ సినిమా కథ'' అన్నారు. ''అవకాశం ఇచ్చిన డైరెక్టర్‌కి, ప్రొడ్యూసర్స్‌కి థ్యాంక్స్'' అన్నారు ఆదిత్య, రేఖా నిరోషా.



చైనీస్ తైపీ చేతిలో భారత జట్టు పరాజయం

సుదిర్మన్ కప్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌ను భారత జట్టు ఓటమితో ప్రారంభించింది. గ్రూప్ 'సి'లో భాగంగా చైనాలో ఆదివారం చైనీస్ తైపీతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-4తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో సాయిప్రతీక్-తనీషా క్రాస్టో 21-18, 24-26, 6-21తో యాంగ్ పో సువాన్-హు లింగ్ ఫాంగ్‌ల చేతిలో... రెండో మ్యాచ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 19-21, 15-21తో చౌ తియెన్ చెన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో పీవీ సింధు 14-21, 21-18, 17-21తో తై జు యింగ్ చేతిలో... నాలుగో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 13-21, 21-17, 18-21తో లీ యాంగ్-యో హోంగ్ వెల చేతిలో ఓడిపోయారు నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ 15-21, 21-18, 21-13తో లీ చియా సిన్-తెంగ్ చున్ సున్‌లపై గెలుపొందారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

ఇటాలియన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రోమ్‌లో జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-3, 7-6 (8/6)తో అర్నాబోల్డి-ఫెరారీ (ఇటలీ) జోడీపై గెలిచింది.

బెంగళూరు... ఇంకా ఉంది


మ్యాక్స్‌వెల్, పార్నెల్, డుప్లెసిస్

- 112 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘనవిజయం
- రాణించిన డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్
- 59 పరుగులకే రాజస్తాన్ ఆలౌట్
- కూల్చేసిన పార్నెల్, కరణ్, బ్రేస్‌వెల్

జైపూర్: ఇప్పుడు అందరి కళ్లు ప్లే ఆఫ్స్‌పైనే! ఏడు మ్యాచ్‌ల్లో గెలిచిన జట్టు కూడా ముందుకెళ్లడం కష్టంగా ఉంది. ఎందుకంటే ఇప్పటికే కనీసం ఏడు మ్యాచ్‌ల్లో గెలిచిన జట్లు గుజరాత్ (8), చెన్నై (7), ముంబై (7) మూడున్నాయి. కాబట్టి ఇకపై ఈ సీజన్‌లో కసిదీరా గెలవడం కంటే కూడా రన్‌రేట్‌తో గెలిచిన జట్లే ముందంజ వేస్తాయి. అందుకేనేమో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అసాధారణ విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో సజీవంగా ఉంది. రాజస్తాన్ రాయల్స్‌ను వారి సొంతగడ్డపై 112 పరుగుల భారీ తేడాతో ఓడించింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (18; 1 ఫోర్) నిరాశపరచగా... కెప్టెన్ డుప్లెసిస్ (44 బంతుల్లో 55; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (33 బంతుల్లో 54; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. చివర్లో అనూజ్ (11 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంతో ఆర్సీబీ 170 పైచిలుకు స్కోరు చేసింది. తర్వాత రాజస్తాన్ రాయల్స్ 10.3 ఓవర్లలో 59 పరుగులకే కుప్పకూలింది. ఈ ఓటమితో రాజస్తాన్ 'ప్లే ఆఫ్' చేరే అవకాశాలకు దాదాపుగా తెరపడింది. హెట్‌మైర్ (19 బంతుల్లో 35; 1 ఫోర్, 4 సిక్సర్లు) టాప్ స్కోరర్! 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వేన్ పార్నెల్ 3 వికెట్లు పడగొట్టాడు.

నలుగురు డకౌట్'...

172 పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ రాయల్స్ నిర్లక్ష్యంగా ఆడింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), బట్లర్ (0) సహా అశ్విన్ (0), ఆసిఫ్ (0) ఖాతానే తెరువలేకపోయారు. ఆర్సీబీ బౌలర్లు పార్నెల్, బ్రేస్‌వెల్, కరణ్ శర్మ మూకుమ్మడి దాడికి క్రీజులో నిలిచేందుకే అపసోపాలు పడ్డారు. హెట్‌మైర్ కొట్టిన 4 సిక్సర్లు ప్రేక్షకులను అలరించాయి కానీ జట్టుకు ఏమాత్రం ఉపయోగపడలేదు. ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఇది మూడో అత్యల్ప స్కోరు. 2017లో ఆర్సీబీ స్కోరు 49 ముందు వరుసలో ఉంటే... తర్వాత రెండు స్కోర్లు రాజస్తాన్‌వే. 2009లో 58కే కుప్పకూలిన రాయల్స్ ఇప్పుడు ఒక పరుగు ఎక్కువ చేసింది అంతే!

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) యశస్వి జైస్వాల్ (బి) ఆసిఫ్ 18; డుప్లెసిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ఆసిఫ్ 55; మ్యాక్స్‌వెల్ (బి) సందీప్ శర్మ 54; మహిపాల్ (సి) ధ్రువ్ జురెల్ (బి) జంపా 1; దినేశ్ కార్తీక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 0; బ్రేస్‌వెల్ (నాటౌట్) 9; అనూజ్ రావత్ (నాటౌట్) 29; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-50, 2-119, 3-120, 4-120, 5-137. **బౌలింగ్:** సందీప్ శర్మ 4-0-34-1, ఆడమ్ జంపా 4-0-25-2, యజువేంద్ర చహల్ 4-0-37-0, అశ్విన్ 4-0-33-0, ఆసిఫ్ 4-0-42-2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) విరాట్ కోహ్లి (బి) సిరాజ్ 0; బట్లర్ (సి) సిరాజ్ (బి) పార్నెల్ 0; సంజూ సామ్సన్ (సి) అనూజ్ (బి) పార్నెల్ 4; జో రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పార్నెల్ 10; దేవ్‌దత్ పడిక్కల్ (సి) సిరాజ్ (బి) బ్రేస్‌వెల్ 4; హెట్‌మైర్ (సి) బ్రేస్‌వెల్ (బి) మ్యాక్స్‌వెల్ 35; ధ్రువ్ జురెల్ (సి) మహిపాల్ (బి) బ్రేస్‌వెల్ 1; అశ్విన్ (రనౌట్) 0; ఆడమ్ జంపా (బి) కరణ్ శర్మ 2; సందీప్ శర్మ (నాటౌట్) 0; ఆసిఫ్ (సి) విరాట్ కోహ్లి (బి) కరణ్ శర్మ 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (10.3 ఓవర్లలో ఆలౌట్) 59. వికెట్ల పతనం:** 1-1, 2-6, 3-7, 4-20, 5-28, 6-31, 7-50, 8-59, 9-59, 10-59. **బౌలింగ్:** సిరాజ్ 2-0-10-1, వేన్ పార్నెల్ 3-0-10-3, బ్రేస్‌వెల్ 3-0-16-2, కరణ్ శర్మ 1.3-0-19-2, మ్యాక్స్‌వెల్ 1-0-3-1.

'గ్రాండ్‌మాస్టర్' ప్రణీత్

భారత చెస్ 82వ జీఎంగా తెలంగాణ కుర్రాడు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ చెస్ టోర్నీలలో తన నిలకడమైన ప్రదర్శనను కొనసాగిస్తూ తెలంగాణ టీనేజ్ ప్లేయర్ వుప్పాల ప్రణీత్ భారత 82వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. అజర్‌బైజాన్‌లో జరిగిన బకూ ఓపెన్ టోర్నీలో 15 ఏళ్ల ప్రణీత్ గ్రాండ్‌మాస్టర్ హోదా ఖరారు కావడానికి అవసరమైన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రణీత్ ఆరు పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఎనిమిదో రౌండ్‌లో టాప్ సీడ్, అమెరికా గ్రాండ్‌మాస్టర్ హాన్స్ మోక్ నీమన్‌పై ప్రణీత్ గెలుపొందడంతో అతని లైవ్ ఎలో రేటింగ్ 2500.5గా నమోదైంది. చివరి రౌండ్‌లో ఈ టోర్నీ విజేత, భారత గ్రాండ్‌మాస్టర్ లియోన్ ల్యూక్ మెండోంకా (గోవా) చేతిలో ఓడిపోయినా అతని ఎలో రేటింగ్‌పై ప్రభావం చూపకపోవడంతో ప్రణీత్‌కు జీఎం హోదా ఖాయమైంది.

- ఈ టోర్నీలో ప్రణీత్ నలుగురు గ్రాండ్‌మాస్టర్లు వహప్ సనాల్ (తుర్కియే), వుగార్ అసాదిల్ (అజర్‌బైజాన్), లెవాన్ పాంత్సులయ (జార్జియా), నీమన్ (అమెరికా)లపై నెగ్గడంతోపాటు ఇస్కం దరోవ్ (అజర్‌బైజాన్), నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)లతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు.
- చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ హోదా రావాలంటే మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతోపాటు ఎలో రేటింగ్ పాయింట్లు 2500 దాటాలి. ప్రణీత్ ఇప్పటికే మూడు జీఎం నార్మ్‌లు సంపాదించినా అతని ఎలో రేటింగ్ 2500 దాటలేకపోవడంతో జీఎం హోదా కోసం నిరీక్షించాల్సి వచ్చింది. అయితే బకూ ఓపెన్‌లో ప్రణీత్ అద్భుత ప్రదర్శన కనబరిచి తన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించడంతో అతనికి జీఎం హోదా ఖరారైంది.
- ప్రణీత్ తొలి జీఎం నార్మ్‌ను 2022 మార్చిలో ఫస్ట్ సాటర్‌డే టోర్నీలో, రెండో జీఎం నార్మ్‌ను 2022 జూలైలో బీల్ ఓపెన్ టోర్నీలో, మూడో జీఎం నార్మ్‌ను 2023 ఏప్రిల్‌లో సన్‌వే ఫార్మెంటెరా ఓపెన్ టోర్నీలో సాధించాడు.
- 2021 వరకు ప్రముఖ కోచ్ ఎన్‌వీఎస్ రామరాజు వద్ద శిక్షణ పొందిన ప్రణీత్ ప్రస్తుతం ఇజ్రాయెల్ గ్రాండ్‌మాస్టర్ విక్టర్ మిఖాలెవ్‌స్కీ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. పదేళ్లుగా చెస్ ఆడుతున్న ప్రణీత్ శ్రమకు తగ్గ ఫలితం రావడంపట్ల అతని తల్లిదండ్రులు శ్రీనివాసాచారి, ధనలక్ష్మి 'సాక్షి'తో ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకైతే ప్రణీత్‌ను సొంత ఖర్చులతోనే టోర్నీలకు పంపించామని, ఇకనైనా అతనికి స్పాన్సర్లు వస్తే సంతోషిస్తామని తెలిపారు.



> ఒక స్వప్నం సాకారమైంది. నా కెరీర్‌లో ఇది చిరస్మరణీయ క్షణం. 2500 రేటింగ్ దాటడం ఒక మైలురాయిలాంటిది. భవిష్యత్‌లో 2700 రేటింగ్‌ను అందుకోవడం, ప్రపంచ చాంపియన్ కావడం నా సుదీర్ఘ లక్ష్యాలు. కొన్నాళ్లుగా నిలకడగా రాణిస్తున్నా నిర్ణీత సమయంలోపు గేమ్‌ను ముగించాలనే ఒత్తిడి నాపై ఉండేది. ఈ విషయంలో ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నా. భారత్ నుంచి పలువురు యువ ఆటగాళ్లు గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధిస్తుండటం ఈ ఆటకు ఎంతో మేలు చేస్తుంది. కజకిస్తాన్‌లో త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే నా తదుపరి లక్ష్యం. అత్యున్నతస్థాయిలో పోటీపడాలన్నా, మెరుగైన శిక్షణ తీసుకోవాలన్నా, విదేశాల్లో టోర్నీలు ఆడేందుకు వెళ్లాలన్నా చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. ఇప్పటికైతే ఆర్థికంగా ఆదుకోవడానికి నాకు స్పాన్సర్ లేరు. గ్రాండ్‌మాస్టర్ హోదా టైటిల్‌తో నాకు స్పాన్సర్‌లు లభిస్తారని ఆశిస్తున్నా. **-ప్రణీత్**

5 భారత చెస్‌లో తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన ఐదో ప్లేయర్‌గా ప్రణీత్ నిలిచాడు. గతంలో ఇరిగేశి అర్జున్ (2018), హర్ష భరతకోటి (2019), రాజా రిత్విక్ (2021), రాహుల్ శ్రీవాత్సవ్ (2022)ఈ ఘనత సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటికే పెంటేల హరికృష్ణ (2001), హంపి (2002), హారిక (2011), లలిత్ బాబు (2012), కార్తీక్ వెంకటరామన్ (2018) గ్రాండ్‌మాస్టర్ హోదా పొందారు.

గెలిచి నిలిచిన కోల్‌కతా


రింకూ, నితీశ్

ఐపీఎల్‌లో నేడు
గుజరాత్ x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

- 6 వికెట్లతో చెన్నైపై జయభేరి
- నితీశ్ రాణా, రింకూ అర్ధ సెంచరీలు

చెన్నై: తప్పక గెలిస్తేనే ఐపీఎల్ ప్లే ఆఫ్ రేసులో నిలిచే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) అదరగొట్టింది. చెన్నై సూపర్‌కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచి ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. బౌలింగ్‌తో చెన్నై బ్యాటర్లను వారి సొంతగడ్డపై అడ్డుకున్న నైట్‌రైడర్స్ తర్వాత లక్ష్యఛేదనలో తడబడినా... కెప్టెన్ నితీశ్ రాణా (44 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (43 బంతుల్లో 54; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీల పోరాటంతో నెగ్గింది. ముందుగా చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. నైట్‌రైడర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు టాపార్డర్ బ్యాటర్స్ సహా హిట్టర్ శివమ్ దూబే (34 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కష్టపడ్డాడు. నరైన్, వరుణ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం కోల్‌కతా 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసి గెలిచింది. దీపక్ చహర్ (3/27) పేస్‌తో కోల్‌కతా టాపార్డర్‌కు చెక్ పెట్టాడు. గుర్బాజ్ (1), వెంకటేశ్ (9), జేసన్ రాయ్ (12)లు నిష్క్రమించడంతో 33 పరుగులకే 3 వికెట్లు పడ్డాయి. ఈ దశలో నితీశ్ రాణా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రింకూ సింగ్ నాలుగో వికెట్‌కు 99 పరుగులు జోడించి గెలుపుబాట వేశారు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) వైభవ్ (బి) వరుణ్ 17; కాన్వే (సి) రింకూ (బి) శార్దుల్ 30; రహానే (సి) రాయ్ (బి) వరుణ్ 16; రాయుడు (బి) నరైన్ 4; దూబే (నాటౌట్) 48; మొయిన్ అలీ (బి) నరైన్ 1; జడేజా (సి) వరుణ్ (బి) వైభవ్ 20; ధోని (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1-31, 2-61, 3-66, 4-68, 5-72, 6-140. **బౌలింగ్:** వైభవ్ 4-0-30-1, హర్షిత్ రాణా 2-0-19-0, వరుణ్ 4-0-36-2, సునీల్ నరైన్ 4-0-15-2, శార్దుల్ 3-0-15-1, సుయశ్ 3-0-29-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) పతిరణ (బి) చహర్ 12; గుర్బాజ్ (సి) తుషార్ (బి) చహర్ 1; వెంకటేశ్ (సి) జడేజా (బి) చహర్ 9; నితీశ్ రాణా (నాటౌట్) 57; రింకూ సింగ్ (రనౌట్) 54; రసెల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (18.3 ఓవర్లలో 4 వికెట్లకు) 147. వికెట్ల పతనం:** 1-4, 2-21, 3-33, 4-132. **బౌలింగ్:** దీపక్ చహర్ 3-0-27-3, తుషార్ 3.3-0-25-0, మొయిన్ అలీ 4-0-31-0, తీక్షణ 3-0-22-0, పతిరణ 3-0-23-0, జడేజా 2-0-18-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	12	8	4	0	16	0.761
చెన్నై	13	7	5	1	15	0.381
ముంబై	12	7	5	0	14	-0.117
లక్నో	12	6	5	1	13	0.309
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	12	6	6	0	12	-0.268
హైదరాబాద్	11	4	7	0	8	-0.471
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

యూజీసీ-నెట్-2023

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్-2023, జూన్ (యూజీసీ-నెట్) పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్), విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు ఉపయోగపడే ఈ పరీక్షను జూన్‌లో నిర్వహించనున్నట్లు యూజీసీ వెల్లడించింది. ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంటారు.


- **సబ్జెక్టులు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ క్రిమినాలజీ తదితరాలు.
- **అర్హత:** 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జేఆర్ఎఫ్‌కు 01.06.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ట వయోపరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్షకు 3 గంటల వ్యవధి ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2023.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 02, 03.06.2023.
- **పరీక్ష తేదీలు:** 13.06.2023 నుంచి 22.06.2023 వరకు
- **వెబ్‌సైట్:** www.ugcnet.nta.nic.in

విజయనగరం జిల్లా డీఎంహెచ్‌వోలో వివిధ ఉద్యోగాలు

విజయనగరం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. విజయనగరం, పార్వతీపురం జిల్లా ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
- **పోస్టుల వివరాలు:** ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్-01,డెంటల్ టెక్నీషియన్ -02.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(స్పీచ్ అండ్ లాంగ్వేజ్ పాథాలజీ), డెంటల్ టెక్నీషియన్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.**వయసు:** 42ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విజయనగరం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.05.2023.
- **వెబ్‌సైట్:** www.vizianagaram.nic.in

బార్క్‌లో 4,374 ఉద్యోగాలు


జాబ్స్ ఇన్ఫో

ముంబయిలో ట్రాంబేలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం(బార్క్).. ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా వివిధ విభాగాల్లో మొత్తం 4,374 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, ట్రెనింగ్ స్కీమ్ రెండు విధాలుగా ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో.. బార్క్‌లో ఉద్యోగాల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్- 212 పోస్టులు

- ఈ విధానంలో మొత్తం 212 పోస్టులను భర్తీ చేస్తారు. వీటిల్లో విభాగాల వారీగా చూస్తే.. టెక్నికల్ ఆఫీసర్(సి)-181, సైంటిఫిక్ అసిస్టెంట్ (బి)-07, టెక్నిషియన్(బి) 24 పోస్టులున్నాయి.
- **అర్హతలు:** టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు ఎమ్మెస్సీ, ఎం.లిబ్, బీఈ/బీటెక్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- **సైంటిఫిక్ అసిస్టెంట్-బి:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/న్యూట్రిషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **టెక్నీషియన్-బి:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు పదోతరగతి ఉత్తీర్ణులవ్వాలి. సెకండ్ క్లాస్ బాయిలర్ అటెండెన్స్ సర్టిఫికేట్ ఉండాలి.

ట్రైనింగ్ స్కీమ్- 4162 పోస్టులు

- ట్రెనింగ్ స్కీమ్(స్టైపెండరీ ట్రెనీ) ద్వారా మొత్తం 4162 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. వీటిల్లో కేటగిరీ-1లో 1216 పోస్టులు, కేటగిరీ-2లో 2946 పోస్టులున్నాయి.
- కేటగిరీ-1లో.. బయో కెమిస్ట్రీ/బయోసైన్స్/లైఫ్ సైన్స్/బయాలజీ విభాగాల్లో 21, కెమిస్ట్రీ-169, ఫిజిక్స్-117, కంప్యూటర్‌సైన్స్-25, అగ్రికల్చర్-02, హార్టికల్చర్-06, కెమికల్-171, ఎలక్ట్రికల్-144, ఎలక్ట్రానిక్స్-98, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ -59, మెకానికల్-328, మెటలర్జీ-05, ఆర్కిటెక్చర్-02, సివిల్-62, ఆటోమొబైల్-04, ఇండస్ట్రియల్ సేఫ్టీ 03 పోస్టులున్నాయి.
- కేటగిరీ-2లో.. ఫిట్టర్-698, టర్నర్/మెషినిస్ట్-213, వెల్డర్-99, మెకానిక్ మెషీన్ టూల్స్ మెయింటెన్స్-18, ఎలక్ట్రీషియన్-399, ఎలక్ట్రానిక్ మెకానిక్-266, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-152, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్-95, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్)-52, డ్రాఫ్ట్స్‌మ్యాన్(సివిల్)-15, మేషన్-30, ప్లంబర్-42, కార్పెంటర్-27, మెకానిక్ మోటార్ వెహికిల్-24, డీజిల్ మెకానిక్-19, ప్లాంట్ ఆపరేటర్-532, ల్యాబొరేటరీ-303, డెంటల్ టెక్నీషియన్-హైజీనిస్ట్-1, డెంటల్ టెక్నీషియన్-మెకానిక్-01 ఉన్నాయి.
- **అర్హతలు:** ల్యాబొరేటరీ, డెంటల్ టెక్నీషియన్-హైజీనిస్ట్, డెంటల్ టెక్నీషియన్ -మెకానిక్ పోస్టులు తప్ప.. మిగతా అన్నింటికీ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో పదోతరగతి 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. సంబంధిత విభాగాల్లో ఐటీఐ ట్రేడ్ సర్టిఫికేట్ ఉండాలి.
- **వేతనాలు:** కేటగిరీ-1 పోస్టులకు నెలకు రూ. 24,000 నుంచి రూ.26,000 స్టైపెండ్ చెల్లిస్తారు. కేటగిరీ-2 పోస్టులకు స్టైపెండ్ నెలకు రూ. 20,000 నుంచి రూ.22000 వరకూ ఉంటుంది.

ల్యాబరేటరీ-303 పోస్టులు

ఈ పోస్టులకు ఇంటర్మీడియెట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ మ్యాథ్స్ సబ్జెక్టులతో) 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. డెంటల్ టెక్నీషియన్-హైజీనిస్ట్-1 పోస్టుకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. డెంటల్ టెక్నీషియన్-మెకానిక్-1 పోస్టుకు ఇంటర్మీడియట్ సైన్స్ సబ్జెక్టుతో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెండేళ్ల డిప్లొమా ఉండాలి.

వయసు

టెక్నికల్ ఆఫీసర్‌కు 18-35 ఏళ్లు; సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 18-22 ఏళ్లు; టెక్నీషియన్‌కు 18-25 ఏళ్లు; స్టైపెండరీ ట్రెనీ కేటగిరీ-1కు 19-24, కేటగిరీ-2కు 18-22 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయసులో ఓబీసీలకు,ఎక్స్ సర్వీస్‌మెన్ మూడేళ్ల,ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ఇలా

- ఆయా పోస్టులను అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టుకు ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎక్కువమంది దరఖాస్తు చేసినట్లయితే.. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు.
- సైంటిఫిక్ అసిస్టెంట్ -బి: కేటగిరీ-1 స్టైపెండరీ ట్రెయినీ పోస్టులకు గంట వ్యవధిలో కంప్యూటర్ బేస్డ్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రాన్ని డిప్లొమా/బీఎస్సీ సిలబస్ ఆధారంగా రూపొందిస్తారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించినవాళ్లను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. అభ్యర్థుల తుది ఎంపిక ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగానే ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.
- టెక్నీషియన్-బి, కేటగిరీ-2 స్టైపెండరీ ట్రెయినీ పోస్టులకు మూడు దశల్లో జరిగే పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టేజ్-1లో ప్రిలిమినరీ టెస్ట్, స్టేజ్-2లో అడ్వాన్స్‌డ్ టెస్ట్, స్టేజ్-3లో స్కిల్ టెస్ట్ ఉంటాయి.
- **స్టేజ్-1 ప్రిలిమినరీ టెస్ట్:** ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్స్-20, సైన్స్-20, జనరల్ అవేర్‌నెస్-10 నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ఇందులో ప్రతిభ చూపిన వాళ్లను స్టేజ్-2 లోని అడ్వాన్స్‌డ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- **స్టేజ్-2 అడ్వాన్స్‌డ్ టెస్ట్:** ఈ పరీక్షలో 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. సరైన సమాధానానికి 3 మార్కులు, ప్రతి తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. ఇందులో సాధించిన మార్కుల ఆధారంగానే మెరిట్ లిస్టును తయారు చేస్తారు.
- **స్టేజ్-3 స్కిల్ టెస్ట్:** స్టేజ్-2లో ప్రతిభ చూపిన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి.. స్కిల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 22.05.2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అమరావతి, గుంటూరు, హైదరాబాద్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** https://barconlineexam.com

గురుకుల కొలువు.. సాధించండిలా!

- టీఎస్ గురుకులాల్లో 9,231 పోస్టుల భర్తీకి కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ
- డీఎల్ మొదలు క్రాఫ్ట్ టీచర్ వరకు.. 9 రకాల ఉద్యోగాలు
- ఇప్పటి నుంచి కృషి చేస్తే విజయానికి ఆస్కారం

టీఎస్ టీచర్ జాబ్స్

తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో డిగ్రీ లెక్చరర్స్ మొదలు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్ట్‌ల భర్తీకి.. దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. గత మూడు, నాలుగేళ్లుగా టీచర్ కొలువుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు.. తాజా గురుకుల ఉద్యోగాల భర్తీ అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. పరీక్ష తేదీ కోసం వేచి చూడకుండా..దరఖాస్తు సమయం నుంచే ఆయా పోస్ట్‌లకు సంబంధించిన పరీక్షలకు ప్రిపరేషన్ సాగిస్తే.. విజయావకాశాలు మెరుగవుతాయి.

మొత్తం 9,231 పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం..గురుకుల విద్యాయాల్లో మొత్తం 9,231 పోస్ట్‌ల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఈ పోస్ట్‌ల భర్తీ చేపట్టనుంది. ఇందుకోసం.. ప్రత్యేకంగా తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో.. ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది.

పోస్టుల వివరాలు

- డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్,పీడీ(ఫిజికల్ డైరెక్టర్),లైబ్రేరియన్-868 పోస్టులు
- జూనియర్ కళాశాలల్లో లెక్చరర్స్,పీడీ, లైబ్రేరియన్స్-2008 పోస్టులు
- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ)-1,276 పోస్ట్‌లు
- ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ)-4,020 పోస్ట్‌లు
- ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్స్ -134 పోస్ట్‌లు
- గురుకుల పాఠశాలల్లో లైబ్రేరియన్స్ -434 పోస్ట్‌లు
- మ్యూజిక్ టీచర్స్-124 పోస్ట్‌లు
- క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్-92 పోస్ట్‌లు
- గురుకుల విద్యాలయాల్లో ఫిజికల్ డైరెక్టర్-275 పోస్టులు

ఎంపిక ఇలా

రాత పరీక్ష, డెమానుస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఆయా పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

విజయం సాధించేలా

సిలబస్‌పై అవగాహన

తెలంగాణ గురుకుల పోస్ట్‌లకు పోటీపడుతున్న అభ్యర్థులు ప్రిపరేషన్ క్రమంలో ముందుగా.. సిలబస్‌పై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. తమ సబ్జెక్ట్‌లకు సంబంధించిన సిలబస్ అంశాలను పరిశీలించాలి. సదరు టాపిక్స్ నుంచి ఎలాంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందో గుర్తించాలి. సిలబస్‌పై అవగాహన పొందిన అభ్యర్థులు.. వెంటనే ప్రిపరేషన్ ప్రారంభించాలి. పరీక్షల్లో ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి.

పాత ప్రశ్న పత్రాలు

అభ్యర్థులు టీచర్ నియామకాలకు సంబంధించిన పాత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటంది. గతంలో నిర్వహించిన డీఎస్సీ, టెట్ వంటి పరీక్షల ప్రశ్న పత్రాలను పరిశీలించి.. వాటిని ప్రాక్టీస్ చేయాలి. పెడగాజీ విషయంలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల నియామక పరీక్షల ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం మేలు చేస్తుంది.

జనరల్ స్టడీస్

- అన్ని పోస్ట్‌లకు సంబంధించి పేపర్-1లో రాణించాలంటే.. జనరల్ స్టడీస్‌కు సంబంధించి భారత రాజ్యాంగం,భారత రాజకీయ వ్యవస్థ,పబ్లిక్ పాలసీ, సామాజిక వివక్ష; వికలాంగులు, గిరిజనులకు సంబంధించిన హక్కులు; సమ్మిళిత విధానాలు; సమాజ సంస్కృతి, నాగరికత, వారసత్వం; భారత్, తెలంగాణ కళలు, సాహిత్యం; సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు; పర్యావరణ సమస్యలు-విపత్తుల నిర్వహణ, నివారణ, ఉపశమన విధానాలు; భారత్, తెలంగాణ ఆర్థిక, సామాజిక అభివృద్ధి; తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రాధాన్యంగా తెలంగాణలోని సామాజిక-ఆర్థిక చరిత్ర, రాజకీయ-సాంస్కృతిక చరిత్ర, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **అనలిటికల్ ఎబిలిటీస్:** లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లపై దృష్టిపెట్టాలి.
- **ఇంగ్లిష్:** ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, వర్డ్స్ అండ్ సెంటెన్సెస్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, యాంటానిమ్స్, సినానిమ్స్ వంటి బేసిక్ ఇంగ్లిష్ అంశాలపై పట్టు సాధించాలి.

సబ్జెక్ట్ పేపర్

ఆయా పోస్ట్‌లకు సంబంధించి పేర్కొన్న సబ్జెక్ట్ పేపర్లలో రాణించేందుకు అభ్యర్థులు.. పీజీ స్థాయి అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ఆయా అంశాలను వర్తమాన పరిణామాలతో సమ్మిళితం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి సబ్జెక్ట్‌ల విషయంలో అప్లికేషన్ దృక్పథంతో అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్, పీడీ, లైబ్రేరియన్ చివరి తేది; జూనియర్ కళాశాలల్లో లెక్చరర్స్, పీడీ, లైబ్రేరియన్ చివరి తేది: మే 17, 2023
- పాఠశాలల్లో పీజీటీ, పీడీ, లైబ్రేరియన్, క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్, ఆర్ట్ టీచర్, డ్రాయింగ్ టీచర్, మ్యూజిక్ టీచర్ చివరి తేది: మే24, 2023
- టీజీటీ చివరి తేది: మే 27, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://treirb.telangana.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	123	62,028
నిఫ్టీ ▲	18	18,315

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,285	▽	43
డోజోన్స్	33,300	▽	9
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,754	▲	24
డాక్స్	15,914	▲	79
షాంఘై	3,272	▽	37
నికాయ్	29,388	▲	261

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

సొంతిల్లు.. వృద్ధాప్యంలో ఆసరా!

- ఇంటిపై రివర్స్ మార్ట్‌గేజ్ రుణం
- నెలవారీగా 20 ఏళ్ల పాటు ఆదాయం
- జీవించి ఉన్నంత కాలం అందులోనే నివాసం
- ఆ తర్వాతే బ్యాంకులు విక్రయించుకోగలవు
- తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఉండదు
- వారసులు చెల్లించి సొంతం చేసుకోవచ్చు



పదవీ విరమణ తీసుకున్నారు. ఉండడానికి సొంతిల్లు ఉంది. కానీ, పింఛను సదుపాయం లేదు. ఉద్యోగం లేదా సంపాదనా కాలంలో పెద్దగా పొదుపు చేయలేకపోయారు. చేసిన పొదుపు ఇప్పటి జీవన అవసరాలను తీర్చే స్థాయిలో లేదు. అదనపు ఆదాయం కావాలి. ఇందుకోసం వృద్ధాప్యంలో ఏం చేయాలి..? ఇలాంటి సందిగ్ధత ఎదుర్కొనే ప్రతి ఒక్కరి ముందున్న ఆప్షన్ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్. వృద్ధాప్యంలో జీవన అవసరాలను దృష్టిలో పెట్టుకున్న కేంద్ర సర్కారు 2007లోనే దీన్ని తీసుకొచ్చింది. కానీ, మన దేశంలో అంతగా ప్రజాదరణకు నోచుకోలేదు. దీని గురించి తెలిసింది చాలా తక్కువ మందికే. బ్యాంకులు వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు, క్రెడిట్ కార్డుల గురించి ప్రకటనలు ఇవ్వడం గమనించే ఉంటారు. కానీ, ఏ బ్యాంకు కూడా ఎక్కడా రివర్స్ మార్ట్‌గేజ్ స్కీమ్ గురించి ప్రకటన ఇచ్చినట్టు కనిపించదు. దీనికి కారణం బ్యాంకులకు ఈ ఉత్పత్తిపై ఆసక్తి లేకపోవడమే. వృద్ధాప్యంలో పోషణకు ఎలాంటి ఆదాయం లేని వారిని సొంతిల్లే ఆదుకుంటుంది. ఇంటిని బ్యాంకు తనఖాగా ఉంచుకుని నెలవారీ ఆదాయం సమకూరుస్తుంది. ఈ పథకం ప్రయోజనాలు, అర్హతలపై మరిన్ని వివరాలు అందించే కథనమే ఇది.

ఇది ఎలా పనిచేస్తుంది..?

రివర్స్ మార్ట్‌గేజ్ అంటే నివాస యోగ్యమైన గృహంపై తీసుకునే రుణం. మార్ట్‌గేజ్ అన్నది ఇంటిని సొంతం చేసుకోవడం కోసం తీసుకునే రుణం. దీనికి విరుద్ధంగా ఇంటిపై రుణం తీసుకునేది కనుక రివర్స్ మార్ట్‌గేజ్ అని పేరు పెట్టారు. ఇంటి కోసం మార్ట్‌గేజ్ రుణం తీసుకుంటే నెలవారీ ఈఎంఐ ఎలా అయితే చెల్లిస్తారో.. రివర్స్ మార్ట్‌గేజ్‌లో బ్యాంక్ కూడా రుణ గ్రహీతకు అదే విధంగా చెల్లిస్తుంది. అద్దె ఇంట్లో ఉండే వారికి ఈ రుణానికి అర్హత ఉండదు. సొంతిల్లు, దానిపై సంపూర్ణ హక్కులు ఉన్న వారే దీన్ని తీసుకోగలరు. ఇంటి విలువ ఎంత, అది ఏ ప్రాంతంలో ఉంది? తదితర అంశాలను చూసిన తర్వాత బ్యాంక్‌లు ఎంత రుణం ఇవ్వాలన్నది నిర్ణయిస్తాయి. ఇంటి విలువలో రుణంగా (ఎల్‌టీవీ) 60 నుంచి 80 శాతం మధ్య నిర్ణయిస్తాయి. రివర్స్ మార్ట్‌గేజ్ కింద చాలా బ్యాంకులు గరిష్ఠంగా రూ. కోటి రుణ పరిమితిని అమలు చేస్తున్నాయి. అంటే రివర్స్ మార్ట్‌గేజ్ కింద తనఖా పెట్టే ఇంటి విలువ రూ.2 కోట్లు ఉన్నా సరే గరిష్ఠంగా రూ.కోటి వరకే పొందగలరు. గరిష్ఠంగా 20 ఏళ్ల కాలానికి రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి.

రుణాన్ని చెల్లించక్కర్లేదు..

వృద్ధాప్యంలో జీవన అవసరాల కోసం ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకుంటున్నారని అనుకుందాం. అలాంటప్పుడు తిరిగి ఎలా చెల్లించగలం? అన్న ప్రశ్న రావచ్చు. నిజమే తీసుకున్న రుణాన్ని తప్పనిసరిగా తిరిగి చెల్లించాలనేమీ లేదు. ఉదాహరణకు వినయ్ (62) 20 ఏళ్ల కాలానికి రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకున్నారని అనుకుందాం. ఆయన 82 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా జీవించే ఉన్నారు. కాల వ్యవధి ముగిసింది కనుక ఆ తర్వాత నుంచి బ్యాంక్ ఎలాంటి చెల్లింపులు చేయదు. అయినా, రుణ గ్రహీత అదే ఇంటిలో నిశ్చింతగా నివసించొచ్చు. ఇంటి యజమాని మరణించిన తర్వాతే అది బ్యాంక్ పరం అవుతుంది. ఒకవేళ భార్యా, భర్త జాయింట్‌గా రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకుంటే వారిద్దరి మరణానంతరమే బ్యాంకులకు హక్కులు లభిస్తాయి. రుణ గ్రహీత మరణానంతరం రుణం, దానిపై వడ్డీ బకాయిలు చెల్లించే ఆప్షన్‌ను బ్యాంక్‌లు వారసులకు కల్పిస్తాయి. వారు ముందుకు రాకపోతే అప్పుడు ఆ ఇంటిని బ్యాంక్ వేలం వేస్తుంది. అన్ని బకాయిలు మినహాయించుకుని ఏమైనా మిగిలి ఉంటే వారసులకు చెల్లిస్తుంది. ఇంటిని విక్రయించగా వచ్చిన మొత్తం బకాయిలు తీర్చేంత లేకపోతే, మిగిలినది బ్యాంక్ నష్టం కింద సర్దుబాటు చేసుకుంటుంది. వారసులకు బాధ్యత ఉండదు.

రెండు రకాల చెల్లింపులు...

రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని రుణ గ్రహీత కోరిక మేరకు బ్యాంక్‌లు రెండు రకాలుగా చెల్లిస్తాయి. ఒకటి ప్రతి నెలా వాయిదాల రూపంలో అందుకోవచ్చు. లేదంటే త్రైమాసికం, ఆరు నెలలు లేదా ఏడాదికోసారి చెల్లింపులు చేస్తుంది. రెండు ఏక మొత్తంలో మంజూరు చేస్తుంది. బ్యాంక్ నుంచి రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని ఏక మొత్తంలో ఒకే విడత అందుకున్నా లేక నెలవారీ వాయిదాల రూపంలో అందుకున్నా, ఆ మొత్తంపై పన్ను పడదు. ఎందుకంటే ఆదాయపన్ను చట్టం దీన్ని ఆదాయం కింద పరిగణించదు. రుణంగానే భావిస్తుంది. దీంతో పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంటుంది. చెల్లింపుల మొత్తాన్ని పెంచుకునే ఆప్షన్ లేదు. ఉదాహరణకు ప్రాపర్టీ విలువ రూ.కోటి ఉందని అనుకుందాం. లోన్ టు వ్యాల్యూ (ఎల్‌టీవీ) 80 శాతం అనుకుంటే అప్పుడు రుణం కింద రూ.80 లక్షలు ఖరారు అవుతుంది. ఇందులో వడ్డీ భాగం కూడా ఉంటుందని మర్చిపోవద్దు. రూ.80 లక్షలను 8.5 శాతం రేటుపై 20 ఏళ్ల కాలానికి తీసుకునేట్టు అయితే, అప్పుడు చెల్లించాల్సిన వడ్డీ రూ.45 లక్షలు అవుతుంది. రూ.80 లక్షల్లో రూ.45 లక్షలు పోను రూ.35 లక్షలను బ్యాంక్ రుణ గ్రహీతకు చెల్లిస్తుంది. ఇది నెలవారీ చెల్లింపులకు సంబంధించి అనుసరించే విధానం. ఏక మొత్తంలో చెల్లింపులు కోరుకుంటే అప్పుడు లోన్‌టు వ్యాల్యూలో 50 శాతం లేదా రూ.15 లక్షలు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది చెల్లిస్తారు.

ఎప్పుడైనా చెల్లించొచ్చు..

రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని ఎప్పుడైనా తిరిగి చెల్లించొచ్చు. కాల వ్యవధి పూర్తి కాక ముందు చెల్లించినా ఎలాంటి చార్జీలు ఉండవు. "ఒకవేళ మరో బ్యాంక్‌కు రివర్స్ మార్ట్ గేజ్ రుణాన్ని బదిలీ చేసుకోవడం ద్వారా పాత బ్యాంకు వద్ద ముందే తీర్చేస్తున్నట్టు అయితే, అప్పటికి మిగిలి ఉన్న రుణ బకాయి మొత్తంపై 0.5–2 శాతం మధ్య పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది" అని మైలోన్‌కేర్ డాట్ ఇన్ సంస్థ సీఈవో గౌరవ్‌గుప్తా తెలిపారు.

ఇప్పుడు సరైన తరుణమైనా..?

రుణాలపై వడ్డీ రేట్లు గతేడాది నుంచి 2.5 శాతం మేర పెరిగాయి. ఇక ఇక్కడి నుంచి పెరుగుదల పెద్దగా ఉండదన్నది విశ్లేషకుల అంచనా. అంతేకాదు అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు సర్దుకుని, అనిశ్చితులు తగ్గితే తిరిగి రుణ రేట్లు తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయి. కనుక రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని తీసుకునే వారు వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయని వెనుకాడక్కర్లేదని నిపుణులు సూచిస్తున్నారు. రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకోవడానికి అవసరమే ప్రామాణికం. జీవనానికి ఇతరత్రా ఆదాయం లేని వారు, ఉన్నా చాలని వారు, తమ వారసులకు తమ ప్రాపర్టీ అవసరం లేని వారు, మరింత సుఖవంతమైన జీవనం సాగించాలని అనుకునే వారు, అవసరాల్లో రాజీ పడే ఉద్దేశ్యం లేని వారు రివర్స్ మార్ట్‌గేజ్ రుణానికి వెళ్లొచ్చు. ఎస్‌బీఐ రివర్స్ మార్ట్‌గేజ్ రుణంపై రేటును రెపో రేటుతో అనుసంధానిస్తోంది. దాదాపు గృహ రుణం స్థాయిలోనే రేట్లు ఉంటాయి. రెపో రేటుకు అనుసంధానమై ఉండడం వల్ల వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, తగ్గినప్పుడు వెంటనే అది రుణాలపై ప్రతిఫలిస్తుంది.

విలువ మదింపు..

రివర్స్ మార్ట్‌గేజ్ కింద తనఖా ఉంచిన ఇంటి విలువను బ్యాంక్‌లు ఐదేళ్లకోసారి మదింపు వేస్తుంటాయి. తనఖా పెట్టిన ప్రాపర్టీ విలువ రుణం మంజూరు చేసే నాటి విలువ స్థాయిలోనే ఉందా? పెరిగిందా లేక తగ్గిందా? అన్నది సమీక్షిస్తుంటాయి. ఎందుకంటే రివర్స్ మార్ట్‌గేజ్ రుణాల్లో ఎక్కువ శాతం ఆయా ప్రాపర్టీలు బ్యాంక్‌ల స్వాధీనం అవుతుంటాయి. రుణం తీసుకున్న వారు లేదా వారి వారసులు తిరిగి చెల్లించే దాఖలాలు తక్కువ. దీంతో బ్యాంక్‌లు తాము ఇచ్చిన రుణం, దానిపై వడ్డీ బకాయిల వసూలుకు వాటిని వేలం వేస్తుంటాయి. వేలంలో సరైన విలువను పొందేందుకు వీలుగా బ్యాంక్‌లు రిస్క్ కోణంలో ఇలా ప్రాపర్టీ విలువను ఐదేళ్లకోసారి మదింపు వేస్తాయి. కివర్స్ మార్ట్‌గేజ్ రుణానికి ఎన్‌బీఎఫ్‌సీల కంటే బ్యాంకులే మెరుగైన ఆప్షన్.

సమర్పించాల్సినవి ఇవీ...

రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకోవాలని అనుకునే వారు.. గుర్తింపు, నివాస గుర్తింపు పత్రాలు ఇవ్వాలి. ప్రాపర్టీ అసలు పేపర్లు, గడిచిన ఆరు నెలల బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్, అప్పటికే ఏదైనా రుణం తీసుకుని ఉంటే దానికి సంబంధించి చివరి ఏడాది స్టేట్‌మెంట్ సమర్పించాల్సి ఉంటుంది.

ఎందుకు ఆదరణ లేదు..?

రివర్స్ మార్ట్‌గేజ్ గురించి అందరికీ తెలియకపోవడం ఇది పెద్దగా విస్తరించపోవడానికి ఒక కారణం. సాధారణంగా ఇంటితో అనుబంధం ఉంటుంది. అంత సులభంగా దాన్ని తెంపుకోలేరు. తమ గుర్తుగా, వారసత్వంగా పరిగణిస్తుంటారు. బ్యాంకులు దీని గురించి ప్రచారం చేయకపోవడం కూడా ఒక ముఖ్య కారణం. ఎక్కడా ప్రకటనలు ఇవ్వవు. కనీసం వాటి వెబ్‌సైట్ల లోనూ వివరాలను అందుబాటులో ఉంచవు. బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిందే. ఎందుకంటే ఉదాహరణకు బ్యాంక్ 15 ఏళ్ల కాలానికి రివర్స్ మార్ట్‌గేజ్ రుణం ఇచ్చిన తర్వాత.. ఇంటి యజమాని 30 ఏళ్లు జీవించారని అనుకుందాం. అప్పటి వరకు ఆ ఇంటిని బ్యాంకులు ఏమీ చేయలేవు. ఇచ్చిన రుణాన్ని స్వచ్ఛందంగా చెల్లిస్తే తప్ప అవి వసూలు చేసుకోలేవు. రుణ గ్రహీత చనిపోయే వరకు ఆగాల్సిందే.

ప్రత్యామ్నాయం ఉందా..?

నివసిస్తున్న ఇల్లు వారసులకు అవసరం లేనట్టయితే అప్పుడు దాన్ని విక్రయించే ఆప్షన్‌ను కూడా పరిశీలించొచ్చు. మంచి విలువ పలికే ప్రాంతంలో ఉంటే విక్రయించి, తక్కువ రేటున్న ఇంటిని కొనుగోలు చేసుకోవడం ఒక మార్గం. ఈ రూపంలో మిగిలిన మొత్తాన్ని స్థిరాదాయ పథకాల్లోకి మళ్లించుకుని ప్రతి నెలా ఆదా యం వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు.

వీటిని దృష్టిలో పెట్టుకోవాలి...

- 60 ఏళ్లు నిండిన ఎవరైనా రివర్స్ మార్ట్‌గేజ్ రుణానికి అర్హులు. జీవిత భాగస్వామి సహ దరఖాస్తుదారు అయితే ఆమె వయసు 55–58 ఏళ్లకు తక్కువ ఉండకూడదు. బ్యాంకుల మధ్య ఇది వేర్వేరుగా ఉంది.
- గరిష్ఠంగా రూ.కోటి వరకే రుణం లభిస్తుంది. ఈ మొత్తాన్ని రుణ గ్రహీత ఏ అవసరం కోసం అయినా వినియోగించుకోవచ్చు.
- ఇంటి విలువ, రుణ గ్రహీత వయసు, అమల్లో ఉన్న వడ్డీ రేటు ఆధారంగా రుణం మొత్తాన్ని, కాల వ్యవధిని బ్యాంకులు నిర్ణయిస్తాయి.
- కనీసం పదేళ్లు, గరిష్ఠంగా 20 ఏళ్ల కాలాన్ని చాలా బ్యాంకులు అమలు చేస్తున్నాయి.
- సొంతిల్లు అయి ఉండి, దాన్ని అద్దెకు ఇవ్వకుండా, అందులో నివసిస్తుంటే రివర్స్ మార్ట్‌గేజ్ చేసుకోవచ్చు.
- ఇంటిపై ఎలాంటి వివాదాలు ఉండకూడదు.
- వాణిజ్య ఆస్తిపై రివర్స్ మార్ట్‌గేజ్‌కు అవకాశం లేదు.
- తనఖా పెట్టే ఇంటి జీవన కాలం అక్కడి నుంచి 20 ఏళ్లకు తక్కువ కాకుండా ఉండకూడదు.
- ప్రాసెసింగ్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, ప్రాపర్టీ ఇన్సూరెన్స్, వీటిపై జీఎస్‌టీ చార్జీలను చెల్లించాలి.
- పెనాల్టీ లేకుండా ఎప్పుడైనా ఈ రుణం మొత్తాన్ని తిరిగి చెల్లించొచ్చు.
- ప్రతి ఐదేళ్లకోసారి ప్రాపర్టీ విలువను బ్యాంక్‌లు మదింపు వేస్తాయి.
- రివర్స్ మార్ట్‌గేజ్ కింద తనఖా పెట్టిన ఇంటిని నవీకరించాలని అనుకుంటే, బ్యాంక్ నుంచి అనుమతి తీసుకోవాలి.
- ఇంటి నిర్వహణకు అయ్యే ఖర్చులను రుణ గ్రహీత (ఇంటి యజమాని) పెట్టుకోవాల్సిందే. అంతేకాదు ఆ ఇంటికి సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్, ఇతర పన్నులు ఏవైనా ఉంటే అందులో నివసిస్తున్న వారే చెల్లించుకోవాలి.



ఏయూ స్మాల్ ఫైనాన్స్ బిజినెస్ రూపే క్రెడిట్ కార్డ్



హైదరాబాద్: ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎన్‌పీసీఐ భాగస్వామ్యంతో బిజినెస్ క్యాష్ బ్యాక్ రూపే క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. వ్యాపారస్తుల కోసం దీన్ని ప్రత్యేకంగా తీసుకొచ్చింది. కార్డు ద్వారా కొనుగోళ్లపై 2 శాతం వరకు క్యాష్ బ్యాక్, 48 రోజుల పాటు వడ్డీ లేని రుణ సదుపాయం, తక్షణ రుణ సదుపాయం ఈ కార్డులో భాగంగా ఉంటాయని ప్రకటించింది. అలాగే అగ్ని ప్రమాదాలు, దోపిడీలు, ఇళ్లు బద్దలు కొట్టడం తదితర వాటికి కార్డులో భాగంగా బీమా కవరేజీ పొందొచ్చని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. ఎన్‌పీసీఐ సీఈవో దిలీప్ ఆస్బే సమక్షంలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ, సీఈవో సంజయ్ అగర్వాల్ ఈ కార్డును ప్రారంభించారు. ఈ కార్డుపై లైఫ్ స్టయిల్, ట్రావెల్ ప్రయోజనాలు కూడా ఉన్నట్టు బ్యాంక్ ప్రకటించింది. 300కు పైగా రెస్టారెంట్లలో 30% వరకు తగ్గింపు, ఏడాదికి 8 సార్లు రైల్వే లాంజ్‌లను ఉచితంగా వినియోగించుకునే సదుపాయం ఉంటుందని తెలిపింది.

యస్ కిరణ్ సోలార్ ఫైనాన్సింగ్

యస్‌బ్యాంక్ 'యస్ కిరణ్ సోలార్ ఫైనాన్సింగ్' పేరుతో ప్రత్యేక రుణ పథకాన్ని ప్రకటించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) తమ ప్రాంగణాల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడానికి కావాల్సిన రుణాలను యస్ బ్యాంక్ ఈ పథకం కింద అందిస్తుంది. సుస్థిర ఇంధన విధానాలను ఎంఎస్‌ఎంఈలు అనుసరించేందుకు ఈ కార్యక్రమం ద్వారా యస్ బ్యాంక్ మద్దతిస్తుందని ప్రకటించింది.

ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 96 టార్గెట్: రూ. 125

ఎందుకంటే: గతేడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం 47 శాతం జంప్‌చేసింది. రూ. 500 కోట్లను తాకింది. రుణ వ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం పుంజుకుని రూ. 1,680 కోట్లకు చేరింది. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) అంచనాలకు అనుగుణంగా 9 శాతం బలపడి రూ. 1,240 కోట్లయ్యింది. అయితే మొత్తం రుణ ఆస్తులు 8 శాతం క్షీణించాయి. హోల్‌సేల్ రుణ ఆస్తులు 53 శాతం నీరసించడం ప్రభావం చూపింది. కాగా.. యాజమాన్య వ్యూహాల ప్రకారం రిటైల్ రుణ ఆస్తుల వేగవంత వృద్ధి కొనసాగింది. 35 శాతం ఎగశాయి. దీంతో కంపెనీ రుణ మిక్స్‌లో ప్రస్తుతం రిటైల్ రుణ ఆస్తుల వాటా 75 శాతానికి చేరింది. ఇటీవల నిర్వహించిన విశ్లేషకుల సమావేశంలో కంపెనీ యాజమాన్యం రిటైల్ విభాగంపై మరింత దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. తద్వారా మొత్తం లోన్‌బుక్‌లో రిటైల్ విభాగం పోర్ట్‌ఫోలియోను 90 శాతానికి పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు వీలుగా గ్రామీణ, మైక్రో, గ్రూప్ రుణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేసింది. ఇక మరోవైపు వృద్ధికి వీలుగా అనలిటిక్స్‌పై ప్రత్యేక దృష్టి, ప్రస్తుత కస్టమర్లకు విభిన్న ప్రొడక్టుల విక్రయం, టెక్నాలజీపై నిరవధిక పెట్టుబడులు తదితరాలను చేపడుతోంది. వెరసి 2.8–3 శాతం ఆర్‌వోఏ సాధించే లక్ష్యంగా సాగుతోంది. రిటైల్ పోర్ట్‌ఫోలియోను పెంచుకోవడం కంపెనీకి లబ్ధిని చేకూర్చే వీలుంది.



గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ | వెంచురా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 418 టార్గెట్: రూ. 813

ఎందుకంటే: లూబ్రికెంట్స్ విభాగంలో దేశీయంగా క్యాస్ట్రాల్ తదుపరి రెండో పెద్ద కంపెనీగా గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా నిలుస్తోంది. మార్కెట్ వాటాను పెంచుకోవడంతోపాటు.. గత మూడేళ్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులలోనూ పటిష్టస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా సమర్ధతను చాటుకుంది. వాణిజ్య వాహన విభాగ వాతావరణం(సైకిల్) ఊపందుకోవడం, జాతీయ రహదారులపై రవాణా పుంజుకోవడం, జోరు చూపుతున్న పారిశ్రామికోత్పత్తి, యుటిలిటీ వాహన విక్రయాలలో వృద్ధి వంటి అంశాలు లూబ్రికెంట్స్‌కు డిమాండును పెంచనున్నట్లు అంచనా. వెరసి బిజినెస్ టు బిజినెస్(బీటూబీ) విభాగం నుంచి లూబ్రికెంట్స్ విక్రయాలు ఊపందుకోనున్నాయి. ఇది అంతిమంగా కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది. కంపెనీ లూబ్రికెంట్స్, చమురు అమ్మకాల పరిమాణంలో బీటూబీ విభాగం నుంచి 35– 40 శాతం నమోదవుతుండటం కంపెనీకి బలాన్నిస్తోంది. దీనికితోడు అమ్మకాలలో 65 శాతంవరకూ వాటాను ఆక్రమిస్తున్న బిజినెస్ టు కన్జూమర్(బీటూసీ) లూబ్రికెంట్ బిజినెస్ విస్తరణపైనా కంపెనీ కన్నేసింది. ఇందుకు అనుగుణంగా కొత్త ప్రాంతాలలో డీలర్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. బీటూబీ బిజినెస్‌తో పోలిస్తే బీటూసీలో మెరుగైన మార్జిన్లు ఆర్జిస్తోంది. ఇలాంటి పలు వ్యూహాత్మక అంశాలు కంపెనీ మార్కెట్ వాటాను పెంచనున్నాయి. ఆర్థిక పనితీరు మెరుగుకు దోహదపడనున్నాయి. వెరసి భవిష్యత్‌లో దేశీ లూబ్రికెంట్స్ మార్కెట్లో నాయకత్వ స్థాయికి చేరే అవకాశముంది.



ఐపీపీబీ ఖాతాదారులకు బజాజ్ అలియాంజ్ బీమా

BAJAJ Allianz
Bajaj Allianz Life Insurance Co. Ltd.

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాదారులకు బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది ఇండియాపోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారులకు ప్రత్యేకం. చిన్న మొత్తంలో ప్రీమియం చెల్లించడం ద్వారా బీమా రక్షణ పొందొచ్చని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. పాలసీదారు మరణించిన సందర్భంలో తక్షణమే పరిహారంతో పాటు, 5, 7, 10 ఏళ్లపాటు కుటుంబ అవసరాలకు నెలవారీ చెల్లించే సదుపాయాలు ఇందులో ఉన్నట్టు పేర్కొంది.


ప్రతి లక్ష్యానికి ప్రత్యేక పోర్ట్‌ఫోలియో కావాలా?

Q & A

నాకు ఎనిమిది వరకు ఆర్థిక లక్ష్యాలు ఉన్నాయి. ప్రతీ లక్ష్యానికి విడిగా పోర్ట్‌ఫోలియో ఏర్పాటు చేసుకోవాలా? అలా అయితే పర్యవేక్షణకు ఇబ్బంది కాదా?

– శివాని

లక్ష్యాలు, పోర్ట్‌ఫోలియో మధ్య సమతూకం ఉండాలి. ముందుగా సమీప కాలంలోని లక్ష్యాలను వేరు చేయండి. అలాగే, మధ్య కాలం, దీర్ఘకాల లక్ష్యాలను కూడా వేరు చేయండి. ఇప్పుడు స్వల్పకాల, మధ్యకాల లక్ష్యాలను సైతం.. రాజీ పడతగ్గ, రాజీ పడలేని అనే రెండు విభాగాలుగా వేరు చేయండి. రాజీపడలేని అంటే రిస్క్ తీసుకోని పెట్టుబడులు. రిస్క్ తీసుకోలేని మధ్యకాలం లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ/డెట్) సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. వీటి కోసం ఒక్కటే పోర్ట్‌ఫోలియో సరిపోతుంది. ఈ పెట్టుబడుల కోసం ఈక్విటీలపై ఆధారపడకూడదు. అవసరమైనప్పుడు వెంటనే తీసుకునేందుకు అనుకూలంగా ఉండాలి. ఇక దీర్ఘకాలం కోసం ఉద్దేశించిన పెట్టుబడులను అంటే తదుపరి ఐదేళ్ల కాలం వరకు అవసరం లేని పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవాలి. ప్రతీ లక్ష్యానికి విడిగా ఎంత చొప్పున కావాలి, ఎంత వ్యవధి ఉందనే దాని ఆధారంగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ లక్ష్యానికి కావాల్సిన నగదు మీరు కోరుకున్న సమయంలో లభించేలా ప్రణాళిక ఉండాలి. ఉదాహరణకు వచ్చే మూడేళ్ల కాలంలో రూ.5 లక్షలు కావాలి, ఐదేళ్లలో రూ.5 లక్షల కావాలనుకుంటే లేదా 25–30 ఏళ్లలో రూ.కోటి రూపాయలు (రిటైర్మెంట్) కావాలనుకుంటే అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. వేర్వేరు పోర్ట్‌ఫోలియోలన్నవి కాలవ్యవధికి అనుగుణంగానే ఉండాలి. స్వల్పకాల లక్ష్యాల కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఐదేళ్లకు మించిన ఏ లక్ష్యానికైనా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అప్పుడు లక్ష్యాల వారీగా కాకుండా, కాలవ్యవధి ఆధారంగా ప్రత్యేక పోర్ట్‌ఫోలియోలు ఉంటాయి. ఇందుకోసం వ్యాల్యూరీసెర్చ్ ఆన్‌లైన్‌లో 'మై ఇన్వెస్ట్‌మెంట్' టూల్‌ను వినియోగించుకోవచ్చు. ఒకటికి మించిన పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకున్నప్పుడు వివిధ లక్ష్యాలకు అనుగుణంగా ఈ టూల్‌తో వేరు చేసుకోవచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్స్‌లో ఏది మంచిదనే విషయంలో సందేహం నెలకొంది. పథకం ఎంపిక చేసుకోవడం ఎలా?

– స్వామినాథన్

ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో పరిశీలించాల్సిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10–15 బేసిస్ పాయింట్ల (0.1–0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక యాక్టివ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకుని ఇంతకంటే ఎక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సిన అవసరం లేదు. రెండోది ట్రాకింగ్ ఎర్రర్. ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పనిచేసిందో చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతోపాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా చేసుకుని చూస్తే ఎస్‌బీఐ, యూటీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సంస్థల పథకాలు మెరుగ్గా పనిచేస్తున్నాయి.



అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. రాజ్‌భవన్ పరివార్‌లోని వయోవృద్ధులైన మాతృమూర్తులు, ఇటీవలే మొదటిసారి తల్లులైన యువతులతో కలసి వేడుకలలో పాల్గొన్నారు. వారిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.



శంషాబాద్ జీఎమ్మార్ ఎరీనా ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి దంపతుల కుమార్తె మనీషా వివాహ వేడుకకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, కాలె యాదయ్య, జైపాల్ యాదవ్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులున్నారు.



భవనంలో ఉన్న ఎలుగుబంటిని పరిశీలిస్తున్న మంత్రి

సూర్యాపేటలో ఆపరేషన్ ఎలుగుబంటి

పర్యవేక్షించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: సూర్యాపేట పట్టణం నడిబొడ్డున ఎలుగు బంటి ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. ఆదివారం శ్రీనివాసనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లోకి ఎలుగు ప్రవేశించింది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఎలుగుబంటికి ఎలాంటి అపాయం కలగకుండా క్రమక్రమంగా మత్తు మందు డోసును ఇచ్చారు. దాదాపు 3గంటలకు పైగా ఈ ఆపరేషన్ కొనసాగింది. మత్తులోకి వెళ్లిన ఎలుగుబంటిని వరంగల్ జూపార్క్‌కు తరలించినట్లు ఫారెస్ట్, పోలీసు అధికారులు తెలిపారు.

రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

కాగా, ఎలుగుబంటి ప్రవేశించిన ఇంటి వద్దకు మంత్రి జగదీశ్‌రెడ్డి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. తొమ్మిది నెలల క్రితం తిరుమలగిరిలో కనబడిన ఎలుగు బంటి.. ప్రస్తుతం సూర్యాపేటలో చిక్కిన ఎలుగుబంటి ఒకటేనని ఫారెస్ట్ అధికారులు మంత్రికి వివరించారు.

మాతా, శిశు సంరక్షణకు 28 కేంద్రాలు


ట్విట్టర్ వేదికగా మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మాతా, శిశు సంరక్షణ కోసం రాష్ట్రంలో 28 కేంద్రాలు పనిచేస్తున్నాయని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. అంతర్జాతీయ తల్లుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ వేదికగా మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. బిడ్డ కడుపులో పడగానే ప్రతీ తల్లికి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, బిడ్డ పుట్టగానే కేసీఆర్ కిట్, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ఆరోగ్య లక్ష్మి, ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి సత్వర చికిత్స అందించేందుకు ఆరోగ్య మహిళ, వ్యాధి నిరోధకశక్తి పెంచేందుకు వందశాతం ఇమ్యునైజేషన్, ఇంటి నుంచి ఆసుపత్రికి, తిరిగి ఆసుపత్రి నుంచి ఇంటికి ఉచిత ప్రయాణ సేవల కోసం అమ్మ ఒడి వాహనాలు.. వంటి సేవలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 28 మాతా శిశు సంరక్షణ కేంద్రాలు నెలకొల్పి అనుక్షణం తల్లీబిడ్డకు సేవలందిస్తున్న ప్రభుత్వం తెలంగాణలో మాత్రమే ఉందని పేర్కొన్నారు. అందుకే మాతృమరణాలు తగ్గించడంలో దేశంలోనే తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని మంత్రి ట్విట్టర్ వేదికగా వెల్లడించారు.

ప్రగతి ప్రతిబింబించేలా దశాబ్ది ఉత్సవాలు

సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదేళ్లలో ప్రతి శాఖ సాధించిన విజయాలను ప్రతిబింబించేలా డాక్యుమెంటరీలు, కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తొమ్మిదేళ్ల వాస్తవాలు, గణాంకాలు, సాధించిన విజయాలను వివరించే డాక్యుమెంటరీలను రాష్ట్ర స్థాయిలో ప్రతి శాఖ రూపొందించాలని, ముఖ్యమైన పబ్లిక్ స్మారక చిహ్నాలు, భవనాలకు విద్యుదలంకరణ చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమాలతో పాటు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21 రోజుల పాటు ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు పలు సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు.

పెళ్లి అక్కడే అన్నది

కొత్తకొత్తగా ఉన్నది...

డెస్టినేషన్ వెడ్డింగ్‌కు పెరుగుతున్న క్రేజ్

భారతీయ జంటలు వివాహ వేడుకలకు కొత్త ప్రాంతాలను అన్వేషిస్తున్నాయి. వివాహమనే మధుర ఘట్టాన్ని జీవితంలో మరువురాని క్షణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. అందుకే చారిత్రక, సాంస్కృతిక, బీచ్, పర్యాటక ప్రాశస్త్యం కలిగిన కేంద్రాలను పెళ్లి వేదికలుగా మార్చుకుంటున్నాయి. ఫలితంగా దేశంలో సంప్రదాయ వివాహాలకు భిన్నంగా 'డెస్టినేషన్ వెడ్డింగ్స్'కు ప్రాధాన్యత పెరుగుతోంది. ఆర్థికంగా స్థిరపడినవారు విదేశాలకు వెళ్లి పెళ్లిళ్లు చేసుకుంటుంటే.. మధ్యతరగతి ప్రజలు దేశంలోని సుదీర్ఘ, మూరుమూల ప్రాంతాల్లో పెళ్లిపీటలు ఎక్కుతున్నారు.

- సాక్షి, అమరావతి



పెళ్లిపీటలు ఎక్కేందుకు కొత్త ప్రాంతాల్ని అన్వేషిస్తున్న భారతీయ జంటలు

థాయ్‌లాండ్‌లో జరిగే విదేశీ వివాహాల్లో 60 శాతం భారతీయులవే

దేశంలో వెడ్డింగ్ టూరిజం పాలసీ తీసుకొచ్చే దిశగా కేంద్రం అడుగులు

అతిథులు తక్కువ.. ఖర్చు ఎక్కువ!

కోవిడ్ సమయంలో తక్కువ మంది అతిథుల మధ్య వివాహాలు జరిగాయి. ఫలితంగా పెళ్లిళ్ల బడ్జెట్ కూడా తగ్గింది. అయితే కోవిడ్‌కి ముందు పెళ్లికి హాజరయ్యే సగటు అతిథుల సంఖ్య 350–400గా ఉండేది. కానీ.. ప్రస్తుతం ఇది 150నుంచి 250 వరకు వచ్చింది. అయినప్పటికీ పెళ్లిళ్ల బడ్జెట్లు మాత్రం భారీగా ఉంటున్నాయి. అతిథుల జాబితాలు తగ్గిపోయినప్పటికీ.. వివాహాలను వైభవంగా చేసుకోవడానికి ఎక్కడా రాజీ పడట్లేదు. చాలామంది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు/వెడ్‌టెక్ సంస్థలను సంప్రదిస్తూ రిసార్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్‌లను ఎంచుకోవడమే ఇందుకు కారణం.

25 శాతం వివాహాలు భారతదేశంలోనే..: ప్రపంచవ్యాప్తంగా ఏటా జరిగే వివాహాల్లో 25 శాతం భారత్‌లోనే ఉంటున్నాయి. భూమ్మీద జరిగే ప్రతి నాలుగు పెళ్లిళ్లలో ఒకటి భారతీయులదే. ప్రపంచ వివాహ పరిశ్రమలో భారత్, చైనాల వాటాయే అత్యధికం. ఇక దేశీయంగా ఢిల్లీ, ముంబై, బెంగళూరు, గోవా, లక్షద్వీప్, కేరళ, హేవ్‌లాక్ ఐలాండ్, మహారాష్ట్రలోని ఆలీబాగ్ డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు కేంద్రాలుగా మారాయి. రాజస్థాన్ దేశంలోనే గొప్ప వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కొనసాగుతోంది. అక్కడి పురాతన కోటలు, రాజప్రాసాదాల మధ్య వివాహాలకు యువత ఆసక్తి చూపుతోంది. జైపూర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, జైసల్మేర్, రణతంబోర్, బికనీర్ వెడ్డింగ్ ప్లానర్లకు ప్రధాన కేంద్రాలు మారాయి. దేశంలో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు సగటున రూ.15 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఉన్నత వర్గాల్లో అయితే ఒక్కో అతిథికి రూ.60 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ సముద్ర తీర ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకునేందుకు యువత ఎక్కువ ఆసక్తి చూపడం విశేషం.

థాయ్‌లాండ్‌లో అత్యధికం..: భారతీయులు విదేశీ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా థాయ్‌లాండ్‌ను ఇష్టపడుతున్నారు. గత ఏడాది అక్కడ జరిగిన విదేశీ పెళ్లిళ్లలో 60% భారతీయులవే కావడం విశేషం. మునుపెన్నడూ లేనంతగా భారతీయ జంటలు బ్యాంకాక్, కో స్యామ్యూయ్, ఫుకెట్, హువా హిన్, చయాంగ్ మాయ్ వివాహ వేడుకలకు కేరాఫ్‌గా మారాయి. థాయ్ టూరిజం అథారిటీ సైతం భారత్‌లోని వెడ్డింగ్ ప్లానర్ల భాగస్వామ్యం కలిగి ఉండటంతో సగటు ఏటా 400 జంటలు బంధుమిత్ర సమేతంగా అక్కడకు వెళ్లి వివాహాలు చేసుకుంటున్నాయి.

భారతదేశంలో కూడా డెస్టినేషన్ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే ముసాయిదాను కూడా సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా 50కిపైగా డెస్టినేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు పుణ్యక్షేత్రాలు డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రాలుగా ఉన్నాయి. ఇకపై అరకు, కోనసీమ, విశాఖ సాగర తీరం, హార్సీహిల్స్, ఇరుక్కం దీవి, పిచ్చుకల్లంక, హోప్‌ఐలాండ్ ప్రాంతాలను విదేశీయులను సైతం ఆకర్షించేలా ఏపీటీడీసీ అభివృద్ధి చేయనుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.